28-03-2024
గురువారం
హైదరాబాద్
సంపుటి 26, సంచిక: 280
పేజీలు: 8 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 8
వెల రూ. 5.00
Published from:
Hyderabad, Khammam,
Karimnagar, Mahabubnagar

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM
తర తరాల పిల్లల కథలు
రూ॥70/-
పేజీలు:64

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

# దేశ ప్రధాన సమస్య నిరుద్యోగమే..

లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల్లోకి తీసుకెళ్తాం

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

యువతను తప్పుదోవ పట్టించేందుకు ప్రధాని మోడీ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శ





**న్యూఢిల్లీ :** యువతను తప్పుతోవ పట్టించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎన్ని ప్రయత్నాలు చేసినా గానీ నిరుద్యోగమే దేశ ప్రధాన సమస్య అని, ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రముఖంగా దీనిని ప్రజల దృష్టికి తెస్తామని కాంగ్రెస్‌పార్టీ స్పష్టం చేసింది. కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే బుధవారంనాడు ఎక్స్ వేదికగా అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) భారత ఉద్యోగ నివేదిక–2024, మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఐహెచ్‌డి) విడుదల చేసిన నివేదికలను ఉటంకిస్తూ, ''దేశ యువతీ యువకుల్లో ఉన్న నిరుద్యోగానికి నరేంద్రమోడీ వక్ర భాష్యం చెప్పవచ్చు, దృష్టి మళ్ళించే ప్రయత్నం చేయవచ్చు, యువతను తప్పుతోవ పట్టించవచ్చు, కానీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో దేశ భవిష్యత్తును నిర్వచించే ప్రధాన సమస్య ఇదే, ఈ సమస్య పరిష్కారానికి కాంగ్రెస్‌పార్టీ వద్ద ఒక నిర్మాణాత్మకమైన ప్రణాళిక ఉంది'' అన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే ఈ సమస్యలు పరిష్కరిస్తుందని ఖర్గే పేర్కొన్నారు. యువన్యాయ్ పథకం కింద కేంద్ర ప్రభుత్వంలో ఉన్న 30 లక్షల ఉద్యోగాలను తాము భర్తీ చేస్తామని చెప్పారు. దేశానికి ఇప్పుడు నిరుద్యోగ సమస్య కొరకరాని కొయ్యగా మారిందనీ, దీనిని సత్వరం యుద్ధ ప్రాతిపదికపై పరిష్కరించకపోతే ఏ క్షణంలోనైనా ఒక ప్రమాదకరమైన, అసాధారణ సమస్యగా మారుతుందని ఖర్గే హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం ఈ విషయంలో దీర్ఘకాలంగా అనుసరిస్తున్న ఉదాసీనభావం దేశ యువతకు అతిపెద్ద ఘాతంగా తగిలిందని, వారు ఇన్నాళ్ళూ దీనిని తరువాయి 2లో



# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

## ఆరుగురు మావోయిస్టులు హతం

ప్రజాపక్షం/ బిజాపూర్ / భద్రాచలం

తుపాకుల మోతతో ఛత్తీస్‌గఢ్ బిజాపూర్ జిల్లా మరోసారి దద్దరిల్లింది. మావోయిస్తుల, భద్రతా బలగాల మధ్య బుధవారం హోరాహోరీగా ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు డిప్యూటీ కమాండర్ పూనం నగేష్, ఆయన భార్య, మరో మహిళ సహా ఆరుగురు మావోయిస్టులను బలగాలు మట్టబెట్టాయి. ఈ ఆరుగురు తలపై రూ.14 లక్షల రివార్డు ఉన్నట్లు అధికారులు చెప్పారు. నగేష్‌కు భద్రతా బలగాలపై జరిగిన అనేక దాడులతో సంబంధాలున్నాయన్నారు. బసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిపుర్‌భట్టి గ్రామ సమీపంలో తాల్పేరు నది వెంబడి ఉన్న అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు తరువాయి 2లో



# 17వ లోక్‌సభలో 222 బిల్లులు ఆమోదం

సభలో ప్రవేశపెట్టిన రోజే 45 బిల్లులు పాస్ : ఎడిఆర్

**ఉజ్జయిని :** ప్రస్తుత లోక్‌సభ (17వ)లో మొత్తం 222 బిల్లులు ఆమోదం పొందాయి. అందులో 45 బిల్లులు ప్రవేశపెట్టిన రోజే పాస్ అయినట్లు అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) విశ్లేషణలో తేలింది. ఈ బిల్లుల్లో నిధుల కేటాయింపు బిల్లు, జమ్ముకశ్మీర్ విభజన (నెం.2) బిల్లు, జిఎస్‌టి (సవరణ) బిల్లు 2023, తరువాయి 8లో

# 14 మంద అభ్యర్థులతో కాంగ్రెస్ 8వ జాబితా

తెలంగాణలో మరో నాలుగు స్థానాలకు అభ్యర్థుల ఎంపిక



**న్యూఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే లోక్‌సభ అభ్యర్థుల ఎనిమిదో జాబితాను కాంగ్రెస్ బుధవారం రాత్రి ప్రకటించింది. 14 మందితో కూడిన జాబితాను విడుదల జేసింది. అందులో తెలంగాణలోని నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. అలాగే జార్ఖండ్‌లో మూడు స్థానాలకు, మధ్యప్రదేశ్‌లో మూడు సీట్లకు, ఉత్తరప్రదేస్‌లో నాలుగు స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రకటించింది. ఇక తెలంగాణలో ఆదిలాబాద్ నుంచి ఆత్రం సుగుణ , నిజామాబాద్ నుంచి టి. జీవన్‌రెడ్డి మెదక్ నుంచి నీలం మధు, భువనగిరి నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేయనున్నారు.

కేరళ సిఎం కుమార్తెపై మనీలాండరింగ్ కేసు 08



# హైకోర్టుల్లోనూ మౌలిక సౌకర్యాల్లేవ్

ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువయ్యేలా మార్పులు రావాలి

తెలంగాణ హైకోర్టు నూతనభవన శంకుస్థాపనలో సిజెఐ జస్టిస్ డి.వై చంద్రచూడ్

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి

కింది స్థాయి కోర్టుల్లోనే కాదు,హైకోర్టులలోనూ మౌలిక సౌకర్యాల కొరత ఉందని, ప్రజలకు న్యాయ సేవలు మరింత చేరువయ్యేలా మార్పులు రావాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై చంద్రచూడ్ ఆకాంక్షించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో తెలంగాణ నూతన హైకోర్టు భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన తరువాయి 2లో



పెళ్లి ట్రాక్టర్ బోల్తా
ముగ్గురు మృతి
20 మందికి గాయాలు
03

# నేడు కోర్టు ముందుకు నిజాలు

ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ భార్య సునీతాకేజ్రీవాల్ ప్రకటన

సోదాల్లో ఒక్క పైసా కూడా స్వాధీనం చేసుకోలేదని వెల్లడి



**న్యూఢిల్లీ :** మద్యం అవినీతి కేసులో గురువారం 28 వ తేదీన తన భర్త కోర్టులో నిజాన్ని వెల్లడించనున్నారని ఢిల్లీ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ ప్రకటించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు పదే పదే దాడులు, సోదాలు చేసినప్పటికీ ఒక్క రూపాయి కూడా దొరకలేదని ఆమె అన్నారు. ఢిల్లీ ప్రభుత్వం రూపొందించిన రద్దైపోయిన ఎక్సైజు విధానానికి సంబంధించిన అవినీతి కేసులో తన భర్త గురువారంనాడు కోర్టులో నిజాన్ని వెల్లడించనున్నారన్నారు. బుధవారనాడు సునీతా కేజ్రీవాల్ దృశ్య మాధ్యమ పద్ధతిలో మీడియాతో తరువాయి 2లో





## ఢిల్లీ అసెంబ్లీ ఆవరణలో ఆప్, బిజెపి పోటాపోటీ నిరసనలు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), ప్రతిపక్ష బిజెపి ఎంఎల్‌ఎల ఆందోళనలతో అసెంబ్లీ ఆవరణ దద్దరిల్లింది. ఢిల్లీ మద్యం కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆప్ శాసనసభ్యులు, పార్టీ మద్దతుదారులు ప్రధాని నరేంద్రమోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అదే విధంగా జైలులో ఉన్న ముఖ్యమంత్రి కేజ్రీవాల్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష బిజెపి ఎంఎల్‌ఎలు నిరసన ప్రదర్శనకు దిగారు. రెండు పార్టీలు కూడా ఒకేసారి నిరసన ప్రదర్శనకు దిగాయి. బిజెపి శాసనసభ్యులు ప్లకార్డులు చేబూని ర్యాలీ చేయగా, ఆప్ నాయకులు, కార్యకర్తలు పసుపురంగు టిషర్ట్‌లు ధరించి మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అసెంబ్లీ ప్రారంభానికి ముందు ఆప్ ఎంఎల్‌ఎలు సభ వెలుపలు నిరసన ప్రదర్శన తరువాయి 2లో

## ఇడి అరెస్టు విషయంలో జోక్యం చేసుకోం

కేజ్రీవాల్ పిటిషన్‌ను తిరస్కరించిన ఢిల్లీ హైకోర్టు

అరెస్టు రాజ్యాంగ విరుద్ధం : న్యాయవాది సింఘ్వి

**న్యూఢిల్లీ:** ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసిన విషయంలో తాము జోక్యం చేసుకోబోమని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణ కాంత శర్మ బుధవారంనాడు స్పష్టం చేశారు. తనకు ఇడి బందిఖానా నుండి విముక్తి కలిగించాలనీ, తాత్కాలికంగగానైనా ఉపశమనానికి అవకాశం ఇవ్వాలని కేజ్రీవాల్ ఢిల్లీ కోర్టును తరువాయి 2లో




# కరువుపై బిఆర్‌ఎస్ రాజకీయం చేయొద్దు

వాస్తవాలకు విరుద్ధంగా మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి

కాంగ్రెస్ వచ్చిందని.. కరువు వచ్చిందని.. కరువు, వర్షపాతంపై బిఆర్‌ఎస్ రాజకీయం చేస్తుందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరువుకు బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు కారణం కాదని, ప్రకృతి వైపరిత్యాలే కారణమన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడారు. 2023 డిసెంబర్ కంటే ముందు వర్షపాతం నమోదు తక్కువగా ఉందని, ప్రస్తుతం రాష్ట్రంలో తాగునీటి, సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమీక్షలు జరుపుతున్నారన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు కరువుపై వాస్తవాలు విరుద్ధంగా మాట్లాడటం తరువాయి 2లో

# దేశాభివృద్ధిపై ఆర్భాట ప్రచారాలు..

భారత ప్రభుత్వ తీరుపై ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రాజన్



**న్యూఢిల్లీ:** భారత దేశాభివృద్ధిపై ఆర్భాట ప్రచారాలే తప్ప, వాస్తవాలు లేవు. వృద్ధిని అతిగా చూపిస్తూ భారత ప్రభుత్వం పెద్ద తప్పు చేస్తున్నది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మాజీ గవర్నర్ బ్లూమ్‌బెర్గ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. గోరంతను కొండంతలు చేసి చూపడడం భవిష్యత్తులో ఎన్నో సమస్యలకు కారణమవుతుందని పేర్కొన్నారు. 'ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం ఎదుర్కోనున్న సవాళ్లలో ఉద్యోగులకు పని పట్ల అవగాహన, వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరచడం అనేవి అత్యంత ప్రధానమైనవి. అదే సమయంలో బలమైన ఆర్థిక వృద్ధికి సంబంధించి జరుగుతున్న ప్రచారాన్ని విశ్వసించడం పొరపాటే. ఎందుకంటే, దేశం ఒక గొప్ప లక్ష్యాన్ని చేరుకోవడానికి గణనీయంగా కృషి చేయాలి. సామర్థ్యాన్ని పెంచుకోవాలి. నిర్మాణాత్మకంగా సమస్యలు పరిష్కరించుకోవాలి. శ్రామికులకు వృత్తిపరమైన విద్యను అందించడం, నైపుణ్యాలను పెంపొందించడం వంటి అంశాలను విస్మరిస్తే, పరిణామాలు తీవ్రంగా ఉంటాయి' అన్నారు. భారత దేశం చైనాలా ఎందుకు ఎదగలేకపోయింది అనే ప్రశ్నకు సమాధానం వెతుక్కోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వృత్తి విద్య, నైపుణ్యాలను మెరుగుపరచకుండా, ఆ దిశగా ఎదురయ్యే సమస్యలు పరిష్కరించకుండా యువ జనాభాతో ప్రయోజనాలను పొందడం దేశానికి కష్టసాధ్యమవుతుందని రాజన్ స్పష్టం చేశారు. 'ప్రపంచంలోనే అత్యధికంగా యువత ఉన్న దేశం మనది. కానీ, ఈ ఈ యువశక్తిని సమర్థంగా వినియోగించుకుంటేనే అభివృద్ధి సాధ్యం. అయితే, ఈ దిశగా దృష్టి సారించకుండా, వృద్ధిపై అతిగా జరుగుతున్న ప్రచారాన్ని నమ్మడమే భారత్ చేస్తున్న పొరపాటు. ఈ హైప్‌ని నిజం చేయాలంటే, ఇంకా ఎన్నో సంవత్సరాలు కష్టపడాలి. అయితే, తాము సృష్టిస్తున్న హైప్‌ను ప్రజలు నమ్మాలని రాజకీయ నాయకులు కోరుకుంటున్నారు. కానీ, ఆ మాటలను విశ్వసించడం పెద్ద తప్పిదమే' అని రాజన్ వ్యాఖ్యానించారు. అంచనాలను తలకిందులు చేస్తూ, 2023– 24 ఆర్థిక సంవత్సరం, మూడో త్రైమాసికంలో భారత్ 8.4 శాతం వృద్ధిని సాధించిందని, రాబోయే కొద్ది సంవత్సరాల్లో భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతుందని ప్రధాని నరేంద్ర మోడీ పలు సందర్భాల్లో చెప్పిన మాటలను ఆయన గుర్తుచేశారు. కానీ, ఆ మాటలు సత్యదూరమని అన్నారు. ప్రస్తుతం సాధించినట్టు చెప్తున్న అభివృద్ధి వాస్తవంగా లేదని, అభివృద్ధి చెందిన దేశంగా భారత్ తరువాయి 2లో

# అక్కరకు రాని కష్టం

పనిచేసినా చేతికందని రొక్కం

చెల్లింపుల కోసం కూలీల ఎదురు చూపు

ఉపాధిలోనూ శ్రమ దోపిడీ



ప్రజాపక్షం/ ఖమ్మం

కరువు కాలంలో కుటుంబాలను పోషించుకునేందుకు వ్యవసాయ పనులు దొరక్క ఉపాధి హామీ పనికి వెళితే నెలలు గడిచినా చెల్లింపులు లేక పేద కుటుంబాలు అల్లాడుతున్నాయి. కష్టం చేసినా కడుపునిండని దయనీయ స్థితి వారిది. తెలంగాణ రాష్ట్రంలోని జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు సుమారు రూ.1098.51కోట్లు చెల్లించాల్సి ఉంది. గత నవంబరు మాసం నుండి చెల్లింపులు జరగడం లేదు. రాష్ట్రంలోని 32 జిల్లాల్లో జాతీయ ఉపాధి హా మీ పథకం పనులు చేసిన కూలీలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి సుమారు రూ.70 కోట్లు చెల్లించాల్సి ఉంది. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా వచ్చిన మహాత్మా గాంధీ తరువాయి 2లో

## రాష్ట్రంలో రోజు రోజుకు.. అధికమవుతున్న ఉష్ణోగ్రతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ ఏడాదిలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు ఆదిలాబాద్ జిల్లాలో నమోదయ్యాయి. మంగళవారం తలమడుగు, జైనథ్ మండలాల్లో గరిష్ఠంగా 42.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యింది. బేల మండలం చప్రాలలో 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్‌లో 42 డిగ్రీలకు పెరిగింది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లో 40.8 డిగ్రీల నుంచి 42.3 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న మూడు రోజులు కూడా సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణశాఖ వెల్లడించింది. రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికా సంస్థ ఎండల పెరుగుదలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ ఆరెంజ్ హెచ్చరికలను జారీచేసింది. ఆరుబయట పనిచేసే వారు, మధ్యాహ్నం పూట ప్రయాణాలు చేసేవారు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

సంయుక్తంగా నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ చేపడుతుండగా ఎన్‌కౌంటర్ జరిగినట్లు బస్తర్ రేంజ్ ఐజి సుందర్‌రాజ్ మీడియాకు తెలిపారు. పిఎల్‌జిఏ ప్లాటూన్ నెంబర్ 10కు చెందిన మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారం మేరకు డిఆర్‌జి, సిఆర్‌పిఎఫ్, కోబ్రా దళాలు సంయుక్తంగా ఆపరేషన్ ప్రారంభించాయన్నారు. ఈ నేపథ్యంలో బలగాలకు నక్సల్స్ తారసపడగా ఇరు వర్గాల మధ్య ఎదురు కాల్పులు జరిగాయన్నారు. కాల్పుల అనంతరం ఘటనాస్థలి నుంచి ఇద్దరు మహిళలు సహా ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలతో పాటు పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఐజి చెప్పారు. ఓ కార్బైన్ గన్, 9ఎంఎం పిస్టోల్, పది దేశీయ 9 ఎంఎం తపాకులు, 12 బోర్‌గన్, పది లైవ్ కార్ట్రిడ్జ్‌లు, మందులు, ఇతర నిత్యావసర వస్తువులు లభ్యమయ్యాయన్నారు. హతమైన నక్సల్స్‌ను పూనం నగేష్, ఆయన భార్య వెట్టి సోని (30), ఆయుటు పూనం (28), సుక్క ఓయం (40), నుప్పో మోక (30), కోవసి గంగి (27)లుగా గుర్తించామన్నారు. అయితే ఈ ఎదురు కాల్పుల్లో మరికొంత మంది నక్సల్స్ కూడా గాయపడినట్లు భావిస్తున్నారు. ఆ ప్రాంతంలో ఇంకా ఆపరేషన్ కానసాగుతుందని చెప్పారు. కాగా, బిజాపూర్ జిల్లా బస్తర్ లోక్‌సభ నియోజకవర్గంలో ఉంది. ఈ స్థానంలో ఏప్రిల్ 19న తొలి విడతలోనే ఎన్నికలు జరగనున్నాయి.

**వరుస ఘటనలు...** పార్లమెంట్ తో పాటు ఆయా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల వేళ మావోయిస్టులు అలజడి సృష్టించేందుకు చేస్తున్న ప్రయత్నాలు బెడిసి కొడుతున్నాయి. వరుస ఘటనలతో మావోయిస్టు పార్టీ ఉక్కిరిబిక్కిరవుతోంది. గత వారం రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌మహారాష్ట్ర సరిహద్దుల్లో నలుగురు మావోయిస్టులను చాకచక్యంగా భద్రతా బలగాలు మట్టుపెట్టాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్ అడవుల్లో ఆరుగురు మావోయిస్టులు హతమయ్యారు. షరతులతో కూడిన చర్చలకు సిద్దమని మావోయిస్టు పార్టీ ఈ మధ్యకాలంలో ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రికి లేఖను సైతం రాసింది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర భద్రతా బలగాలు మావోయిస్టు పార్టీని ఏరివేసేందుకు శతవిధాలుగా ప్రయత్నిస్తోంది. ఇందు కోసం అడవుల్లోనికి పెద్ద ఎత్తున బలగాలను మోహరిస్తోంది. వేసవిలో చెట్ల ఆకులు రాలి పలుచబడుతున్న తరుణంలో మావోయిస్టుల ఉనికిని సులువుగా కనిపెట్టి మట్టుపెట్టవచ్చనే ఆలోచనలతో బలగాలు అధునాతన ఆయుధాలతో అడవులను జల్లెడ పడుతోంది. మరో ప్రక్క మందుపాతరలు అమర్చి ఉంటారనే అనుమానంతో అడవుల్లోని ప్రతీ కాలిబాటను క్షుణ్ణంగా పరిశీలిస్తూ కూబింగ్ ముమ్మరం చేస్తున్నాయి.

**సరిహద్దుల్లో హై అలెర్ట్...** ఎన్‌కౌంటర్ నేపథ్యంలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాల సరిహద్దుల్లో హై అలెర్ట్ ప్రకటించారు. ఎన్నికల వేళ నిఘా పెంచిన బలగాలు, ఈ ఘటనతో మరింత అప్రమత్తమయ్యాయి. వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అనుమానితులను ప్రశ్నిస్తున్నారు. అడవుల్లోనుండి బయటకు వచ్చే రహదారులు, నదీ తీరాల వెంట నిఘా పెంచారు. మావోయిస్టు కొరియర్ల విషయంలో ఆరా తీస్తున్నారు. మావోయిస్టులకు సహకరిస్తే చట్ట రిత్యా చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## పోటాపోటీ నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

చేసి ఇడి కస్టడీ నుంచి కేజ్రీవాల్‌ను తక్షణే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ నేతలు భరద్వాజ్ సహా అతిశీ కూడా ఆందోళనలో పాల్గొన్నారు. కాగా, ముఖ్యమంత్రి కేజ్రీవాల్ రాజీనమా చేయాలని ప్రతిపక్షనేత రామ్‌వీర్ సింగ్ బిధూరి డిమాండ్ చేశారు. సిఎంపై దాదాపు డజన్ అవినీతి కేసులున్నాయని ఆరోపించారు. బిజెపి ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్చదేవ్ కూడా అసెంబ్లీ వెలుపల పార్టీ కార్యకర్తలతో కలిసి నిరసన ప్రదర్శన నిర్వహించారు. వీరిని అసెంబ్లీలోకి వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. అసెంబ్లీ ప్రధాన ద్వారానికి తాళం వేసి ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.

## జోక్యం చేసుకోం

(మొదటి పేజీ తరువాయి)

కోరారు. ఐతే ''తాత్కాలిక ఉపశమనంపై మీ స్పందన ఏమిటో తెలియజేయండి, ఏప్రిల్ 2వ తేదీ నాటికి మీ అభిప్రాయం చెప్పండి'' అని ఇడి అధికారులకు న్యాయమూర్తి నోటీసు జారీ చేశారు. ఈ కేసు విచారణను ఏప్రిల్ 3వ తేదీకి న్యాయమూర్తి వాయిదా వేశారు. ఈ విషయంపై వచ్చేనెల 3వ తేదీన తుది నిర్ణయం చెబుతామని, దీనిపై వాయిదా మంజూరు చేసే అవకాశం లేదని పేర్కొన్నారు. ఐతే కేజ్రీవాల్ అరెస్టు రాజ్యాంగ మౌలిక నిర్మాణ సూత్రాలకు విరుద్ధమని ఆయన తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది ఎ.ఎం.సింఘ్వి అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కస్టడీ నుండి తనను విడుదల చేయాలని, ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన కోర్టును కోరారు. తనను అరెస్టు చేయడానికి తగిన కారణం లభించలేదనీ, అందుకు తగిన సాక్ష్యాలు దొరకలేదనీ, ఐనాగానీ తన పార్టీనీ, తననూ గుడ్డివాళ్ళగా మార్చారనీ, అందువల్ల తనను తక్షణం విడుదల చేయాలనీ ఢిల్లీ హైకోర్టుకు కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారని సింఘ్వి చెప్పారు. కేజ్రీవాల్‌ను జైలులో బంధించవలసిన అవసరం లేనే లేదు, కానీ బంధించారు, హవాలా చట్టం కింద అరెస్టు అవసరం లేదు, ఆయన సహకరించడంలేదని, అందుకే అరెస్టు చేశామనీ ఆరోపించారు, అది అత్యంత హాస్యాస్పదమైన విషయం అని సింఘ్వి విమర్శించారు. ఐతే ఆయన తరపున సింఘ్వి దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై తాను నోటీసు జారీ చేస్తాననీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈ విషయంలో తగిన సమాధానం తమకు ఇవ్వడం కోసం వారికి కొంత సమయం ఇస్తామనీ న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణ కాంత శర్మ మౌఖికంగా చెప్పారు. ఈ విషయాలనే తాను తర్వాత బుధవారం పొద్దుపోయే సమయానికి వెబ్‌సైటులో కూడా అప్‌లోడ్ చేస్తానని చెప్పారని సింఘ్వి చెప్పారు. కానీ చివరకు కేజ్రీవాల్ పిటిషన్‌లో జోక్యం చేసుకోబోమని న్యాయమూర్తి తేల్చి చెప్పారు. కానీ తాత్కాలికంగా తన క్లయింటుకు ఉపశమనం కలిగించాలనీ, వెంటనే ఆయనను విడుదల చేయాలనీ సింఘ్వి కోర్టును అభ్యర్థించారు. కాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తరపున వాదనలకు హాజరైన అదనపు సొలిసిటర్ జనల్ ఎస్.వి.రాజు మాట్లాడుతూ, ఒక సుదీర్ఘమైన పిటిషన్ వారు దాఖలు చేశారనీ, లిఖితపూర్వకంగా ఈ విషయంపై తాము తమ సమాధానం చెప్పడానికి మూడు వారాలు గడువు కావాలనీ అన్నారు. తాత్కాలిక ఉపశమనం కేజ్రీవాల్‌కు ఇవ్వాలన్నా కూడా తమకు తగిన సమయం అవసరం అని ఆయన దాటవేత ధోరణిలో చెప్పారు. దీనిపై సింఘ్వి మండిపడ్డారు. ఇన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేసే విధానం పాటిస్తోందనీ, అందుకోసమే గడువు కావాలంటూ ఎత్తుగడలు వేస్తోందనీ విమర్శించారు. ఆయన్ను ఎందుకు అరెస్టు చేశారన్న విషయంలో సాక్ష్యాలు ఇవ్వడం వారికి సవాలుగా మారిందని సింఘ్వి చెప్పారు.మార్చి 21వ తేదీన అరవింద్ కేజ్రీవాల్‌ను ఇడి అధికారులు అరెస్టు చేశారు. 28 వరకూ ఆయనకు రిమాండ్ విధించారు.

# పంజాబ్, ఒడిశాలో ఏకాకిగా మిగిలిన బిజెపి

### హామీలివ్వకపోవడంతో అకాలీదళ్ ఆగ్రహం

### బిజెపి- ఎస్‌ఎడి పరస్పర దూషణలు

**చండీగఢ్ :** లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్, ఒడిశా రాష్ట్రాలలో బిజెపి ఏకాకిగా మిగిలిపోయింది. ఈ రెండు రాష్ట్రాలలో మిత్రపార్టీలతో జరగిన చర్చలు విఫలమయ్యాయి. వారరి భాగస్వామ్యపార్టీలు బిజెపితో పొత్తుకు తిరస్కరించాయి. పంజాబ్‌లో ఏదోవిధంగా లోక్‌సభ ఎనికల్లో సీట్లు గెలుచుకోవాలని బిజెపి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. శిరోమణి అకాలీదళ్ (ఎస్‌ఎడి) పార్టీతో మంగళవారంనాడు బిజెపి నాయకులు జరిపిన చర్చలు విఫలం కావడంతో రెండు పార్టీలమధ్య బంధం తెగిపోయింది. ఈ ఎన్నికల్లో తాము ఒంటరిగానే పోటీ చేస్తామని అనంతరం బిజెపి ఒక ప్రకటన విడుదల చేసింది. పంజాబ్‌లో మొత్తం 13 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఏదో దశలో జూన్ 1వ తేదీన పంజాబ్‌లో ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. అదేవిధంగా ఒడిశాలో కూడా బిజెడితో జరిపిన చర్చలు కొద్ది రోజుల క్రితమే విఫలమయ్యాయి. ఒడిశాలో 2019 ఎన్నికల్లో బిజెపి మొత్తం 21 స్థానాల్లో పోటీ చేసి ఎనిమిది స్థానాలు గెలుచుకోగా, బిజెపి 12 సీట్లు గెలుచుకుంది. కానీ ఈసారి ఒడిశాలో పరిస్థితులు బిజెపికి వ్యతిరేకంగా మారాయి. పంజాబ్‌లో బిజెపి తనకు ఎక్కువ సీట్లు కావాలని అడిగింది. అందుకు శిరోమణి అకాలీ దళ్ తిరస్కరించింది. పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో రైతులు జరిపిన ఆందోళన, పోలీసు దాడుల్లో ఒక రైతు హత్యకు గురికావడం వంటి ఘటనకు బిజెపికి తీవ్ర నష్టం కలిగించాయి. ఈ విషయంలో బిజెపతో పొత్తు పెట్టుకుంటే సమస్యలు వస్తాయని అకాలీ దళ్ భావిస్తున్నది. కానీ బిజెపి మాత్రం ఈ విషయం దాచిపెట్టి వేరే కథనం చెబుతున్నది. 2020 సెప్టెంబరులోనే బిజెపితో శిరోమణి అకాలీ దళ్ తెగదెంపులు చేసుకుంది. తమ గ్రామీణ ఓటర్లను కాపాడు కోవడానికి రైతుల సమస్యలపై కొన్ని హామీలు ఇవ్వాలని బిజెపిని అకాలీ దళ్ కోరిందని ఆ పార్టీ నాయకుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ చెప్పారు. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఏడాదిపాటు ఢిల్లీ సరిహద్దుల్లో పెద్ద ఉద్యమం నడపడంతోనే అకాలీదళ్ వెనక్కు తగ్గి బిజెపికి రామ్ రామ్ చెప్పింది. ఇప్పుడు మళ్లీ ఎన్నికల సమయంలో కూడా హర్యానాలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పంజాబ్ సరిహద్దుల్లోంచి వచ్చే రైతులను అడ్డుకుని వారిపై పోలీసుతో దారుణ దాష్టీకం చేయించడంతో అకాలీదళ్‌ను అంటకాగేందుకు బిజెపికి అవకాశాలు పోయాయి. అదేవిధగా సిక్కు మతానికి చెందిన రాజకీయ ఖైదీ బందీ సింగ్స్‌ను విడుదల చేయాలని కూడా బిజెపిని అకాలీదళ్ కోరింది. బిజెపి అందుకు తిరస్కరించింది. దీంతో బిజెపి వ్యతిరేకత తమను కూడా వెంటాడుతుందని అకాలీదళ్ బిజెపి డిమాండ్లను కూడా తిరస్కరించింది. పంజాబ్ బిజెపి శాఖ అధ్యక్షుడు సునీల్ జాఖర్ తన పార్టీ నిర్ణయాన్ని ప్రకటిస్తూ, సరిహద్దుల్లో ఉన్న రాష్ట్రం భద్రత రీత్యా తాము ఒంటరి పోరునే ఎంచుకున్నామని చెప్పారు. ప్రజలు తమ పార్టీకే మద్దతు ఇస్తారని లేని గాంభీర్యం ప్రదర్శించారు. ఈ వ్యాఖ్యలకు బాదల్ కూడా తీవ్రంగా స్పందించి దీటుగా జవాబు చెప్పారు. కొన్ని జాతీయ పార్టీల్లాగా తాము నంబర్ గేమ్ ఆడబోమని ఆయన విమర్శించారు. తమ ఎస్‌ఎడి కేవలం ఒక రాజకీయపార్టీ మాత్రమే కాదనీ, కొన్ని సూత్రాలకు కట్టుబడి ఉండే పార్టీ అనీ బాదల్ ఎదురుదాడి చేశారు. మా లక్ష్యం దిశగా మేం ప్రయాణిస్తామన్నారు. 1998 తర్వాత మొదటిసారి ఈ ఎన్నికల్లో బిజెపి – ఎస్ఎడి పార్టీలు వేరుపడి విడివిడిగా పోటీ చేస్తున్నాయి.

## మౌలిక సౌకర్యాల్లేవ్

(మొదటి పేజీ తరువాయి)



చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో కోర్టులు సార్వభౌమత్వాన్ని కలిగి ఉండేవని, మారిన కాలంతో పాటు కోర్టులలోనూ మార్పులు వస్తున్నాయని చెప్పారు. నేటి యువత వేగంగా మార్పులు కోరుకుంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్త హైకోర్టు కోసం చొరవ తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం,హైకోర్టు చీఫ్ జస్టిస్ (సిజె) ను జస్టిస్ డి.వై చంద్రచూడ్ అభినందించారు. హైకోర్టు నూతన భవనంలో దివ్యాంగుల వంటి విభిన్న వర్గాలకు అవసరమైన సౌకర్యాలుండాలని, న్యాయవ్యవస్థ విలువలు పెంపొందించేలా సీనియర్లు కృషి చేయాలని సాంకేతిక యుగంలో కోర్టు కార్యకలాపాలకు ఇంటర్నెట్ వాడుకోవాలని, ఇటీవల ఈ కోర్టు పథకంలో భాగంగా పలు చోట్ల ఈ సేవా కేంద్రాలు ఏర్పాటయ్యాయని చంద్రచూడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పిఎస్.నర్సింహా, జస్టిస్ పివి.సంజయ్‌కుమార్,హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే,పలువురు న్యాయమూర్తులు,న్యాయవాదులు పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి పిరికోడు.. మాటలు ఎక్కువ చెప్తాడు!

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రేవంత్ రెడ్డి పిరికోడు, మాటలు ఎక్కువ చెప్తాడు కానీ, సవాలు స్వీకరించే దమ్ములేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు తీవ్ర స్థాయిలో విరుచుకపడ్డారు. మల్కాజిగిరిలో పోటీ చేయాలని నేను విసిరిన సవాల్ పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పారిపోయాడన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మల్కాజిగిరి, చెవేళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఇప్పటికైనా మల్కాజిగిరిలో పోటీకి రావాలని కెటిఆర్ మరోసారి సవాల్ విసిరారు. తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి, పోటీకి వస్తే తమ అభ్యర్థిని బతిమిలాడుకొని తాను పోటీలో నిలబడుతా అన్నారు. అంత పెద్ద ముఖ్యమంత్రి పదవిలో ఉన్నా తర్వాత కూడా రేవంత్ రెడ్డి బయపడుతున్నాడన్నారు. తన సవాల్ పైన ఇప్పటిదాకా రేవంత్ రెడ్డి భయంతో మాట్లాడటం లేదన్నారు. రాహుల్ గాంధీ దేశమంతా తిరిగి, నరేంద్ర మోడీని చౌకీదారు చోర్ హై అంటే రేవంత్ రెడ్డి మాత్రం తన బడే భాయ్ అంటున్నాడని అన్నారు. నువ్వు రాహుల్ గాంధీ మనిషివా, నరేంద్ర మోడీ మనిషివా, బిజెపి మనిషివా, కాంగ్రెస్ నేతవా రేవంత్ రెడ్డి చెప్పాలే అని కెటిఆర్ ప్రశ్నించారు. 30 40 మంది కాంగ్రెస్ ఎంఎల్ఎలతో కలిసి బిజెపిలోకి పోయేందుకు రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నాడని కెటిఆర్ ఆరోపించారు. ఈ అంశంపైన రేవంత్ రెడ్డి సమాధానం చెప్పమంటే సమాధానం చెప్పట్లేదన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ని అరెస్ట్ చేస్తే రాహుల్ గాంధీ అన్యాయం అంటాడు కానీ అదే కేసులో ఎంఎల్‌సి కవితను అరెస్టు చేస్తే రేవంత్ రెడ్డి మాత్రం కరెక్టే అంటాడన్నారు.

**కెసిఆర్‌కు వెన్ను పోటు పొడించిన కాంగ్రెస్, బిజెపి అభ్యర్థులు..** ఈటెల రాజేందర్ అన్న హుజూరాబాద్‌లో గజ్వేల్‌లో ఓడిపోతే మల్కాజిగిరి కి వచ్చిండని, హుజూరాబాద్‌లో సెంటిమెంట్ మాటలు చెప్పి, గెలిచిన తర్వాత ముఖం చాటేసిండన్నారు. దమ్ము ధైర్యం ఉంటే నరేంద్ర మోడీ, బిజెపి మల్కాజిగిరికి, కంటోన్మెంట్‌కి ఏం చేసిందో చెప్పి ఈటెల ఓటు అడగాలన్నారు. రంజిత్ రెడ్డి ఎవరో మన పార్టీ సీటు ఇచ్చి గెలిపించుకున్న తర్వాతనే ప్రపంచానికి తెలిసిందన్నారు. 2019లో రాజకీయాలకు కొత్త అయినా పార్టీలో ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి ఆయనను గెలిపించారన్నారు. రంజిత్ రెడ్డికి రాజకీయంగా పార్టీలో అత్యధిక ప్రాధాన్యతనిచ్చామన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయనని, రాజకీయాల నుంచి తప్పుకుంటానని పార్టీకి చెప్పారని కెటిఆర్ వెల్లడించారు. కేవలం అధికారం, ఆస్తుల కోసమే రంజిత్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీని విడిచి ద్రోహం చేశారని విమర్శించారు. కవితపై కేంద్ర ప్రభుత్వ సంస్థలు సోదాల పేరుతో దాడి చేసి, అరెస్టు చేసిన రోజే, కాంగ్రెస్‌లో చేరిన స్వార్థపరుడు రంజిత్ రెడ్డి అని కెటిఆర్ విమర్శించారు.

## ప్రధాన సమస్య నిరుద్యోగమే..

(మొదటి పేజీ తరువాయి)

సహిస్తూ వచ్చారని అన్నారు. ఐఎల్ఓ, ఐహెచ్‌డి విడుదల చేసిన 2024 నివేదికను ఖర్గే ప్రస్తావిస్తూ, బిజెపికి ఓటు వేసేముందు దేశ ప్రజలు ఒకటికి రెండుసార్లు చాలా జాగ్రత్తగా ఆలోచించుకోవాలని, నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చేటప్పుడు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. పదేళ్ళలో 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తామనని మోడీ దేశ యువతకు హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు ఇవ్వకపోగా మరో 12 కోట్ల ఉద్యోగాలను కొల్లగొట్టి ఉన్నవే రాకుండా చేశారని ఖర్గే విమర్శించారు. ''దేశంలో రోజు రోజుకూ నిరుద్యోగం పెరుగుతోంది, దీనిని యువతరం భరిస్తూ వస్తోంది, సహిస్తోంది, మోడీ ప్రభుత్వం ఈ విషయంలో ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తోంది, నిరుద్యోగం దేశ యువతరం భవిష్యత్తును నాశనం చేస్తోంది, ఐఎల్ఓ–ఐహెచ్‌డి నివేదికలు అంతిమంగా చెప్పిన సారాంశం ఇదే, భారత్‌లో నిరుద్యోగం ఉద్ధృతరూపం దాల్చిందని స్పష్టం చేసింది'' అని ఎక్స్ వేదికగా ఖర్గే పోస్టింగ్ పెట్టారు. ''వారు (కాషాయ కూటమి) మత ఛాందస వాదులు, కానీ మనం ఇప్పుడు ఏ క్షణంలోనైనా బద్దలవడానికి సిద్ధంగా ఉన్న నిరుద్యోగం అనే ప్రమాదకర బాంబుపై కూర్చుని ఉన్నాం'' అని ఖర్గే గట్టి హెచ్చరిక చేశారు. ఒకవైపు పరిస్థితులు ఇంత దారుణంగా ఉంటే, మోడీ ప్రభుత్వంలో ప్రధాన ఆర్థిక సలహాదారుడు మాత్రం తప్పుడు ప్రకటనలతో తమ ప్రియతమ నాయకుణ్ణి కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని,దేశంలో ఉన్న నిరుద్యోగం వంటి అన్ని సాంఘిక, ఆర్థిక సమస్యలనూ ప్రభుత్వం పరిష్కరించలేదని ప్రధానమంత్రిని వెనకేసుకొస్తున్నారని విమర్శించారు. ఐఎల్ఓ–ఐహెచ్‌డి నివేదిక ప్రకారం, భారతదేశంలోని యువతరంలో 83 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారని కేవలం 17.5 శాతం యువకులు మాత్రమే గ్రామీణ ప్రాంతాలలో పనీపాటల్లో నిమగ్నమై ఉన్నారని చెప్పారు. పరిశ్రమల్లో, తయారీ రంగంలో పనిచేసే వారి సంఖ్య 2012లో ఎంత శాతం ఉందో ఇప్పటికీ అంతే శాతం ఉందని, ఇందులో మార్పు రాలేదని, కేవలం 26 శాతం కార్మికులే ఉత్పాదకా రంగంలో నిమగ్నమై ఉన్నారని అన్నారు. అదేవిధంగా ఆర్థిక కార్యకలాపాలలో నిమగ్నమైన యువకుల సంఖ్య 2012 లో 42 శాతంగాఉండగా, 2022లో ఇది 37 శాతానికి క్షీణించిందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల కాంగ్రెస్ సారథ్యంలోని యుపిఎ ప్రభుత్వ హయాంలో ఉన్న పరిస్థితితో పోలి చూస్తే, కేవలం కొద్దిమంది మాత్రమే ఈనాడు ఆర్థిక కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నారనీ, 2012తో పోలిస్తే ఈనాడు నిరుద్యోగం మూడు రెట్లు పెరిగిందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉద్యోగాల భర్తీతోపాటు ప్రశ్నాపత్రాల లీకేజీలను పూర్తిస్థాయిలో అడ్డుకుంటుందన్నారు. డిగ్రీ, డిప్లమో ఉన్నవారికి అప్రెంటిషిప్ లా తెచ్చి ఏడాదికి లక్ష రూపాయలు సహాయం ఇవ్వడం ద్వారా వారికి ఒక భరోసా ఇస్తామన్నారు. రూ.5,000 కోట్లతో ఒక నిధి ఏర్పాటు చేసి దేశంలోని అన్ని జిల్లాలకు పంపిణీ చేస్తామని, ప్రతి జిల్లాకూ రూ.10 కోట్లు ఇస్తామని అన్నారు.

## ఆర్భాట ప్రచారాలు..

(మొదటి పేజీ తరువాయి)

అవతరించాలనే లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలు కూడా కనిపించడం లేదని అన్నారు. పాఠశాల విద్య కూడా లేని పిల్లలు... డ్రాప్ అవుట్లు ఎక్కువగా ఉంటే, దేశం అభివృద్ధి లక్ష్యాలను ఏ విధంగా చేరుకుంటుందని ప్రశ్నించారు. 'మన దేశంలో యువ జనాభా ఎక్కువ. అయితే, వారు మంచి ఉద్యోగాలు లేదా ఉపాధి అవకాశాలు పొందితేనే, ఆ శ్రమ శక్తి వల్ల దేశానికి ప్రయోజనం. అందుబాటులో ఉన్న యువ శక్తిని సద్వినియోగం చేసుకునేందుకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వం, ఆ దిశగా అడుగులు వేయకుండా, 2047లో అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరిస్తుందని అనడం అభూత కల్పన మాత్రమే' అన్నారు. భారతదేశం గురించి కొన్ని ఆర్థిక సంస్థలు, విదేశీ పెట్టుబడిదారులు చేస్తున్న వ్యాఖ్యలు, చెప్తున్న మాటలు అభూతకల్పనలు మాత్రమేనని అన్నారు. విదేశీ పెట్టుబడిదారులు తమతమ వ్యాపారాభివృద్ధికి, లాభార్జనకు వీలుగా భారత్ వృద్ధిపై అబద్ధాలు, అర్ధసత్యాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. రాబోయే దశాబ్దాల్లో అద్భుతాలు జరుగుతాయంటూ, సంభావ్యతా వృద్ధిని చూపిస్తూ, తమ లాభాలు చూసుకుంటున్నారని, ఉన్నత విద్య కంటే చిప్ తయారీ కంపెనీలకు ఇస్తున్న రాయితీలపైనే కేంద్రం ఎక్కువ మొత్తం ఖర్చు చేయడంలో ఔచిత్యం ఏమిటని రాజన్ ప్రశ్నించారు. 2021, డిసెంబర్‌లో మోడీ ప్రభుత్వం భారతదేశంలో సెమీకండక్టర్లు, డిస్‌ప్లేల తయారీ అభివృద్ధికి రూ.76000 కోట్ల (సుమారు 10 బిలియన్ డాలర్లు) వ్యయంతో పథకాన్ని రూపొందించిందని, ఈ ఏడాది ఫిబ్రవరిలో కేంద్రం మూడు సెమీకండక్టర్ ప్లాంట్లను క్లియర్ చేయగా, అందులో రెండు టాటా కంపెనీకి చెందినవి ఉన్నాయని ఆయన అన్నారు. అయితే విద్యావ్యవస్థను చక్కదిద్దే ప్రయత్నం చేయకుండా చిప్‌ల తయారీ వంటి ప్రాజెక్టులపై ప్రభుత్వం దృష్టి సారించిందని రాజన్ అభిప్రాయపడ్డారు. అధివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలబెట్టాలన్న ప్రభుత్వ ఆశయం గొప్పదే. కానీ, అందుకు అవసరమైన మౌలిక అంశాలను నిర్లక్ష్యం చేసి, లక్ష్యాన్ని చేరతామని గొప్పలు చెప్పుకోవడంలో అర్థం లేదన్నారు. దేశంలోని 1.4 బిలియన్ల జనాభాలో సగానికి పైగా 30 ఏళ్లలోపు వారే అయినప్పటికీ, వారి శక్తియుక్తులను సక్రమంగా వినియోగించుకోకపోతే, భవిష్యత్తు ఉజ్వలంగా ఎలా ఉంటుందనేది నిలదీశారు. 'విద్యకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం ఎంత వరకు సమంజసం? కొవిడ్ మహమ్మారి తర్వాత దేశంలో పాఠశాల విద్యార్థుల సంఖ్య 2012కి ముందు స్థాయికి పడిపోయింది. గ్రేడ్ త్రీ విద్యార్థుల్లో 20.5 శాతం మంది మాత్రమే గ్రేడ్ టూ పాఠ్యాంశాలను చదవగలుగుతున్నారు. విద్యావ్యవస్థ ఎంత నాసిరకంగా ఉందో ఈ అధ్యయనం స్పష్టం చేస్తున్నది. దేశంలో అక్షరాస్యత రేటు, వియత్నాం వంటి ఇతర ఆసియా దేశాల కంటే తక్కువ. ఈ అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి' అని రాజన్ ఆ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. విద్యా ప్రమాణాలు సరిగ్గా లేకపోతే, దేశం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లే అవకాశం లేదన్నారు. అత్యంత కీలకమైన, మౌలిక అంశాలను విస్మరించి, అభివృద్ధిపై కేవలం గణాంకాలను, లక్ష్యాలను వల్లెవేసినంత మాత్రాన ప్రయోజనం ఉండదని రాజన్ తేల్చిచెప్పారు. లేని అభివృద్ధిని ఉన్నట్టు హైప్ చేయడం వల్ల దేశం దేశానికి ప్రయోజనం శూన్యమని వ్యాఖ్యానించారు.

## కోర్టు ముందుకు నిజాలు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశమయ్యారు. ఇడి కస్టడీలో ఉన్న తన భర్తను తాను కలిశాననీ, అప్పుడు ఆయన నాకు ఈ విషయం చెప్పారన్నారు. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలపై న్యాయస్థానంలో నిజాలను ఆయన వెల్లడించనున్నారని చెప్పారు. రెండు సంవత్సరాలుగా మద్యం అవినీతి అంటూ తమపై ప్రచారం చేస్తున్నారని, ఒక్క పైసాను కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తమ దగ్గర నుండి ఈ రెండేళ్ళలో స్వాధీనం చేసుకోలేకపోయారని, సోదాల్లో ఎక్కడా వారికి అవినీతి సొమ్మే దొరకలేదని ఆమె అన్నారు. గడచిన రెండేళ్ళలో 250 సార్లు తమపై అధికారులు దాడులు చేశారని, సోదాలు చేశారని, తీవ్రంగా బాధించారని ఆమె అన్నారు. ఐనా ఒక్క పైసా కూడా వారికి ఎందుకు దొరకలేదన్నారు. ''ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, సత్యేంద్ర జైన్‌లపై దాడులు చేశారు, కానీ వారి వద్ద నుండి కూడా ఒక్క రూపాయిని కూడా అధికారులు స్వాధీనం చేసుకోలేదు, ఎందుకని? మేం ఉండే ముఖ్యమంత్రి నివాసంపై వారు దాడులు చేశారు, సోదాలు చేశారు, ఈ సోదాల్లో కేవలం రూ.73,000 మాత్రమే దొరికాయి, అద కూడా లెక్కల్లో చూపించాం'' అని సునీతా కేజ్రీవాల్ చెప్పారు. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి సిసోడియాను, ఆప్ రాజ్యసభ సభ్యుడు సింగ్‌ను గత ఏడాది అరెస్టు చేశారు. అక్రమ సంపాదనను లెక్కల్లో చూపించకుండా దారి మళ్లించారని వారిపై ఇడి అధికారులు ఆరోపణలు చేశారు. మార్చి 28న ఒక అతి పెద్ద విషయం తాను చెప్పబోతున్నాననీ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇప్పటికే ఒక ప్రకటన చేశారు. మద్యం అవినీతి అని ప్రచారం చేస్తున్న ఈ కేసులో ఒక నిజం చెప్పబోతున్నానని ఆయన అనడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకుంది. తన భర్త ఎంతో ధైర్యశాలి అనీ, దేశభక్తుడనీ, కడిగిన ముత్యం లాంటివాడనీ, మధుమేహ వ్యాధిగ్రస్తుడైనప్పటికీ కూడా ఎంతో చిత్తశుద్ధి, నిబద్ధత గల నాయకుడని అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ అన్నారు. జైల్లో ఉంటూనే ఎన్నో ఒత్తిడులు ఎదుర్కొంటూ, అధికారులకు సమాధానాలు చెబుతూ మరోవైపు ఒక ముఖ్యమంత్రిగా ప్రజాపరిపాలన చేయడానికి ఢిల్లీ జలవనరుల మంత్రి అతిశీకు నీటి సమస్యపై తగిన ఆదేశాలు, మార్గదర్శకాలు జారీ చేశారని ఆమె గుర్తు చేశారు. ఈ విషయం కేంద్ర ప్రభుత్వానికి రుచించిలేదు, దీనిని అడ్డుకుంటున్నది, వారు ఎందుకు పరిపాలనా అంశాలను, సంబంధిత ఆదేశాలను వ్యతిరేకిస్తున్నారు? కేంద్ర ప్రభుత్వం ఢిల్లీని నాశనం చేయాలనుకుంటోందా? అని ఆమె ప్రశ్నించారు.అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్య సంరక్షణకు, ఆయన విజయసాధనకు ఢిల్లీ ప్రజలు ప్రార్థనలు చేయాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రాజకీయం చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

దురదృష్టకరమన్నారు. డబుల్ బెడ్‌రూమ్ తీసుకున్నావారిని, రైతుబంధు రాని వారిని ఓట్లు అడగండి.. ఇందిరమ్మ ఇండ్లను కట్టిన గ్రామాల్లో రైతుబంధు ఇచ్చిన వారిని మేము ఓట్లు అడుగుతామని బిఆర్ఎస్ పార్టీకి సూచించారు. రాష్ట్రంలో 17 ఎంపి సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పాలనలో ఎప్పుడు రైతుబంధు ఇచ్చారో తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. కెసిఆర్ ఆనాలోచిత నిర్ణయాల వల్ల ధనిక రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిందన్నారు. రూ.7 లక్షల వేల కోట్ల అప్పులతో పాటు, సుమారు రూ.40 వేల కోట్ల బిల్లులు చెల్లించాల్సిన స్థితిలో తాము అధికారంలో వచ్చామన్నారు. చివరికి హాస్టల్‌లో చిన్నారులకు తినే ఆహర పదార్థాల బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హుజురాబాద్ ఎన్నికల నుండి వారు అధికారం దిగేవరకు 1.50 కోట్ల ప్రొసిడింగ్‌లు ఇచ్చి ఉన్నారన్నారు. పంటల బీమా పెట్టకపోవటం వల్లనే రైతులు నష్టపోయారని, రైతు మరణాలు లేకుండా ఉండటానికి పంటల బీమా దోహదపడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతుల కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నదన్నారు.ఇటీవల సిద్దిపేటలో కురిసిన ఆకాల వర్షాలకు జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేసి పంపించారన్నారు. గతంలో కోర్టు రూ.970 కోట్ల నష్టపరిహారం రైతులకు ఇవ్వాలని చెప్పినప్పటికీ అప్పటి బిఆర్ఎస్ చెల్లించలేదన్నారు. రైతుల మీదు చిత్తశుద్ధి ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. కెంద్రానికి తాము పన్నులు చెల్లిస్తామని , కేంద్రంతో తాము సత్సంబంధాలు పెట్టుకొని తమకు రావాల్సిన నిధులను తప్పనిసరిగా తెచ్చుకుంటామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పిల్లర్లు కుంగిపోవటానికి తమ తప్పులేదని బిఆర్ఎస్ అనడం సరికాదన్నారు. సలహాలు ఇవ్వమంటే ఇవ్వకుండా ఆరోపణలు చేస్తున్నారని కెసిఆర్‌ను ఉద్దేశించి అన్నారు. తాము వచ్చిన వందరోజుల్లో ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు విద్యుత్ వారికి ఉచిత కరెంట్‌ను విజయవంతం అయ్యాయన్నారు. ఫోన్ టాపింగ్ వ్యవహారంలో బిఆర్ఎస్ నేతలు రాక్షస ఆనందం పొందారన్నారు. మూతబడిన చెరుకు ఫ్యాక్టరీని త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌టిసిలో సంస్కరణలు తీసుకుచ్చేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. టెట్ ఫీజును తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 17సీట్లు కైవసం చేసుకుంటామని ధీమాను మంత్రి పొన్నం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎంఎల్ఎ ఖమ్మంపల్లి సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డి, నియోజక వర్గం ఇంచార్చి పూజల హరికృష్ణ, శివప్ప, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, నాయకులు సూర్యవర్మ, గంప మహేందర్‌రావు, బొమ్మల యాదగిరి,కలీమోద్దీన్, దాస అంజయ్య, డిసిసి మహిళ అధ్యక్షులు ముద్దం లక్ష్మి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్కరకు రాని కష్టం

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ ఉపాధి గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రెండవ సారి బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తొలగించే ప్రయత్నానికి తెర లేపింది. పథకానికి తూట్లు పొడిచే పనిలో పడింది. బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి కోత విధించడం రక రకాల నిబంధనలు తీసుకురావడం, అలవెన్సులను ఎత్తి వేయడం పథకం పట్ల బిజెపి వైఖరిని తెలియజేస్తుంది. దేశంలో ప్రస్తుతం ఉన్న జాబ్ కార్డుల ప్రకారం వ్యవసాయ కూలీలకు 100 రోజుల పని కల్పించాలంటే బడ్జెట్‌లో రూ.3.60 లక్షల కోట్లు అవసరం కాగా కేవలం రూ. 95వేల కోట్లు మాత్రమే ఈ ఏడాది బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి కేటాయించారు. బడ్జెట్ ప్రవేశపెట్టే నాటికి ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం రూ. 21 వేల కోట్లు చెల్లించాల్సి ఉంది. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే క్రమంలో రక రకాల నిబంధనలు తెచ్చి అలవెన్సులను రద్దు చేసి గ్రామీణ ప్రాంత కూలీలను పనికి దూరం చేస్తుంది. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాల్సి ఉండగా ప్రైవేటే నయమనే రీతిలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుంది.

**మొబైల్ యాప్‌తో ఇబ్బందులు :** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌తో కూలీలు పని ప్రారంభించే ముందు పని ముగిసిన తర్వాత ఫోటోలు ఫోన్ ద్వారా పంపించాల్సి ఉంది. పని చేసే దగ్గర సిగ్నల్ ఉండక పోవడం, సిగ్నల్ ఉంటే సర్వర్ పనిచేయక పోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్ పనిచేయక చాలా మంది కూలీలు పని చేయకుండానే వెనుదిరుగుతున్నారు. 100 రోజుల పని నమోదు కావటం లేదు. కేవలం 51 శాతం పని దినాలు మాత్రమే కల్పిస్తున్నారు. మొబైల్ యాప్ నిబంధన ఉపాధి కూలీల పాలిట శాపంగా మారింది.

**గిట్టుబాటు కానీ కూలీ :** రోజుకు ప్రతి కూలీకి ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 200 గిట్టుబాటు అయ్యేవిధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. క్యూబిక్ మీటరుకు రూ. 170లు మాత్రమే ఇస్తుండటం వలన కూలీలకు రోజుకు రూ. 40 నుంచి రూ. 50లకు మించి రావడం లేదు. గతంలో వేసవి కాలంలో పనిచేస్తే ప్రత్యేక అలవెన్సులు ఇచ్చేది గత వేసవి నుండి వాటిని పూర్తిగా ఎత్తి వేశారు. పని ముట్లకు పారకు ఐదు రూపాయలు, గంపకు ఐదు, గడ్డపారకు ఐదు, లీటరు నీటికి ఐదు రూపాయల చొప్పున గతంలో చెల్లించే వారు. ఇప్పుడు వీటన్నింటిని రద్దు చేసింది. అయినా మరో మార్గం లేక కూలీలు ఉపాధి హామీ పనికి వెళ్తుండగా ఆ ఇచ్చే అరకొర కూడా నాలుగు నెలలుగా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నానా ఇబ్బందులకు గురి చేస్తుంది. ఉపాధి హామీ కూలీ డబ్బులు వెంటనే చెల్లించి ఉపాధి కూలీలను ఆదుకోవాలని కోరుతున్నారు.

**పేదల ఊసురు తీస్తున్న కేంద్ర ప్రభుత్వం**

**తాటి వెంకటేశ్వరరావు బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు**



కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కూలీల ఊసురు తీసుకుంటుంది. నాలుగు నెలలు గడిచినా చెల్లింపులు లేక పేద కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసే కుట్రకు తెర లేపింది. బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించడం, వేసవి అలవెన్సులు ఎత్తి వేయడం, కూలీ గిట్టుబాటు కాకుండా చేయడం తదితర విషయాలు కుట్రను బహిర్గతం చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా 14.28కోట్ల జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరందరికీ పని కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నది. అటువంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం సరైంది కాదు.



## ట్రాక్టర్ బోల్తా : ముగ్గురు మృతి

### 20 మందికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/పాపన్నపేటః** మండల పరిధిలోని బాచారం గ్రామవాసులు పెళ్లికూతురును తీసుకురావడానికి జోగిపేట్ కు కులస్తులు ,బంధువులతో కలిసి ట్రాక్టర్ లో బయలుదేరారు. మార్గమధ్యంలో జోగిపేట్ మండల పరిధిలో మన్సన్ పల్లి గ్రామ శివారులో మూల మలుపు వద్ద అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడి అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు... 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి... స్థానికుల వివరాలు ప్రకారం. బాచారం గ్రామానికి చెందిన సొంగ రాము వివాహం గురువారం జరగవలసి ఉండగా. పెళ్లి కూతుర్ ను తీసుకురావడానికి బుధవారం నాడు జోగిపేట్ కి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది... మార్గమధ్యంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడగా బాచారం గ్రామానికి చెందిన జెట్టిగల సంగ మ్మ (45) రావుగారి బుదమ్మ (46) రావుగారి ఆ గమ్మ (48)లు అక్కడికక్కడే మృతి చెందారు. 20 మందికి తీవ్ర గాయాలు కావడంతో జోగిపేట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు..గత నెలలో ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకు నిశ్చితార్థానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో మరణించారు.... దీనితో శుభకార్యాలకు వెళుతూ ఆరు మంది రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పూర్తిగా బాచారం గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి. వీరి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నారు.

## అన్ని విధాలా అండగా ఉంటా సిఎం రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అన్ని విధాలా అండగా ఉంటానని టిపిసిసి మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భరోసనిచ్చారు. ఖమ్మం లోక్‌సభ నియోజక వర్గ టికెట్‌ను ఆశించి, తనకు టికెట్ వచ్చే అవకాశం లేదనే సమాచారంతో హనుమంతరావు అలకబూనారు. పార్టీ కార్యాక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. తన అసంతృప్తిని కూడా వ్యక్తం చేశారు.దీంతో ఆయనను టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ బుధవారం బుజ్జగించి, ఆయనను సిఎం రేవంత్ వద్దకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి తాజా పరిణామాలను హనుమంతరావుకు వివరించినట్టు తెలిసింది. అన్ని విధాలుగా తాను అండగా ఉంటానన్నారు. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. రేవంత్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ కూడా ఢిల్లీకి వెళ్లారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్, హరీశ్‌రావు, వెంకట్రామ్‌రెడ్డిలు ముద్దాయిలు

### బిజెపి ఎంఎల్‌ఎ రఘునందన్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, అప్పటి సిద్ధిపేట కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డిని ముద్దాయిలుగా చేర్చాలని బిజెపి ఎంఎల్‌ఎ రఘునంధన్ రావు డిమాండ్ చేశారు. కెసిఆర్ ప్రమేయం లేకుండా పోలీసు అధికారులు ఫోన్ ట్యాపింగ్ చేయలేరన్నారు. దుబ్బాక ఉప ఎన్నికల సమయంలో తన ఫోన్‌తో పాటు తన కుటుంబ సభ్యుల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేశారని ఆయన హైదరాబాద్‌లోని డిజిపి కార్యాలయంలో డిజిపి రవిగుప్తాకు ఫిర్యాదు చేశారు. అనంతరం రఘునందన్ రావు మీడియాతో మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రణీత్ రావు ఇచ్చిన స్టేట్ మెంట్ పై చర్యలు తీసుకోవాలని, దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికల్లో ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. ఈ కేసులో నిష్పక్ష పాతంగా విచారణ జరిపించాలని డిజిపిని కోరాను. మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి పైన పోటీ చేసిన వారి ఫోన్‌నంబర్‌ను కూడా ట్యాపింగ్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లను కూడా విన్నట్టు తెలిసిందని రఘునందన్ రావు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కేసుపైన సమగ్ర విచారణ జరిపించకపోతే తాను న్యాయస్థానాలను ఆశ్రయిస్తానని తెలిపారు.

## ఆదివాసీల అస్థిత్వపోరాట పతాక కుంజ రామన్న : మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/కొత్తగూడ:** ఆదివాసీల అస్థిత్వం కోసం పోరాటం చేసిన విప్లవ రణదీరుడు కామ్రేడ్ కుంజ రామన్న అని పంచాయతీరాజ్, గ్రామీణాబివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం మండలంలోని మోకాళ్ళపల్లి గ్రామంలో ఆదివాసీ లిబరేషన్ టైగర్ వ్యవస్థపకులు కుంజ రామన్న 19వ వర్ధంతి సభలో సీతక్క పాల్గోని మాట్లాడారు. జల్, జంగిల్, జమీన్ కోసం ఆదివాసీల హక్కుల కోసం నిరంతరం పోరా టం చేసే వ్యక్తిత్వం రామన్నదని అన్నారు. ఆదివాసీ సమాజం కోసం సాయుద పోరాటాన్ని కోనసాగించడని అన్నారు. ఏజెన్సి ప్రాంత ప్రజల పక్షన తుదికంత పోరాటం చేసి అమరుడైనాడని అన్నారు. ఆయనలేని లోటు ఆదివాసీ సమాజానికి తీరని లోటని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంజ రామన్న కుమారుడు కుంజ సూర్య, కోడలు కుసుమాంజలి, పిసా కమిటి బాద్యులు కోమురం ప్రభాకర్, ప్రజాసంఘాల నాయకులు పాల్గోన్నారు.

## మహబూబ్‌నగర్ సిపిఐ(ఎంఎల్), న్యూడెమోక్రసి ఉమ్మడి అభ్యర్థిగా మురళీ కృష్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసి రెండు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా న్యూడెమోక్రసి రాష్ట్ర కమిటీ సభ్యులు మోకాళ్ల మురళీ కృష్ణ పోటీ చేస్తారని సిపిఐ (ఎం.ఎల్.) న్యూడెమోక్రసి రాష్ట్ర నాయకులు ప్రకటించారు. రాష్ట్రంలోని మిగతా లోక్‌సభ నియోజకవర్గాల్లో బిజెపి, ఆ పార్టీ మిత్రపక్షాల అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని మార్క్స్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసి రెండు పార్టీల రాష్ట్ర నాయకులు సాదినేని వెంకటేశ్వర రావు, కె.గోవర్ధన్, వి.సంధ్య, ఎం.శ్రీనివాస్, జి.అనురాధ, అరుణ్,ఆవునూరి మధు, జి.ఝాన్సీ, టి.శ్రీనివాస్, బండారి ఐలయ్య మాట్లాడుతూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మరోసారి అధికారంలోనికి వచ్చేందుకు కేంద్రంలోని బిజెపి ప్రయత్నిస్తోందని వారు విమర్శించారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని, ప్రతిపక్ష పార్టీలను, ప్రజా సంఘాలను, కవులను, కళాకారులను, మేధావులను అణచివేస్తోందని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి,ఆ పార్టీ మిత్ర పక్షాలకు తగిన బుద్ధి చెప్పాలని ఎంపి అభ్యర్థి మోకాళ్ల మురళీ కృష్ణ మాట్లాడుతూ ప్రజా హక్కుల కోసం, గిరిజన సమస్యలపై అనేక పోరాటాలు చేశామన్నారు. గిరిజన, ఆదివాసికి చెందిన చట్టాలను సవరించి, తద్వారా ఖనీజ సంపదను దోచుకునేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా భూములను స్వాధీనం చేసుకున్నదని దుయ్యబట్టారు.

### నిబంధనలను ఉల్లంఘిస్తున్న

# ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల గుర్తింపు రద్దుచేయాలి

### తెలంగాణ రాష్ట్ర ఇంటర్ విద్యామండలి కార్యదర్శి శృతి ఓజాకు ఎఐఎస్ఎఫ్ వినతిపత్రం అందజేత

**ప్రజాపక్షం / హైదరాబాద్:** రాష్ట్రంలో ఇంటర్ బోర్డు నిబంధనలు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ముందస్తు అడ్మిషన్లు, వేసవి తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పోరేట్ జూనియర్ కళాశాలల ఆగడాలను అరికట్టాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రభుత్వం, ఇంటర్ బోర్డు స్పందించి తగిన చర్యలు తీసుకోనట్లయితే ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల ముందు ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని ఎఐఎస్ఎఫ్ హెచ్చరించింది.

ఈ మేరకు బుధవారం ఎఐఎస్ఎఫ్ నాయకుల ప్రతినిధి బృందం ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజాకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పోరేట్ జూనియర్ కళాశాలలు ఎటువంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వివిధ కోర్సుల పేరుతో, పండగల సాకుతో ఆకర్షణీయమైన పేర్లు పెట్టి విద్యార్థులను, తల్లి




దండ్రులను మోసం చేస్తూ ఫీజులో రాయితీ ఇస్తామంటూ ఇష్టానుసారంగా అడ్మిషన్లు చేపడుతున్నారన్నారు. ముఖ్యంగా రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో యథేచ్ఛగా కార్పొరేట్ కళాశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని వారు విమర్శించారు. ఇప్పటికే కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులకు ఇంకా ఫలితాలు రాక ముందే రెండవ సంవత్సరం తరగతులు నిర్వహిస్తూ, ఒక్కో విద్యార్థి నుండి 70 శాతం శాతం ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఇంటర్ బోర్డు అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో కార్పొరేట్ కళాశాలలు కొనసాగుతున్నాయని, ఎటువంటి విద్యాప్రమాణాలు పాటించకుండా ఇరుకు గదులలో తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనుమతులు లేని కళాశాలల జాబితాను విడుదల చేసి, నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫొటోజర్నలిస్టులపై దాడులు..పత్రికా స్వేచ్ఛపై దాడులే

### తెలంగాణ రాష్ట్ర ఫొటోజర్నలిస్టుల సంఘం నిరసన ప్రదర్శన

**ప్రజాపక్షం /హైదరాబాద్:** విధి నిర్వహణలో ఉన్న ఫొటో జర్నలిస్టులపై దాడులు పత్రికా స్వేచ్ఛపై దాడులేనని తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.నరహరి అన్నారు. రాజకీయ నిరసనలను కవర్ చేయడం, రిపోర్టర్లు, ఫొటో జర్నలిస్టుల పని అని, అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా ఢిల్లీ వీధుల్లో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు చేస్తున్న ప్రజా నిరసనలను ఫొటో జర్నలిస్టులు కవర్ చేస్తుండగా ఢిల్లీ పోలీసులు అకారణంగా వారిపై అత్యంత భయానక రీతిలో క్రూరమైన దాడులు చేసి తీవ్రంగా గాయపరచడం అమానుషమని, ఈ చర్యను తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఫొటో జర్నలిస్టులపై ఢిల్లీ పోలీసుల క్రూరమైన దాడులను నిరసిస్తూ తెలంగాణ రాష్ట్ర ఫొటోజర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశద్ధారకభవన్ వద్ద బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఢిల్లీ పోలీసుల క్రూరత్వం నశించాలని, జర్నలిస్టులపై దాడులు నివారించాలని జర్నలిస్టులు, ఫొటోజర్నలిస్టులు పెద్దఎత్తున నినాదాలు చేసారు. ఈ సందర్భంగా అనుమళ్ల గంగాధర్ మాట్లాడుతూ ఢిల్లీ సీనియర్ పోలీసు అధికారులు కొంతమంది ఫొటో జర్నలిస్టుల గొంతును పట్టుకుని, ఇతరులను భయంకరమైన పరిణామాలతో బెదిరించడం ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) అనుబంధ వర్కింగ్ న్యూస్ కెమెరామెన్స్ అసోసియేషన్ విడుదల చేసిన ఫొటోలలో పోలీసుల క్రూరత్వం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. నిరసనలు తెలిపే చోట చట్టవిరుద్ధమైన, రాజకీయ ప్రేరేపిత పరిమితులను పోలీసులు విధించడం ఏమిటని అయన ప్రశ్నించారు. కె.నరహరి మాట్లాడుతూ జర్నలిస్టుగా పనిచేయడం నేడు దేశంలో ప్రమాదకరంగా మారిందని, పబ్లిక్ డొమైన్‌లో సమాచారాన్ని తీసుకురావడానికి జర్నలిస్టులు తమ జీవితాలను కూడా పణంగా పెడుతున్నారని అయన ఆవేదన వ్యక్తం చేసారు. ప్రజాస్వామ్యం బతకాలంటే పత్రికా స్వేచ్ఛను రక్షించడం అత్యంత అవసరమని, పాలకవర్గాలు ఉదాసీనత వహించకుండా జర్నలిస్టులకు దాడులు లేదా ప్రాణహాని భయం లేకుండా సురక్షితమైన వాతావరణంలో పనిచేసే వీలు కల్పించాలని కోరారు. ఢిల్లీ పోలీసుల దాడిలో ఇండియా టుడే ఫొటోజర్నలిస్టు అరుణ్ ఠాకూర్ మెడపై, గొంతులో గాయాలయ్యాయని, హిందుస్థాన్ ఫొటోజర్నలిస్టు సల్మాన్ అలీకి మోచేయి విరిగిందని, ఫోటో జర్నలిస్టులపై ఏ రూపంలోనైనా దాడి చేయడం పూర్తిగా ఆమోదయోగ్యం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత ఫోటో జర్నలిస్టులకు న్యాయం చేయాలని, దాడులకు పాల్పడ్డ పోలీసు ఉన్నతాధికారులపై ఉన్నత స్థాయి విచారణ జరిపించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని అయన డిమాండ్ చేసారు.




ఈ ప్రదర్శనలో సంఘం కోశాధికారి కె.అనిల్‌కుమార్, కార్యవర్గ సభ్యులు నక్క శ్రీనివాస్, ఎండి. అలీముద్దీన్, నేతలు జి.బాలస్వామి, సయ్యిద్ మజార్, ఈ.జనార్ధన్‌రెడ్డి, రామకృష్ణ, పిప్పళ్ల వెంకటేష్, సురేష్‌రెడ్డి, ఈ.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లో టిఎస్ టెట్‌కు దరఖాస్తులు ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఉపాధ్యా య అర్హత పరీక్షకు (టిఎస్ టెట్ 2024) దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. అర్హులైన, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఏప్రిల్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుసుకోవచ్చు. టెట్ ఒక పేపర్ రాసేందుకు రూ.1000, రెండు పేపరలు రాసేందుకు రూ. 2వేల చొప్పున దరఖాస్తు రుసుంను చెల్లించాల్సి ఉంటుంది. మే 15న నుండి హాల్ టికెట్లు అందుబాటులోనికి రానున్నాయి. ఆన్‌లైన్ ఆధారిత టెట్ పరీక్ష మే 20 నుండి జూన్ 3 వరకు మధ్య రెండు సెషన్‌లో నిర్వహిస్తారు. ఉదయం 9గంటల నుండి 11:30 గంటల వర కు, మరో సెషన్ పరీక్షను మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4:30గంటల వరకు నిర్వహిస్తారు. టెట్ ఫలితాలను జూన్ 12న విడుదల చేయనున్నారు.

## పాముకాటుతో విద్యార్థి మృతి

**ప్రజాపక్షం/మోత్కూర్:** నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురై ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం దత్తప్ప గూడెంగ్రామా నికి చెందిన ముక్కెర్ల కుమార్, మమతల కుమారుడు ఉమేష్ (15) సొంత గ్రామంలోని పదవ తరగతి చదువుతున్నాడు. ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు రాస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో తల్లి దండ్రులతో కలసి నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేసింది. అర్ధరాత్రి సమయంలో ఉమేష్ తనను ఏదో కరిచిందని తల్లిదండ్రులకు తెలిపాడు. వారు లేచి ఇంటి లోపల భాగంలో వెతికి చూడగా గ్యాస్ సిలిండర్ కింద కట్ల పాము కనిపించింది. దాన్ని కొట్టి చంపారు. ఇంతలోనే ఉమేష్ వాంతులు చేసుకున్నాడు. భయాందోళనకు గురైన తల్లిదండ్రులు చుట్టుపక్కల వారిని లేపి, చికిత్స కోసం ఆటోలో భువనగిరి ఆసుపత్రి కి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.



ఉమేష్ తల్లిదండ్రులతో కలసి కిందనే పడుకున్నాడని, ఇంట్లో నుంచి నీళ్ల బయటకు వెళ్లే రంధ్రం లోంచి పాము లోపలికి వచ్చి ఉంటుందని చెబుతున్నారు.

మమత, కుమార్ లకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు కాగా ఉమేష్ పెద్ద కొడుకు. చేతికి అందొచ్చిన కుమారుడు పాము కాటుతో మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## చెక్కులు కాజేసిన కేసులో హరీశ్‌రావు కార్యాలయానికి సంబంధం లేదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు కాజేసిన కేసులో నరేష్‌తో హరీశ్ రావు కార్యాలయానికి ఎటువంటి సంబంధం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు కార్యాలయం తెలిపింది. ఆయన హరీశ్ రావుకు పిఎ కాదని, మంత్రి కార్యాలయంలో తాత్కాలిక పద్ధతిన ఒక కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసేవారని, ఆర్థిక, ఆరోగ్య మంత్రిగా పదవీకాలం పూర్తయిన తర్వాత, ఆ కార్యాలయాన్ని మూసివేసి, అక్కడి సిబ్బందిని పంపించామని వివరించింది. ఈ మేరకు హరీశ్ రావు కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

కాగా తమ కార్యాలయాన్ని మూసివేసే క్రమంలో ఎటువంటి సమాచారం లేకుండా కొన్ని సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను తన వెంట తీసుకువెళ్లినట్లు తమ దృష్టికి వచ్చిందని, దీనిపైన నరేష్‌పై గత డిసెంబర్ 17న నార్సింగి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసిన విషయాన్ని హరీశ్‌రావు కార్యాలయం పేర్కొంది.

## 14 ఏళ్లుగా కాస్మోటిక్ ఛార్జీలు పెంచడం లేదు

### ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. బుధవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ 14 ఏళ్లుగా కాస్మోటిక్ ఛార్జీలు పెంచడం లేదని నెలకు బాలికలకు రూ.75, బాలురకు రూ.50 మాత్రమే చెల్లిస్తుందన్నారు.

కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని ఐదేళ్ల క్రితం చేసిన ప్రతిపాదనలకు గత ప్రభుత్వం ఆమోదం తెలుపగా ఇప్పటికీ అమలు కాలేదన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులపై ప్రజాప్రతినిధులు, అధికారులు చిన్నచూపు చూస్తున్నారు తప్ప వారి సంక్షేమం కోసం కృషి చేయడం లేదన్నారు. మెస్ ఛార్జీలు పెంచాలని గత ప్రభుత్వంలోని మంత్రుల బృందం 2023 మార్చిలో నిర్ణయించగా ఇప్పటి వరకు ఆమోదం పొందలేదన్నారు. మూడు నుంచి ఏడవ తరగతి విద్యార్థులకు రూ.1200, ఎనిమిది నుం చి 10వ తరగతి విద్యార్థులకు రూ. 1400, ఇంటర్, పిజి విద్యార్థులకు రూ. 1875ల చొప్పున ఇవ్వాలని మంత్రి వర్గ ఉప సంఘం సూచించిన నివేదిక అటకెక్కడంతో పాత మెస్ ఛార్జీలు అమలవుతున్నాయన్నారు. దీని వల్ల విద్యార్థులకు పూర్తి స్థాయిలో మెను అందడం లేదన్నారు. వెంటనే మెస్ ఛార్జీ లు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు.




పెండింగ్ డైట్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు పవన్, అయ్య ప్ప, రాకేష్, రోషన్, అనిల్ లు పాల్గొన్నారు.

# వేడెక్కిన రాజకీయం

* కాంగ్రెస్ టికెట్‌పై ఉత్కంఠ
* తెరపైకి తీన్మార్ మల్లన్న పేరు
* దూసుకెళ్తున్న ప్రతిపక్ష పార్టీల ప్రచారం

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రాజకీయాలు వేడెక్కాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ప్రచారంలో మునిగి తేలారు. అధికార కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటించకుండా ఉత్కంఠ రేపుతున్నారు. బిఆర్ఎస్, బిజెపి అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో ఉండగా రసవత్తరంగా మారుతోంది. అధికార, ప్రతిపక్ష పరస్పర మాటల యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇప్పటివరకు కాంగ్రెస్ టికెట్ రేసులో జిల్లాకు చెందిన అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు, రుద్ర సంతోష్ ప్రధానంగా రేసులో ఉండగా తాజాగా తీన్మార్ మల్లన్న పేరు తెరపైకి రావడం చర్చనీయాంశం గా మారింది. ఈ క్రమంలో కాంగ్రెస్‌లో అభ్యర్థి ప్రకటనపై రోజుకో పేరు వినిపిస్తుండడంతో క్యాడర్ గందరగోళానికి గురవుతోంది.

కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి బిజెపి తరపున సిట్టింగ్ ఎంపి బండి సంజయ్, బిఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎంపి వినోద్ కుమార్ మరోసారి బరిలో నిలుస్తున్నారు. కరీంనగర్ పార్లమెంటులోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటికే చుట్టి వచ్చారు. ఎన్నికలకు క్యాడర్‌ను సమాయత్తం చేస్తూ గ్రామాల్లో ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. కరీంనగర్ ఎంపి ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొనే అవకాశముంది. కాగా కాంగ్రెస్ ఇప్పటివరకు అభ్యర్థిని ప్రకటించకపోవడంతో ప్రచారంలో వెనుకబడిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్, కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించడంలో కాంగ్రెస్ జాప్యం చేయడంతో ఈ స్థానాలను కోల్పోయిందని ఆ పార్టీ వర్గాల్లోనే చర్చ సాగుతోంది. కాగా ఎంపి స్థానానికి అభ్యర్థిని ప్రకటించకపోవడం పట్ల క్యాడర్‌లో నిరుత్సాహం నెలకొంది.

**దుమ్మెత్తి పోస్తున్నారు..**

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అటు అభ్యర్థులు, ఇటు ఆశావహులు ఆగమవుతున్నారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్‌నే టార్గెట్‌గా బిఆర్ఎస్ నేతలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇటీవల ఇది తారాస్థాయికి చేరింది. పరస్పర మాటల యుద్ధంతో రాజకీయం వేడెక్కింది. మరో వైపు బిజెపి ఎంపి అభ్యర్థి బండి సంజయ్ అటు కాంగ్రెస్‌ను, ఇటు బిఆర్ఎస్‌ను తనదైన శైలిలో విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ కుమ్మక్కయ్యారంటూ దుయ్యబడుతున్నారు. తమ పరిపాలనలో ఇది చేశామని... ఎంపిగా అది చేశామంటూ ఒకరినొకరు సవాళ్లు విసురుకుంటున్నారు. అయితే కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందు నుంచే కొనసాగుతున్న వేడి కాస్తా మరింత రాజుకుంది. అది కేవలం బిజెపి, బిఆర్ఎస్ నుంచే కొనసాగుతోంది. ఊపు మీదున్న కాంగ్రెస్ అభ్యర్థి తేలకపోవడంతో ఆ పార్టీలోనే అయోమయం నెలకొంది.

**ఢిల్లీ కేంద్రంగా నేతల లాబీయింగ్**

కాంగ్రెస్ ఆశావహులంతా ఏఐసిసి పెద్దలతోనే లాబీయింగ్ మొదలు పెట్టారు. ఇప్పటివరకు సస్పెన్స్ కొనసాగించడంపై అంతర్లీనంగా మరో కోణం ఉండవచ్చని చెబుతున్నారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చుపై ఆలోచించవచ్చని అంటున్నారు. కాగా కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిపై మరోసారి పునరాలోచనలో పడడంపై చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ ప్రధానంగా లోక్‌సభ నుంచి బిజెపి తరపున సిట్టింగ్ ఎంపి బండి సంజయ్‌తో





పాటు కాంగ్రెస్ మద్యే పోటీ ఉండే అవకాశం కనిపిస్తోంది. బండికి ధీటైన అభ్యర్థి కోసం గట్టి పోటీనిచ్చేందుకు హైకమాండ్ ఆలోచిస్తున్నట్లు తెలిసింది. బండి సామాజిక వర్గానికి చెందిన తీన్మార్ మల్లన్న పేరును కాంగ్రెస్ పరిశీలిస్తోంది. తెరపైకి కొత్తగా తీన్మార్ మల్లన్న పేరు రావడంతో అసలు ఏం జరుగుతోంది అన్నట్లుగా కాంగ్రెస్ శ్రేణులు ఆగమవుతున్నారు. తీన్మార్ మల్లన్నకు రాష్ట్ర వ్యాప్తంగా యూత్ ఫాలోయింగ్, మాటల తూటాలు, బిఆర్ఎస్‌పై ఫైటింగ్ ఇవన్నీ కలిసొస్తాయని బావిస్తున్నారు. ఇక్కడ బలమైన సామాజిక వర్గంగా మున్నూరు కాపుల మద్దతు మల్లన్నకు ఉంటుందని బావిస్తున్నట్లు సమాచారం.

**పోటా పోటీ..**

కరీంనగర్ లోక్ సభ టికెట్ రేసులో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, బిసి సామాజికవర్గానికి చెందిన ఏఐసిసి జాతీయ కో ఆర్డినేటర్ రుద్ర సంతోష్‌తో వెలమ సామాజిక వర్గానికి చెందిన పాటు వెలిచాల రాజేందర్ రావు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా మరో బిసి కార్డుతో తీన్మార్ మల్లన్న తెరపైకి వచ్చారు. అయితే సామాజిక వర్గాల కోణంలో అయితే వెలమ సామాజిక వర్గానికా? లేదా బిసి సామాజిక వర్గానికా? అన్న కోణంలో కాంగ్రెస్ హైకమాండ్ సంశయంలో పడింది. బిసిలకు కేటాయిస్తే తనకే ఇవ్వాలని రుద్ర సంతోష్ హైకమాండ్ వద్ద పట్టుబడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు తనయుడు రాజేందర్‌రావు ప్రస్తుతం ఢిల్లీలో ఉండి తన ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ఈ లెక్కన ఇద్దరు పేర్లు పెద్దగా ప్రచారంలో లేకపోగా రాజేందర్‌రావు, తీన్మాన్ మల్లన్నల మద్యే ఎంపి టికెట్ ఆశలు ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రజాపక్షం

గురువారం, మార్చి 28

## ఉపాధి కల్పన నిరాశాజనకం

2047 నాటికి మన దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రస్తుత ఐదు నుండి మూడవస్థానానికి చేరుస్తామని మోడీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నా, ప్రపంచానికి శ్రామిక శక్తిని సమకూర్చే దేశాల్లో మేటిగా ఉన్నామని ఊదరపెడుతున్నా, దేశంలో ఉపాధి కల్పన స్థితి, తీరుతెన్నులు అందులోని డొల్లతనాన్ని బయటపెడుతున్నాయి. అంతర్జాతీయ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఒ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ (ఐహెచ్‌డి) సంయుక్తంగా రూపొందించిన 'భారత్ ఉపాధి నివేదిక' 2024 ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నది. మన దేశ జనాభాలో 30 ఏళ్లలోపువారు అత్యధికంగా ఉన్నందున శ్రమశక్తినుండి దేశం లబ్ధిపొందుతుందని పదేపదే అంటుంటారు. అందరికీ విద్యావకాశాలు, విద్యలో నాణ్యత, నైపుణ్యం, పరిశోధన, వ్యవసాయరంగం నుండి అత్యధికులను ఇతర లాభదాయక వృత్తి, ఉపాధుల్లోకి తీసుకురావటం, ఉపాధిలో లింగ వివక్షను అరికట్టి మహిళల శాతాన్ని పెంపు చేయటం వంటివి ప్రాధాన్యత సంతరించుకుంటే దేశంలో అభివృద్ధిని వేగవంతం చేయటం సాధ్యమే. అదే సమయంలో ఆదాయం పంపిణీలో తీవ్రంగా పెరుగుతున్న అసమానతను అరికట్టలేని ప్రభుత్వ విధానాలు అభివృద్ధిలో అగాధాలను పెంచుతాయి.

భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ మంగళవారం విడుదల చేసిన పైన ప్రస్తావించిన ఐఎల్ఒ నివేదిక కొన్ని వాస్తవాలను దేశం ముందు ఉంచింది. భారతదేశంలోని నిరుద్యోగ యువతలో మాధ్యమిక, ఉన్నత విద్యావంతుల వాటా 2000–2022 మధ్యకాలంలో దాదాపు రెట్టింపు (35.2 శాతం నుంచి 65.7శాతం) అయింది. దేశంలోని నిరుద్యోగ శ్రామికశక్తిలో దాదాపు 83శాతం యువతరమే. ఉపాధుల్లో పాల్గొనే శ్రామికశక్తి రేట్ (ఎల్ఎఫ్‌పిఆర్), కార్మికులు–జనాభా దామాషా(డబ్ల్యుపిఆర్), నిరుద్యోగిత రేట్ 2000–2018 వరకు దీర్ఘకాలంపాటు క్షీణిస్తూ వచ్చింది. 2019లో కొంత మెరుగుపడింది. వ్యవసాయేతర రంగాలు తగినంతగా వృద్ధి చెందకపోవటం, వ్యవసాయరంగం నుండి శ్రామికులను స్వీకరించలేని ఈ రంగాల అసమర్థత దేశ ఉపాధి పరిస్థితిలో దీర్ఘకాలిక లక్షణంగా ఉంది. వ్యవసాయేతర ఉపాధి 2018కి ముందు వివిధ కాలాల్లో పెరిగినప్పటికీ ఉన్న పరిస్థితి ఇది. వ్యవసాయరంగం నుండి విడుదలైన శ్రామికులు ప్రధానంగా నిర్మాణాలు, సేవల రంగంలోకి తీసుకోబడుతున్నారు. శ్రామికశక్తిలో దాదాపు 90శాతం అనియత రంగంలో ఉన్నారు. వారిలో కొద్ది శాతానికి మాత్రమే సామాజిక రక్షణ చర్యలున్నాయి. దారుణంగా ఉద్యోగాల కాంట్రాక్టరీకరణ పెరుగుతున్నది. కొద్ది శాతానికే దీర్ఘకాలిక కాంట్రాక్టు లభిస్తున్నది. యువతలో హెచ్చుస్థాయిలో నిరుద్యోగితకు ఉన్నత చదువుకు తగిన ఉన్నతస్థాయి ఉద్యోగాలు లభించకపోవటం మరో సమస్య. విద్యాధికులు ప్రస్తుతం లభిస్తున్న తక్కువ వేతనం, అభద్రత ఉద్యోగాలు స్వీకరించటానికి నిరాకరిస్తున్నారు. భవిష్యత్‌లో మెరుగైన ఉద్యోగం లభిస్తుందన్న ఆశతో వేచిచూస్తున్నారు. లేబర్ మార్కెట్లో గణనీయంగా ఉన్న లింగ అసమానత మరో పెద్ద సమస్య. పెరుగుతున్న సామాజిక అసమానతలను ప్రస్తావిస్తూ, ''ఆర్థిక అవసరం కొద్దీ ఎస్‌సిలు, ఎస్‌టిలు పెద్దసంఖ్యల్లో పనుల్లో పాల్గొంటున్నారు. అయితే తక్కువ వేతనం లభించే తాత్కాలిక క్యాజువల్ పనుల్లో రోజువారీ పనుల్లో ఎక్కువగా పాల్గొంటున్నారు. జనాభాలో అన్ని తరగతుల్లో విద్య పెరిగినప్పటికీ, సామాజిక గ్రూపుల మధ్య హెచ్చుతగ్గుల దొంతర కొనసాగుతున్నది.''

ఏ దేశంలో అయినా విద్యావంతులందరికీ ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలని ఎవరూ ఆశించరు. కాని కల్పించాల్సినన్ని కల్పిస్తున్నదా అన్నది ప్రశ్న. పారిశ్రామికీకరణ సహా వివిధ రంగాల వృద్ధికి దోహదం చేయటం ద్వారా ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించటం, తద్వారా ఉపాధులు వృద్ధిచేయటం ప్రభుత్వ కర్తవ్యం. నిరుద్యోగం మెండుగా ఉన్న దేశంలో ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని పాలకులు యువతను మోసం చేయవచ్చు. కాని ఎంత కాలం? అత్యధిక జనాభా కలిగిన మనలాంటి దేశాల్లో శ్రమశక్తిని ఎక్కువగా ఉపయోగించుకునే ఉపాధి కల్పన వ్యూహం అవసరం. కాని హైటెక్‌కు ప్రాధాన్యం ఇవ్వటం వల్ల ఉపాధి అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. ఈ వక్రీకరణను దిద్దుబాటుకు విధానాలను పునరాలోచించాలి.

# ఇజ్రాయెల్–పాలస్తీనా వివాదంలో ఒప్పందం సాధ్యమా?

జేమ్స్ ఎం డోర్సే

విధ్వంసం తర్వాత పునర్నిర్మాణం, వైపరీత్యం తర్వాత పరిష్కార చర్యలు అనివార్యంగా జరుగుతాయి. పశ్చిమ ఆసియాలో పాలస్తీనా ప్రాంతంపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం, దారుణ వినాశనం తర్వాత ఏమిటి? అనే ప్రశ్న ఇప్పుడు అందరిముందూ ఉంది. గత ఏడాది అక్టోబరు 7వ తేదీన ప్రారంభమైన ఏకపక్ష యుద్ధం మానవ వినాశనం సృష్టించింది. ఈ సంఘర్షణ తర్వాత పునర్నిర్మాణానికి ఒక విజయవంతమైన పరివర్తన అవసరం. అమెరికా, యూరప్, అరబ్ దేశాలు ఈ సమస్యకు పరిష్కారం సాధించే ప్రయత్నాల్లో ఈ విషయంపై పాలస్తీనా ప్రజాభిప్రాయ సేకరణలో వ్యక్తమైన అభిప్రాయాలు ప్రాముఖ్యంగల అనేక అంశాలు దోహదపడేవిగా ఉన్నాయి. ఇజ్రాయెల్ యుద్ధోన్మాదంతో చేసిన వినాశనం ద్వారా ఆ యూదు దేశం పక్కనే ఒక సర్వస్వతంత్రమైన పాలస్తీనా రాజ్యస్థాపనకు ఈ ఊచకోత ఒక అవకాశాన్ని సృష్టిస్తున్నదని సర్వేలో ప్రజలు భావిస్తున్నారు.

రమల్లా కేంద్రంగా పనిచేస్తున్న ''సెంటర్ ఫర్ పాలసీ–సర్వే రీసెర్చ్ (పిసిపిఎస్ఆర్) చేసిన సర్వేలో వ్యక్తమైన ప్రజాభిప్రాయాల్లో అనేక సలహాలు ఉన్నాయి. ఈ వారంలో మధ్యప్రాచ్యంలో అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్ చేసిన పర్యటనలో ప్రచారం చేస్తున్న విషయాలు పాలస్తీనా ప్రజాభిప్రాయానికి, అక్కడి ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా ఉన్నాయి. ఈ సమస్య పరిష్కారంలో అమెరికాగానీ, ఇజ్రాయెల్‌గానీ బాధితులైన పాలస్తీనా అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటారన్న విశ్వాసం అక్కడి ప్రజల్లో లేదు. అందుకే ఈ విషయంలో ఆటంకాలు ఎదురవుతున్నాయి.

పాలస్తీనా ప్రజల ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకోకుండా చేసే ఏ విధమైన సంధి ప్రయత్నాలైనా, శాశ్వత కాల్పుల విరమణ, శాంతి చర్యలైనా చివరకు తుమ్మితే ఊడిపోయే ముక్కులాగా పైపై పూతలుగా ఉంటాయేతప్ప శాశ్వతపరిష్కారాలుగా ఉండే అవకాశం లేదు. ఒకవేళ లేనిపోని పెద్దరికంతో ఇజ్రాయెల్‌కు మేలుచేసేవిధంగా ఎలాంటి చర్యలు తీసుకున్నాగానీ అలాంటి శాంతి చర్యలు తదుపరి కొనసాగింపుగా జరిగే హింసాత్మక చర్యలవల్ల కుప్పకూలి ప్రయోజనం కోల్పోతాయి. అటు ఇజ్రాయెల్‌లోగానీ, ఇటు పాలస్తీనాలోగానీ అనివార్యంగా రాజకీయ మార్పులు జరగాలి. ఈ మార్పులతోనే కొత్త శాంతికి అవకాశాలు ఏర్పడతాయి.

శాంతికి చేసే యత్నాల్లో ఇరు ప్రాంతాల ప్రజల అభిప్రాయాలు అతిముఖ్యమైనవనే విషయాన్ని మధ్యవర్తులు గుర్తుంచుకోవాలి. శుభవార్త ఏమిటంటే అటు పాలస్తీనాలోగానీ, ఇటు ఇజ్రాయెల్‌లోగానీ నాయకులపై విశ్వాసం కలిగిన ప్రజలు కచ్చితంగా మార్పును కోరుకుంటారు. ఈ సర్వేలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలు కూడా అందుకు తగ్గట్టుగానే ఉన్నాయి. ఇందుకు వీలుగా కొత్త నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి కూడా అవకాశాలు ఉంటాయి. ఎ, బి అనే రెండు అవకాశాలను బట్టి ప్రజలు కొత్త నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశాలు ఉంటాయి. కానీ సమస్య ఏమిటంటే అటు ఇజ్రాయెల్, ఇటు పాలస్తినాలలో ఎన్నికలు ఈ వివాద పరిష్కారానికి చాలా విభిన్నమైన నాటకీయమైన ఫలితాలను ప్రతిబింబించవచ్చు. పాలస్తీనాలో ప్రజలు ఎక్కడికీ వెళ్ళాలని కోరుకోవడంలేదు. ఇజ్రాయెల్ సరిహద్దుల పక్కనే ఇప్పుడున్న తమ భూభాగంలోనే తమ స్వతంత్ర రాజ్యాన్ని అధికారికంగా సృష్టించడం ద్వారా జీవనం సాగించాలని దృఢంగా కోరుకుంటున్నారు. పాలస్తినాలో మెజారిటీ ప్రజలు ఇదే అభిప్రాయం వ్యక్తం చేసే అవకాశం ఉంది. మధ్యవర్తులు పాలస్తీనా అనుకూల ధోరణి ప్రదర్శించినాగానీ ఎలాంటి ప్రయత్నాలు చేసినాగానీ ఇజ్రాయెల్‌లో ఫలితాలు అందుకు విరుద్ధంగా ఉండవచ్చు. సెంటర్ ఫర్ పాలసీ–సర్వే రీసెర్చ్ ఫలితాల్లో చెప్పిన ప్రకారం దాయాదులు పక్కపక్కనే సహజీవనం చేయడానికి వీలుగా రెండు దేశాల పరిష్కార సాధనకు గాజాలో ప్రజాభిప్రాయం గడచిన డిసెంబరులో 62 శాతంగా ఉండగా ఇప్పుడు ఈ నెలలో అదికాస్తా 35 శాతానికి క్షీణించింది. వెస్ట్‌బ్యాంక్‌లో దీనికి 34 శాతం మేరకే మద్దతు లభించింది. అంటే గాజా, వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాలలో 45 శాతం ప్రజలు మాత్రమే రెండు రాజ్యాల పరిష్కారానికి ప్రస్తుతం అనుకూలంగా ఉన్నారు. కానీ ఒక పెద్ద విశ్వాసం ఏమిటంటే ఈ రెండు రాజ్యాల సహజీవన పరిష్కారానికి ఆశలు సన్నగిల్లిపోలేదు. సర్వే సంస్థ చెప్పిన సమాచారం ప్రకారం, వెస్ట్‌బ్యాంక్‌లో ఉన్న ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్ ప్రాంతాలపై అనుసరించే విధానం దీనికి చాలా సన్నిహితంగా ముడిపడి ఉంది. ఇజ్రాయెల్‌కు చెందిన తీవ్ర మతఛాందసవాదుల డిమాండ్ల ప్రకారం గాజాలో రీ సెటిల్‌మెంట్ జరగాలి. కానీ 2005లోనే ఇజ్రాయెల్ ఈ డిమాండ్‌ను వదులుకుంది. గాజా ప్రజల సందేహం ఏమిటంటే స్వతంత్ర రాజ్యం ఏర్పడుతుందా? అని. సెటిల్‌మెంట్ ప్రాంతాల్లో ఈ మధ్య సర్వే ప్రకారం ఈ విశ్వాసం పదిశాతం తగ్గిపోయింది. ఐతే స్వతంత్ర దేశస్థాపన ఇప్పటికీ సాధ్యమేనని విశ్వసించేవారు 37 శాతానికి పెరిగారు. ఐతే ఇజ్రాయెల్, అమెరికా వాటి మిత్రులు ఈ విషయంలో పాలస్తీనియన్లను లక్ష్యంగా చేసుకుని పాపభీతి, ఎలాంటి భయం లేకుండా దాడులు చేస్తున్న ఇజ్రాయెలీ స్థిరనివాసులను కట్టడి చేయవలసి ఉంటుంది. స్వతంత్ర పాలస్తినా రాజ్యస్థాపనకు వారి మద్దతు, ఏకాభిప్రాయాన్ని కూడగట్టేట్టు చేయాల్సి ఉంటుంది. అమెరికా, యూరోపియన్ యూనియన్ లు ఈ మధ్య సెటిలర్స్‌పై ఆంక్షలు విధించడం బహుశా దాదాపు ఇదే మొట్టమొదటి చర్యగా భావించాలి. పాలస్తీనియన్లపై వ్యతిరేకతతో హింసకు పాల్పడే సెటిలర్స్‌పై ఈ ఆంక్షలు విధించారు. అదేవిధంగా గడచిన డిసెంబరునెలలో సాయుధ పోరాటానికి మద్దతు ఇవ్వడం కూడా 17 శాతం మేరకు తగ్గిపోయింది. గత డిసెంబరులో ఈ మద్దతు గాజాలో 56 శాతం ఉండగా ఇప్పుడు 39 శాతం ఉంది, వెస్ట్‌బ్యాంక్‌లో ఈ మద్దతు గతంలో 68 శాతం ఉంటే ఇప్పుడు 51 శాతానికి క్షీణించింది.

### మార్వన్ బర్ఘౌటీ నాయకత్వం కోరుకుంటున్న పాలస్తీనియన్లు

అదేవిధంగా పాలస్తీనియన్లలో ఎక్కువమంది అటు హమాస్‌వైపుగానీ, ఇటు పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌వైపుగానీ చూడటం లేదు. వారు మార్పుకోసం ఎదురుచూస్తున్నారు. పాలస్తీనా ప్రజలు ఇప్పుడు ప్రముఖంగా కోరుకుంటున్న చాలా ఇష్టమైన నాయకుడు మార్వన్ బర్ఘౌటీ. ఈ బర్ఘౌటీ అల్ ఫతా ఉద్యమంలో నాయకుడు. ఇజ్రాయెల్‌చే జీవితకాల శిక్షలకు గురైనవాడు.1987–2000 మధ్య కాలం నాటి నాయకుడు బర్ఘౌటీ. ఇంతెఫదాస్ లేదా పాలస్తీనియన్లు ఇజ్రాయెల్ చేసిన ఆక్రమిత ప్రాంతాలలో తలెత్తి పోరాటం చేసేందుకు చర్యలు తీసుకున్నవాడు బర్ఘౌటీ. హమాస్ జాబితాలో కూడా విడుదల కావాల్సిన నాయకులలో బర్ఘౌటీ ప్రథమస్థానంలో ఉన్నాడు. ఆయనను విడుదల చేయాలని అందరూ కోరుకుంటున్నారు. రెండో విడత ఖైదీల పరస్పర మార్పిడిలో ఈయన పేరు ప్రముఖం గా ఉంది. దోహాలో జరిగే సంభాషణల్లో ఆంటోనీ బ్లింకెన్ ముందుకు ఈ అంశం రానున్నది. ఎన్నికల్లో ఎవరికి ఓటు వేస్తారని ''సెంటర్ ఫర్ పాలసీ – సర్వే రీసెర్చ్'' సర్వేలో ప్రశ్నించినప్పుడు 40 శాతం మంది పాలస్తీనియన్లు బర్ఘౌటీ పేరు చెప్పారు.23 శాతం మంది ప్రజలు హమాస్ రాజకీయ నాయకుడు ఇస్మాయిల్ హనియెహ్ పేరును చెప్పారు. మరో రెండుశాతం మంది మాత్రం మహ్మద్ అబ్బాస్ పేరు చెప్పారు. బర్ఘౌటీకి గాజాలో ప్రజాభిమానం పెరుగుతున్నది. ఆయన కున్న ప్రజాభిమానం 25 శాతం నుండి ఈ నెలలో39 శాతానికి పెరిగింది.

మరోవైపు అమెరికా విదేశాంగమంత్రి ఆంటోనీ బ్లింకెన్ యూరప్, అరబ్ రాజ్యాలలో కాలికి బలపం కట్టుకుని తిరుగుతున్నారు. పాలస్తీనాలో అధికారస్థానాలను సంస్కరించాల్సిన అవసరం ఉందని ఆయన ప్రచారం చేస్తున్నారు. మహ్మద్ అబ్బాస్ నాయకత్వంలో పాలస్తీనా అసమర్థంగా మారిందని, అవినీతి విజృంభించిందన్నది ఆయన వాదన. గాజాలో తుపాకులన్నీ నిశ్శబ్దమయ్యాక అధికారంలో సంస్కరణ జరగాలని ఆయన కోరుతున్నారు. మరోవైపు బర్ఘౌటీ కూడా పాలస్తీనాలో అధికారం కోరుతున్నారు. యుద్ధానంతరం గాజాలో అధికారాన్ని ఇజ్రాయెల్ తోసిపుచ్చింది. అందువల్ల బర్ఘౌటీతో సంప్రదింపులను ఇజ్రాయెల్ కోరుకోవడం లేదు. బర్ఘౌటీ ఒక్కడే పాలస్తినాలో అధికారాన్ని న్యాయబద్ధంగా పునరుద్ధరిస్తారన్న భావన ఉంది. ఐతే బర్ఘౌటీతో చర్చలు జరిపితే, హమాస్ కూడా పాలస్తీనా రాజకీయ జన జీవన స్రవంతిలో ఒక భాగంగా ఉండాలని, పాలస్తీనా విమోచనా సంస్థ (పిఎల్ఒ)లో ఒక భాగంగా ఉండాలని బర్ఘౌటీ పట్టుపట్టే అవకాశం ఉందనే ఉద్దేశంలోనే ఇజ్రాయెల్ బర్ఘౌటీని దూరం పెడుతున్నది. పాలస్తీనా విమోచనా సంస్థ అనేది ప్రపంచవ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి స్థాయిలో పాలస్తీనా ప్రజల తరపున సంప్రదింపులు జరిపే సంస్థగా అనాదిగా ముద్రవేసుకుంది. అందువల్ల పాలస్తీనా విమోచనా సంస్థ ఒక్కటే పాలస్తీనా అధికార సాధనకు ఒక వెన్నెముకగా నిలబడి ఒక గట్టి ప్రతినిధిగా నిర్మాణాత్మకమైన చర్చలు, న్యాయబద్ధమైన సంప్రదింపులు జరపగలదు.

పాలస్తీనా అధికార వ్యవస్థ ఇటీవల ప్రధానమంత్రిగా నియమించిన మహ్మద్ ముస్తాఫా ఈ మధ్య ''ది ఎకనామిస్ట్'' పత్రికలో ఒక వ్యాసం రాశారు. కానీ ఆయన అందులో ఎక్కడా హమాస్ పేరును ఉటంకించలేదు. ఎలాంటి వివక్ష, పక్షపాతం లేని సాంకేతిక ప్రభుత్వంకోసం ఆయన పట్టుబట్టారు. పాలస్తీనాలో ఉన్న అన్ని గ్రూపులు, చీలిక వర్గాలన్నీ కూడా పాలస్తీనా విమోచనాసంస్థ స్థాయిలో చర్చల్లో నిర్మాణాత్మక పాత్ర వహించాలని ఆయన కోరారు. ఐతే పాలస్తీనాకు తదుపరి ప్రధానమంత్రిగా పెత్తనం చేసేందుకు కేవలం పది శాతం మాత్రమే ఆయనకు పిసిపిఎస్ఆర్ సర్వేలో సుముఖత వ్యక్తం చేశారు.

హమాస్‌ను సమీకృతం చేసేందుకు జరిగే అన్వేషణలో 63 శాతం పాలస్తీనియన్లు మద్దతుగా ఉన్నారు. ఐతే గాజాలో హమాస్ తిరిగి నియంత్రణ సాధించాలని ఎక్కువమంది ఒపీనియన్ పోల్‌లో కోరుకున్నారు. అదేసమయంలో, గాజాలో, వెస్ట్‌బ్యాంక్‌లో హమాస్‌కు ప్రజల మద్దతు గత డిసెంబరులో 43 శాతం ఉండగా, ఈనెల నాటికి అది 34 శాతానికి తగ్గిపోయింది.

### హమాస్‌ను నాశనం చేయలేకపోయారు

ఐతే అత్యంత సంక్లిష్టమైన విషయం ఏమిటంటే అటు అమెరికా, ఇటు అరబ్ దేశాలలోని భాగస్వామ్య పక్షాలు, ఇజ్రాయెల్ కూడా హమాస్ నాశనాన్ని కోరుకుంటున్నాయి. యుద్ధం మొదలయ్యాక గడచిన ఆరు నెలల్లో హమాస్‌ను తుడిచిపెట్టగలమని ఈ దేశాలు గట్టిగా భావించాయి. కానీ వారు ఆ లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు. హమాస్ సర్వ వినాశనం, సమూలంగా తుడిచిపెట్టడమే తమ లక్ష్యమని ఇజ్రాయెల్ ప్రతిజ్ఞ చేసింది. కానీ ఈ ఆరు నెలల్లో హమాస్‌ను ఇజ్రాయెల్ సైన్యం తుడిచిపెట్టలేకపోయింది. దీనికంటే పెద్ద విషయం ఏమిటంటే గాజాలో జరిగిన వినాశనం, మౌలిక సదుపాయాల ధ్వంసం, ప్రాణహాని వంటివన్నీ అటు అమెరికా, యూరప్, అరబ్ దేశాలకు పెనుభారంగా మారిపోయాయి.

ఇదేసమయంలో చైనా దౌత్యవేత్త కెజియన్ వాంగ్ మధ్యప్రాచ్యంలో పర్యటన సందర్భంగా దోహాలో ఇస్మాయిల్ హనియేను కలుసుకున్నారు.ఈ హనియే అంటే పాలస్తీనాలో గుత్తాధిపత్యంగల నాయకుడు, హమాస్‌ను నడిపిస్తున్న నాయకుడు. గాజాలో యుద్ధం మొదలయ్యాక మొదటిసారి బాహాటంగా చైనా నాయకుడు హమాస్ నాయకుడిని కలుసుకున్నారు. చైనా విదేశీమంత్రిత్వశాఖ లీగల్ అడ్వైజర్ మా గ్జిన్‌మిన్‌తో గతనెలలో సమావేశానికి కొనసాగింపుగా ఈ సమావేశం జరిగింది. సాయుధ పోరాటం ద్వారా అంతర్జాతీయ హక్కుల ప్రకారం పాలస్తీనాకు ప్రతిఘటించే హక్కు ఉందని గ్జిన్‌మిన్ సమర్థించిన తర్వాత కొనసాగింపుగా కెజియన్ వాంగ్–హనియే మధ్య సమావేశం జరిగింది. అంతర్జాతీయ ఉగ్రవాదాన్ని, ఈ పోరాటాన్ని ఆయన వేరు వేరుగా చూశారు. (ఐపిఎ సర్వీస్)

# చతికిలపడ్డ ఆర్థిక వ్యవస్థ – టిఆర్ఎస్ ప్రభుత్వ నిర్వాకం



చాడ వెంకటరెడ్డి
సిపిఐ జాతీయ
కార్యవర్గ సభ్యులు

పదేండ్ల టిఆర్ఎస్ పాలన ఉద్యమ నినాదాలకు భిన్నంగా తిరోగమన విధానాలకు వత్తాసు పలికింది. నీళ్ళు, నిధులు, నియామకాలు, భూములు మాకు, ఆత్మగౌరవపాలనలకు తిలోదకాలిచ్చి అహంభావంతో వ్యవహరించడం మూలంగా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల తీర్పు టిఆర్ఎస్‌కు చెంపపెట్టులాంటిది. రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామ్య మూల సూత్రాలకు విరుద్ధంగా స్వీయమానసిక ధోరణితో తిలోదకాలిచ్చినందునే ఏకవ్యక్తి నియంతృత్వానికి ప్రజలు బుద్ది చెప్పారు. అయినప్పటికీ బిఆర్ఎస్ నేతలు ఓటమి నుండి పాఠం నేర్వలేదని వారి ప్రసంగాలు చూస్తే అర్థమవుతోంది. కరీంనగర్‌లో జరిగిన బహిరంగ సభలో మాజీ సిఎం కెసిఆర్ ప్రసంగిస్తూ ఎన్నికల్లో ప్రజలు అత్యాశకు పోయి, మోసపోయి కాంగ్రెస్‌ను గెలిపించారని అనడమే ఇందు కు నిదర్శనం. ఓటమికి కారణం తమ వ్యవహార శైలి అని గుర్తించకుండా ప్రజలనే అత్యాశపరులుగా చిత్రీకరించడం అంటే ప్రజాస్వామ్యంపై వారికి ఉన్న గౌరవం అర్థమవుతోంది.

### దొర నిర్ణయాలతో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం

ప్రాజెక్టుల పేరుతో వివిధ సంస్థల నుండి గత టిఆర్ఎస్ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయలు అప్పులు తెచ్చి ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టు ప్రాణంతీసి మేడిగడ్డ , అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు ఎవరి ప్రయోజనం కోసం ఎందుకు నిర్మించినట్లు,? ఎత్తిపోతలతో ఎలక్ట్రిసిటి, నిర్వహణ ఖర్చు సంవత్సరానికి రూ.10,500 కోట్లు, అప్పులు తిరిగి చెల్లింపు మరో 15వేల కోట్లు వెరసి ఏటా రూ.25వేల కోట్ల భారం ప్రజల పైబడుతుంటే ఆచరణ సాధ్యమా? తుమ్మిడిహెట్టి నుండి ప్రారంభమైన పనులను నిర్వీర్యం చేయడమేకాక అదిలాబాద్ జిల్లాకు 2 లక్షల ఎకరాలకు అన్యాయం చేసినట్లే కదా? దాదాపు రూ.94,500 కోట్లు ఖర్చు పెడితే కేవలం లక్ష ఎకరాలకు నీళ్లు, స్థిరీకరణకు ఇంకా నీళ్లు అందించాలనే నిర్ణయం అమలేది? మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం కెసిఆర్ ప్రభుత్వ వైఫల్యాలు ఏకపక్ష నిర్ణయాలకు అద్దం పడుతున్నది. ఆత్మవిమర్శ లేని పద్ధతులలో ప్రభుత్వంపైన ఎదురుదాడి చేయడం దుర్మార్గం. ప్రజలు క్షమించరు. గతంలో మిడ్‌మానేరు చేపట్టి సగానికి కంటే ఎక్కువ పని అయ్యింది కదా! శ్రీరాంసాగర్ వరద కాలువ ఎక్కడ వేసిన గొంగళి అక్కడి లాగానే ఉండటం దారుణం. మిగతా కృష్ణానది ఆధారిత ప్రాజెక్టులు అనేకం పెండింగ్‌లో ఉన్నాయి. పాలమూరు–రంగారెడ్డిపైన ప్రతిపక్షాల సూచనలను, సలహాలను తుంగలోతొక్కడం ఎవరికి ప్రయోజనం. నక్కలగండి ఎత్తిపోతల పథకం, శ్రీరామ తదితర ప్రాజెక్టుల ప్రగతి చతికల పడింది కదా! కొత్త ప్రభుత్వం అఖిల పక్ష సమావేశం తక్షణమే ఏర్పాటు చేసి ప్రజాప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు చేపట్టాలి. కాళేశ్వరం లోపాల గురించి ఇప్పటికి ప్రభుత్వం న్యాయవిచారణ చేపట్టడానికి నిర్ణయించడాన్ని ప్రజలు హర్షిస్తున్నారు.

### మిషన్ కాకతీయ

నాబార్డు నిధులతో అనేక చెరువులు, కుంటల మరమ్మతులు చేపట్టడం మంచి కార్యక్రమమే అయినా అందులో అధికారులు, కాంట్రాక్టర్లు అడ్డుగోలుగా అక్రమ సంపాదనకు పాల్పడ్డారు. మొత్తం చెరువులు లోతు అయినాయి. మత్తడలు, తూముల మరమ్మతులు చేపట్టబడటం మంచిపరిణామం.

### మిషన్ భగీరథ

గత ప్రభుత్వాల కాలంలో అనేక మండలాలు, గ్రామాలకు శాశ్వత మంచినీటి పథకాలు చేపట్టి ప్రభుత్వ మరియు స్థానిక సంస్థల ఆధ్వర్యంలో నిర్వహణ చెప్పట్టబడి కొనసాగుతున్నాయి. ఎందుకు వీటన్నింటిని నిర్వీర్యంచేసి వేలాది కోట్ల ప్రభుత్వ సొమ్మును నష్టం చేసినట్లనేది ప్రధాన ప్రశ్న. రూ.45000కోట్లు అప్పులు తెచ్చి చేపడితే అన్ని ఆవాసాలకు నీళ్ల అందుతున్నాయా? ప్రతిపక్షాల గొంతులను నొక్కి అహంకారంతో చేపడితే పాతపథకాలు తుప్పు పట్టిపోతున్నాయి. కొత్త మిషన్ భగీరథకు రిపేరులు వస్తే, దానికి సరిపడు యంత్రాంగముండాలి కదా! దానికి ఖర్చెంత? అట్టహాసంగా తిరుగులేని మహారాజులాగా వ్యవహరిస్తే ఎవరికి నష్టం కలుగుతుంది. అంతిమంగా ప్రజలకే ఇబ్బందులు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణ సమీక్ష చేసి, గత మంచి నీటి పథకాలను నడిపించడానికి ప్రత్యేక కృషి చేపట్టాలి. దీని పూర్వాపరాలపైన నిపుణులతో సమీక్షించి గత తప్పిదాలను ప్రజల ముందుంచాలి. దీనిపైన కూడా సమగ్ర విచారణ చేపట్టాలి. ప్రభుత్వ సొమ్ము అంటే ప్రజల చమట చుక్కల్లో నుండి పన్నుల రూపేణవచ్చే డబ్బే అనే విషయాన్ని గుర్తించాలి.

### కొత్తరెవెన్యూ చట్టం – ధరణి లోపాలు అవినీతి లీలలు

తెలంగాణ రెవెన్యూ చట్టం నైజాం ప్రభుత్వ కాలంలో చేయబడింది. గత ప్రభుత్వాలు కొన్ని చేర్పులు, మార్పులు చేసాయి. అయితే సర్వేనెంబర్లవారిగా సమగ్ర సర్వే 90 సంవత్సరాల క్రితం చేపట్టబడింది. హద్దులు చెరిగిపోయాయి. భూ రికార్డుల లో ఒకరుంటె మోకాపైన మరొక రైతువున్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనాయి. 2014లో తెలంగాణ ఏర్పడిన తరువాత సిపిఐ అనాటి ముఖ్యమంత్రి కేసిఆర్‌ను కలిసి భూముల అంశం జఠిలమైందని, దీనిపైన అఖిలపక్ష పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పినా కేసిఆర్ పెడచెవిన పెట్టారు. 2014 డిసెంబర్‌లో 58,59 జీవోలు తెచ్చి ప్రభుత్వ తాబేదార్లు, అనుయాయులు, బ్రోకర్లకు 59 జీవో క్రమబద్ధీకరణ పేరుతో వందల కోట్ల రూపాయల దుర్వినియోగానికి పాల్పడ్డారు. భూ ప్రక్షాళన నినాదంతో రెవెన్యూ సిబ్బందికి విశేష అధికారాలు ఇచ్చి, ఆ తర్వాత అవినీతి లంచగొండి శాఖ అని కితాబిచ్చిన ఘనత కేసిఆర్‌కు దక్కుతుంది. రెవెన్యూ చట్టములో పేర్కొన్న సమగ్ర సర్వే మాటల గారడిగానే మిగిలిపోయింది.

2004లో వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భూ సమస్యలపై రాష్ట్ర వ్యాపిత ఆందోళన నేపథ్యములో సీనియర్ మంత్రి కీ॥శే॥కోనేరు రంగారావు గారి అధ్యక్షతన కమిటీ వేయబడి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి 104 సిఫారసులను రూపొందించి ప్రభుత్వానికి అందించబడింది. కాని అవి కూడా అమలు కాలేదు.

ధరణి పోర్టల్ ఏర్పాటే దుర్బుద్ధితో జరిగింది. తద్వారా అనేక మంది మంత్రులు, ఎం.ఎల్.ఎ.లు, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చట్టాలలోని లొసుగులను ఉపయోగించుకొని వందల కోట్ల విలువల కలిగిన భూములను స్వాధీనపరుచుకున్నారు. అన్యాక్రాంతమైన భూములను పట్టించుకోలేదు. 58 జీవో ప్రకారం పేదల ఇండ్లస్థలాలకు 125 గజాలిస్తామని చెప్పి, మాటల గారడితో కాలం గడిపారు. వక్ఫ్ బోర్డు, దేవాదాయ , భూదాన యజ్ఞభూముల లాంటివాటిపైన ప్రత్యేక దృష్టి సారించి అక్రమార్కులను తొలగించాలంటే సమగ్ర సర్వే మాత్రమే సర్వరోగ నివారిణిగా గుర్తించాలి. భూమాత కమిటీ ఇచ్చిన రిపోర్టుపైన కూడా సమగ్రమైన చర్చ జరగాలి. శాశ్వత పరిష్కారం చేయాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలాగా అడంగల్, నక్షా ప్రతి లాభోక్తుని వద్ద ఉండేవిధంగా చూడాలి. ఫామ్‌హౌజ్‌లపేరుతో ఎవరు స్వాధీనంలో ఎంత భూమి ఉన్నదో నిగ్గుతేల్చాలి. ఇప్పటికే తెలంగాణలోని అణగారిన ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. శాశ్వత పరిష్కారం చేసి అమలు చేయాలి.

### ఉద్యోగాల కల్పన

గత ప్రభుత్వం ఉద్యోగాల కల్పనలో ఘోరంగా విఫలమైంది. ఆఖరుకు పబ్లిక్ సర్వీస్ కమీషన్‌లో ప్రశ్నాపత్రాల లీకులతో ప్రభుత్వ నిజస్వరూపం బట్టబయలైంది. ఉపాధ్యాయ నియామకాలు లేవు. గురుకులాలలో ఉద్యోగాల భర్తీ చేపట్టినా తూ.తూ. మంత్రంగానే సాగింది. ప్రైవేట్ పరిశ్రమలలో వేలాది ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన పరిశ్రమల మంత్రి మాటలు నీళ్ళ మీద రాతలు లాగానే మారాయి. ప్రజల కనీస అవసరాలైన ఆరోగ్యం, విద్యుత్ శాఖలలో కూడా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగనియామకాలు, ఉద్యోగ భద్రత లేక నిరాశ నిస్పృహలకు గురై అనేకమంది ఉద్యమాలు చేపట్టబడ్డాయి. తెలంగాణ ఉద్యమ నినాదమైన నియామకాలు అందని ద్రాక్షగా మిగిలిపోయింది.

ఇప్పటి రాష్ట్రంలో వేలాది మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులున్నారు. ఉద్యోగభద్రత కల్పించాలి. వీరి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని క్రమబద్ధీకరణ చేపట్టాలి. సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని వాగ్దానం చేసిన కొత్త ప్రభుత్వం మాట నిలుపుకోవాలి.

### రాష్ట్ర ఆర్థికస్థితి

రాష్ట్రమేర్పడినప్పుడు కేవలం 72 వేల కోట్ల అప్పు ఉండగా ఇప్పుడది దాదాపు 7 లక్షల కోట్ల వరకు పెరగడం దారుణం. మిగులు బడ్జెట్ నుండి అప్పుల బడ్జెట్‌గా మారింది. గత ప్రభుత్వ మనేది ఈ మధ్య ఆర్థిక శాఖ విడుదల చేసిన శ్వేతపత్రం ద్వారా విధితమగుచున్నది. కొత్త ప్రభుత్వం పైన అట్టడుగు వర్గాల ప్రజలు కొండంత ఆశలు పెట్టుకున్నారు. ఆచితూచి అడుగులు వేస్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రత్యేక కార్యాచరణకు పూనుకోవాలి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న విభజన హామీల అమలుకై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలి. రాష్ట్రానికి రావలసిన వాటాను రాబట్టడానికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు పోవాలి.

### ఆత్మగౌరవ పాలన

ఇప్పటికే సానుకూల అడుగులు పడుతున్నాయి. ప్రజాపాలనకు ఒక కోటి 30 లక్షల దరఖాస్తులు వచ్చినందున అర్హులను గుర్తించి వాటి అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయాలి. లోపాలను సరిదిద్దుతూనే ప్రజాపాలన అంటే ప్రజల చేత ప్రజల ద్వారా ప్రజాప్రభుత్వమనే ప్రధాన సూత్రాన్ని ఆచరణలోకి తేవాలి. గత ప్రభుత్వం మాటలతో పబ్బం గడిపింది. ప్రజాప్రాతినిధ్యానికి తిలోదకాలిచ్చింది. కేంద్ర బిజెపి ప్రభుత్వం కూడా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదు. ఎన్నికల హామీల అమలుకు కనీస ప్రయత్నం చేయలేదు. బిజెపి/బిఆర్ఎస్‌లు భిన్న ధృవాలుగా కనబడినా నియంతృత్వ విధానాలకు బొమ్మ, బొరుసులాంటివే. ప్రజలు కూడ కండ్లు తెరచి పార్లమెంట్ ఎన్నికలలో ప్రజల హక్కుల పరిరక్షణకై ప్రజాప్రభుత్వం ఏర్పాటుకు లౌకిక ప్రజాతంత్ర, వామపక్ష శక్తులను గెలిపించేందుకు ప్రత్యేక కృషి చేయాలి.

## ప్రకృతి వైద్యశాలల ఆవశ్యకతను గుర్తించాలి

యాభై సంవత్సరాల కిందట ఏర్పాటు చేసిన గాంధీ నేచర్ క్యూర్ హాస్పిటల్ మరియు కళాశాల ఏమాత్రం పురోగతి లేకుండా ఉంది. అప్పుడు మొదలుపెట్టిన బిఎన్‌వైఎస్ కోర్సు తప్ప కొత్తగా డిప్లొమా, పిజి కోర్సులు లేవు. భారతదేశంలోనే పురాతన వైద్యకళాశాల పాల కుల నిర్లక్ష్యంతో ఎదుగూబొదుగూ లేకుండా పోయింది. ఎప్పుడు పేషంట్స్ తాకిడితో రద్దీగా ఉంటున్నది, అరకొర డాక్టర్లు స్కిల్ ఉన్న ట్రీట్మెంట్ అటెండర్లు, పర్యవేక్షకులు లేకుండా కేవలం ఔట్ సోర్సింగ్ స్టాఫ్‌తో కాలం గడుపుతున్నారు. తొంభై శాతం డాక్టర్లు, సహాయ సిబ్బంది పదవీ విరమణ చేయడంతో భారంగా నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వ గాంధీ నేచర్ క్యూర్ కళాశాలలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ కోర్సులను చేర్చడానికి, పరిశోధన సంస్థను ఏర్పాటు చేసుకొని రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయిలో నేచురోపతి ఆసుపత్రుల స్థాపన కోసం ప్రభుత్వం చొరవ చూపాలి. హైదరాబాద్‌లోని గవర్నమెంట్ గాంధీ నేచర్ క్యూర్ కాలేజీ భారతదేశంలోనే పురాతన సంస్థగా నిలుస్తోంది. కళాశాల బిఎన్‌వై ఎస్ కోర్సులను అందిస్తోంది, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు లేకపోవడం వల్ల విద్యార్థు లు రాష్ట్రం వెలుపల ఉన్న ప్రైవేట్ సంస్థలలో విద్యను అభ్యసించాల్సిన అవసరం ఉంది. నేచురోపతిలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను అందించడానికి కళాశాలను అప్‌గ్రేడ్ చేయడ ం, పరిశోధనా కేంద్రంగా గుర్తించాలని ప్రభుత్వ ం పరిగణించాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన కరువయ్యింది. ప్రభుత్వ నేచర్ క్యూర్ కళాశాలకు విపరీతమైన డిమాండ్‌తో నిండిపోయింది, చాలామంది రోగులకు చికిత్స కోసం పరిమిత ఎంపికలు ఉన్నాయి. శాస్త్రీయమైన అవగాహన లేని అర్హత లేని అభ్యాసకుల నుండి ప్రకృతి వైద్యానికి ముప్పు పొంచి ఉంది. ఈ ఆందోళనలను పరిష్కరించడానికి, జిల్లా స్థాయిలో నేచురోపతి ఆసుపత్రుల స్థాపనకు వనరులను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరడమైనది. నేచురోపతిక్ వెల్‌నెస్ సెంటర్‌ల కోసం ప్రత్యేక మౌలిక సదుపాయాలు స్థలాన్ని అందించడం ద్వారా, పౌరులందరికీ సురక్షితమైన, సాక్ష్యంఆధారిత ప్రకృతివైద్య ఆరోగ్య సంరక్షణ సేవలకు సమానమైన ప్రాప్యతను నిర్ధారించగలము. ప్రకృతి వైద్య చికిత్సల కోసం పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడమే కాకుండా ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహిస్తుంది. తప్పుడు సమాచారం యొక్క విస్తరణ ఎదుర్కోవడానికి, అశాస్త్రీయ పద్ధతులకు బాధితుల నుండి వ్యక్తులను రక్షించడానికి ఉపయోగపడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా నేచురోపతి ఆసుపత్రుల స్థాపనకు ప్రాధాన్యత ఇవ్వడానికి ర్యలు చేపట్టాలని రెసిడెంట్ డాక్టర్లు కోరుతున్నారు.

# ప్రకృతి వైద్యం ద్వారా మధుమేహ నియంత్రణ

జీవనశైలి మార్పులతో, ఆహార మార్పులు, ఒత్తిడిని తగ్గించే పద్ధతులపై దృష్టి సారించి మధుమేహాన్ని నిర్వహించడానికి ప్రకృతి వైద్యం తోడ్పడుతుంది. మధుమేహం, ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందిని ప్రభావితం చేసే దీర్ఘకాలిక పరిస్థితి. తరచుగా మూత్ర విసర్జన, అధిక దాహం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ప్రదర్శిస్తుంది. అదృష్టవశాత్తూ, ప్రకృతి వైద్యం మధుమేహం నిర్వహణకు సమగ్ర విధానాన్ని అందిస్తుంది. కేవలం లక్షణాలు తగ్గించడం కంటే దాని మూలకారణాలు పరిష్కరిస్తుంది. ప్రకృతి వైద్య చికిత్సలో కీలకమైన భాగం పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రోటీన్లు వంటి పోషకదట్టమైన ఆహారాలతో సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారాన్ని స్వీకరించడం. క్రోమియం, దాల్చిన చెక్క వంటి సప్లిమెంట్లు ఇన్సులిన్ సెన్సిటివిటీ పెంచుతాయి గ్లూకోజ్ నియంత్రణలో సహాయపడతాయి. ప్రకృతి వైద్యంలో మధుమేహం నిర్వహణకు శారీరక శ్రమ మూలస్తంభం. జాగింగ్ వంటి ఏరోబిక్ వ్యాయామం లేదా బరువులతో శక్తి శిక్షణ, అన్ని రకాల కార్యకలాపాలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో, ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపరచడంలో సహాయపడతాయి. నేచురోపతి విధానాలలో హెర్బల్ సప్లిమెంట్స్, ఆక్యుపంక్చర్, మెడిటేషన్ యోగా ఉన్నాయి, ఇవన్నీ ఒత్తిడి స్థాయిలను తగ్గించగలవని నిరూపించబడ్డాయి. వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం తగినంత నిద్రఅలవాటు చేసుకోవడం చాలా ముఖ్యం. ప్రకృతి వైద్యం శరీరం యొక్క సహజమైన వైద్యం సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది, కేవలం ఔషధాలపై ఆధారపడకుండా మధుమేహాన్ని నిర్వహించడానికి సహజ నివారణలు ఉపయోగిస్తుంది. ప్రకృతివైద్య చికిత్సలు రక్తంలో చక్కెర స్థాయిల సహజ నియంత్రణను సులభతరం చేశాయి, ఆరోగ్యం శ్రేయస్సును ప్రోత్సహిస్తాయి. ఆక్యుపంక్చర్, మసాజ్, యోగా, మెడిటేషన్, హైడ్రోథెరపీ, నేచురోపతితో సహా ఈ సహజ నివారణలు సహజంగా పునరుద్ధరించడానికి కలిసి పనిచేస్తాయి. హైడ్రోథెరపీ పద్ధతి ఒత్తిడిని తగ్గించడానికి శరీరంలో సమతుల్యతను పునరుద్ధరించడానికి నీటి ఒత్తిడి ఉష్ణోగ్రత వైవిధ్యాలను ఉపయోగించుకుంటుంది. ప్రత్యేకంగా రూపొందించిన హైడ్రోథెరపీ వ్యాయామాలు మధుమేహంతో జీవిస్తున్న వ్యక్తులకు లక్షణాలను తగ్గించి, జీవన నాణ్యతను మెరుగుపరుస్తాయి. ఇది స్వర్శ సౌలభ్యం, విశ్రాంతిని అందిస్తుంది, ఆరోగ్యకరమైన గ్లూకోజ్ జీవక్రియను ప్రోత్సహిస్తుంది, డయాబెటిస్ సమస్యలను తగ్గిస్తుంది.

ఆక్యుపంక్చర్ వేల సంవత్సరాల నాటిది, ఆక్యుపంక్చర్ అనేది సాంప్రదాయ చైనీస్ థెరపీ. ఇది శరీరం యొక్క శక్తి ప్రవాహాన్ని తిరిగి సమతుల్యం చేస్తుంది. సహజమైన వైద్యం ప్రక్రియలను ప్రేరేపించడం ద్వారా, ఆక్యుపంక్చర్ దీర్ఘకాలిక నొప్పి, ఒత్తిడి, ఆందోళన వంధ్యత్వం తో సహా వివిధ పరిస్థితులకు సమర్థవంతంగా చికిత్స చేస్తుంది, తద్వారా రిలాక్స్‌గా, శక్తివంతంగా, సమతుల్యంగా, చురుగ్గా ఉంటారు. యోగా, ధ్యానం యొక్క రెగ్యులర్ అభ్యాసం ప్రశాంతతను పెంపొందిస్తుంది, శరీరం మనస్సు బలపరుస్తుంది, మానసిక శ్రేయస్సును ప్రోత్సహిస్తుంది.

**నేచురోపతి చికిత్స:** సహజ చికిత్సలను ఉపయోగించడం, ప్రకృతి వైద్యం మనస్సు, శరీరం ఆత్మకు సంపూర్ణమైన వైద్యం అందిస్తుంది. మసాజ్ థెరపీ వంటి ఈ చికిత్సలు ఒత్తిడి తగ్గింపు, నొప్పి ఉపశమనం, మెరుగైన నిద్ర వంటి ప్రత్యేక ప్రయోజనాలు అందుతాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడంలో సహాయపడటానికి వారు మధ్యధరా ఆహారం లేదా తక్కువ గ్లైసెమిక్ సూచిక ఆహారం వంటి నిర్దిష్ట ఆహార ప్రణాళికలను కూడా సూచించవచ్చు. కొన్ని మూలికలు, బొటానికల్స్ మధుమేహం నిర్వహణలో వాటి సంభావ్య ప్రయోజనాల కోసం అధ్యయనం చేయబడ్డాయి. ఏదైనా మూలిక సప్లిమెంట్లను ఉపయోగించే ముందు అర్హత కలిగిన ప్రకృతి వైద్యుడిని సంప్రదించడం చాలా అవసరం, ఎందుకంటే అవి మందులతో సంకర్షణ చెందుతాయి లేదా దుష్ప్రభావాలు కలిగి ఉంటాయి.

డా.ఎం. అఖిల మిత్ర,
ప్రకృతి వైద్యులు

## చారిత్రక కట్టడాలకు మరమ్మతులు చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు లలిత కళాతోరణం, ఎన్‌టిఆర్ ఘాట్ మొదలైన వాటికి మరమ్మతులు చేపట్టి, పునరుద్ధంచాలని ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డిని టిడిపి నేతలు కోరారు. ఈ మేరకు టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా, జిల్లా ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్,పి.బాలరాజ్ గౌడ్, తెలుగు యువత అధ్యక్షులు శ్యామ్ సుందర్,కప్ప కృష్ణా గౌడ్, ఎస్.ప్రకాష్‌తో పాటు పలువురు హైదరాబాద్‌ల వేం నరేందర్ రెడ్డిని కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు జాతికి, భాషకు, సాహిత్యానికి, తెలుగు పౌరుషానికి ప్రతీకగా తెలుగువారి కీర్తి ప్రతిష్టలు చిరస్మరణీయంగా నిలిచిపోవాలనే ఉద్దేశంతో ట్యాంక్ బండుపై నెలకొల్పిన తెలుగు వెలుగు ల కళా మూర్తుల నిక్షిప్త ప్రాంగణం ఈరోజు శిథిలావస్థకు చేరుకున్నదని పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు ట్యాంకుబండ్‌పైన విగ్రహాలకు మరమ్మతులు, నిర్వహణ పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం హుండీ లెక్కింపు

**ప్రజాపక్షం/వనస్థలిపురం :** కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం హుండీ బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాస శర్మ, పి మాణిక్ ప్రభు, సీనియర్ అసిస్టెంట్ రంగారెడ్డి జిల్లా వారి పరివేక్షణలో ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి వారి సమక్షంలో హుండీని లెక్కించారు. హుండీ ఆదాయం 20లక్షల 60వేల 652రూపాయాలు రాక, అందుల్లో అమెరికా డాలర్లు 410, యూకే పౌండ్స్ 10 వచ్చినదని ఆలయ నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బబ్బూరి ఆనంద్ గౌడ్, మేక సురేందర్‌రెడ్డి, నారగొని శ్రీనివాస్ యాదవ్, చాతికి మధుసూదన్ సాగర్, చీర తిరుమలేష్, గోగిరెడ్డి అంజిరెడ్డి, మేకల యాదగిరి, బిల్లకంటి కిరణ్‌కుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఫోటో రైటప్ నెం:27విఎన్‌పి01: కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం హుండీని లెక్కిస్తున్న ఆలయ అధికారులు

## ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వ్యాపారం చేసుకోండి : సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్:** చైతన్య పూరి మెట్రో వెనుక ఉన్న ఫుట్ పాత్ మీద చిల్లర పండ్ల వ్యాపారం చేసే పలువురు బుధవారం ఎల్‌బి నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను వివరించారు. దానిలో భాగంగా పలువురు మాట్లాడుతూ తమను ఫుట్ పాత్ మీద పండ్లు పెట్టకుండా ట్రాఫిక్ పోలీసులు తమను వ్యాపారం చేయనియడం లేదని, తమ తమ వస్తువులు తీసుకుపోవడం జరుగుతుంది అని తెలిపారు. కావున తమకు న్యాయం చేయాలని వారు సుధీర్ రెడ్డిని కోరడం జరిగింది. దానిలో భాగంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మీరు వ్యాపారం చేసుకునే భాగంగా రోడ్డు మీద పోయే ప్రజలకు ఇబ్బందులు కలిగించవొద్దు అని తెలిపారు .మీ మీద ట్రాఫిక్ పోలీసులకు ఎలాంటి కోపం ఉండదని ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు అవుతున్నాయని ఇతరులు పోలీసులకు సమాచారం ఇవ్వడం వల్ల వారు మీ దగ్గరకు రావడం జరుగుతుంది అని తెలిపారు.పై అధికారులచే ఒకసారి మాట్లాడి మీ యొక్క సమస్యలు పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే మీరు వ్యాపారం చేసుకునే క్రమంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి అని తెలిపారు.దానికి వారు తప్పకుండా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తమ వ్యాపారం చేసుకుంటామని తెలిపారు.

## ఎంఎల్‌సి ఎన్నికలకు సర్వం సిద్ధం

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎన్నికల అధికారి వెంకట మాధవరావు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శాసన మండలి ఉప ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం 171మంది ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే షాద్‌నగర్ ఎన్నికల అధికారి (ఆర్‌డిఒ) వెంకట మాధవరావు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి వెంకట మాధవరావు మాట్లాడుతూ షాద్‌నగర్ పోలీస్ డివిజన్‌కు సంబంధించిన పోలింగ్ కేంద్రాన్ని ఫరూక్‌నగర్ ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మూడు మున్సిపాలిటిలపాటు పది మండలాల ఎంపిటిసి సభ్యులు, జడ్పిటిసిలు, ఎంపిపిలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ఎంఎల్‌సి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నలుగురు పోలింగ్ అధికారులతో పాటు 13మంది ఐడెంటిఫికేషన్ అధికారులు, ఒక సెక్టార్ అధికారిని నియమించినట్లు తెలిపారు. గురువారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, స్థానిక ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని వివరించారు. అదే విధంగా ఎంఎల్‌సి ఉన్న ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో షాద్‌నగర్ ఏసిపి రంగస్వామి ఆధ్వర్యంలో 130మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శంషాబాద్ డిసిపి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో షాద్‌నగర్ ఏసిపి రంగస్వామితోపాటు 7మంది సిఐలు, 20 మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, 103మంది కానిస్టేబుళ్లు, సిఆర్‌పిఎఫ్ జవాన్లతో భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు షాద్‌నగర్ ఏసిపి రంగస్వామి పేర్కొన్నారు.

## ఎన్నికలలో పొరపాట్లకు ఆస్కారం లేకుండా సజావుగా విధులు

రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ శశాంక

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ఎన్నికల విధులు పూర్తి అవగాహనతో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, రీపోలింగ్‌కు అస్కారం లేకుండా సజావుగా నిర్వర్తించాలని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.శశాంక అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అధ్యక్షతన జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాస్టర్ ట్రైనర్లు ప్రతి అంశంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చేప్పుడు వారి సందేహాలను నివృత్తి చేయాలనీ, అందుకు ముందుగా తాము( డిఎల్ ఎంటిలు) తీసుకుంటున్న శిక్షణలోని ప్రతి అంశంపై పట్టు కలిగి ఉండాలన్నారు. రీపోలింగ్‌కు అస్కారం లేకుండా విధులు నిర్వహించాలని, మీరందరూ మీమీ స్థాయిలో బాధ్యతతో పని చేయాలని తెలిపారు. విద్యార్థులకు ఏ విధంగా బోధన చేస్తారో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు కూడా వివరించాలని అన్నారు. శిక్షణకు హాజరై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు తప్పనిసరిగా క్యూఆర్ కోడ్ ద్వారా హాజరు తీసుకోవాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ,జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్,డిఆర్ఓ సంగీత, జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు,జిల్లా స్థాయి అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేస్తే విజయం వెన్నంటే

షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొత్తూరు :** ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే విజయం వెన్నంటే ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని షాద్‌నగర్ ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో మాజీ జెడ్‌టిసి మామిడి శ్యాంసుందర్‌రెడ్డి సమక్షంలో కొత్తూరు వైస్ ఎంపిపి శోభాలింగం నాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరా రు. వారికి హస్తం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు సమన్వయంలో కలిసి పని చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నేతలు అగీరు రవికుమార్ గుప్తా, అగీరు శేఖర్ గుప్తా, లాలూనాయక్‌లు ఉన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటికి చెందిన బిఆర్ఎస్ కౌన్సిలర్ కృష్ణవేణి దంపతులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం పట్టణంలోని ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ నివాసంలో 5వ వార్డు కౌన్సిలర్ కృష్ణవేణి, డాక్టర్ దిలీప్‌కుమార్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి హస్తం కండువాలు వేసి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నేతలు బాబర్‌ఖాన్, రఘునాయక్, బాల్‌రాజ్ గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, రాజులు ఉన్నారు.

# మూసీ సుందరీకరణకు వడివడిగా అడుగులు

మూసీనదికి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో తలమునకలైన యంత్రాంగం

హెరిటేజ్, రిక్రియేషన్ జోన్‌ల ఏర్పాటు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మూసీనదికి పూనర్ వైభవం తీసుకవచ్చేందుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నహాలు చేస్తోంది. స్వచ్ఛమైన నీటితో సుందర ప్రవహంలా మూసీని తీర్చిదిద్దేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. అందుకు అనుగుణంగా యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోంది. మూసీని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే కృత నిశ్చయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు. ఈ బాధ్యతలను మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ఆథారిటీ(ఎంఆర్‌డిసిఎల్)కు ప్రభుత్వం అప్పగించింది. ప్రస్తుతం మూసీ సమగ్ర అభివృద్ధి కోసం ఎంఆర్‌డిసిఎల్ తలమునకలైంది. ఇప్పటికే కార్యారంగంలోకి దిగిన అధికార యంత్రాంగం సర్వే చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేట్ భూముల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రధానంగా హైదరాబాద్ నగరంలో ప్రవహించే మూసీ పరివహక ప్రాంతానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులు నిర్ణయించారు. భవిష్యత్ అభివృద్ధిలో మూసీనది సహజత్వానికి ఇబ్బంది లేకుండా ఈ మాస్టార్‌ప్లాన్ రూపకల్పన చేయనున్నారు. పశ్చిమాన నర్సింగి, లంగర్‌హౌస్ నుంచి తూర్పున గౌరెల్లి వరకు మొత్తం 55 కిలోమీటర్ల పరిధిలో మాస్టార్ ప్లాన్ రూపొందించాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే ఈ 55 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టవద్దని, ప్రైవేట్ ఆస్తులకు సంబంధించిన స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయవద్దని జిహెచ్ఎంసి, రెవెన్యూ, సాగునీటి పారుదుల, జలమండలిలకు ఎంఆర్‌డిసిఎల్ నోటీసులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయంలో మూసీనదిపై నిర్మించ తలపెట్టిన పలు బ్రిడ్జిల నిర్మాణాలను జిహెచ్ఎంసి నిలిపేసింది. ప్రస్తుతం మూసారాంబాగ్ వద్ద బ్రిడ్జి నిర్మాణం మాత్రం జిహెచ్ఎంసి చేపట్టింది. మూసీనదిని మాస్టార్‌ప్లాన్ ద్వారా జోన్‌లుగా విభజించనున్నారు. నిర్ధేశించిన జోన్‌ల వారిగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని నిర్ణించారు. హెరిటేజ్, రిక్రియేషన్, కమర్షియల్ తదితర జోన్‌లుగా అభివృద్ధి చేయనున్నారు. జియాగూడ, పురానపూల్, అఫ్జల్‌గంజ్, హైకోర్టు, చాదర్‌ఘాట్ వరకు హెరిటేజ్ జోన్‌గా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంది. ఇక్కడ రెండువైపులా మూసీకి ప్రహరీగోడతో పాటు ఇరువైపులా రోడ్లు అందుబాటులో ఉన్నాయి. హాకర్స్ జోన్‌గా కూడా అభివృద్ధి చేసేందుకు అవకాశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే మూసీనదిలో మొదటి దశ సర్వే పూర్తి చేసినట్లు తెలిసింది. సర్వే అనంతరం భూసేకరణపై దృష్టిసారించనున్నట్లు తెలిసింది.

### ఈస్ట్ – వెస్ట్ కారిడార్..

మూసీ పరివహక ప్రాంతం గూడా ఈస్ట్ వెస్ట్ కారిడార్ పేరుతో భారీ బ్రిడ్జిని నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. ఈస్ట్ వెస్ట్ కారిడార్‌తో పశ్చిమం నర్సింగి నుంచి తూర్పున గౌరెల్లి వరకు (ఓఆర్ఆర్ టు ఓఆర్ఆర్) అనుసంధానం చేయనున్నారు. ఈ ప్రాజెక్టు చేపట్టాలని గత ప్రభుత్వం భావించినా పనులు మాత్రం పట్టాలెక్కలేదు. ప్రభుత్వం ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోంది. ఈస్ట్ వెస్ట్ కారిడార్‌తో ఓఆర్ఆర్ టు ఓఆర్ఆర్‌ను అనుసంధానం చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రణాళికలను కూడా అధికార యంత్రాంగం ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. ఈస్ట్ వెస్ట్ కారిడార్ నిర్మిస్తే ఎల్.బి.నగర్‌తో పాటు పాతనగరం, హైటెక్‌సిటీతో అనుసంధానం అవుతోంది. దీంతో దూరభారం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు.

### నాడు హైదరాబాద్ మణిహారంగా మూసీ..

హైదరాబాద్ నగరానికి ఒకప్పుడు మణిహారంగా మూసీ నది బాసిల్లింది. స్వచ్ఛమైన నీటితో పారే మూసీనది ప్రస్తుతం మురుగునీరు ప్రవాహంతో మురికి మయంగా మారింది. మళ్లీ అప్పటి మాదిరిగా మూసీనదిలో స్వచ్ఛమైన నీటి ప్రవహంతో కళకళాడే విధంగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించింది. 1908లో మూసీనదికి భారీ ఎత్తున వరదలు ముంచెత్తాయి. అప్పుడు వరదల నివారణ కోసం ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ శాశ్వత పరిష్కారం చేపట్టాలని నిర్ణయించారు. ప్రఖ్యాత ఇంజనీర్ మోక్ష గుండం విశ్వేశ్వరయ్యతో అధ్యయనం చేయించారు. ఇసి నదిపై హిమాయత్ నగర్, మూసీ నదిపై ఉస్మాన్‌సాగర్(గండిపేట) రిజర్వాయర్‌లను నిర్మించాలని ప్రణాళికలు రూపొందించారు. అందుకు అనుగుణంగానే రెండు ప్రాంతాల్లో జంట జలాశయాలను మోక్షగుండ విశ్వేశ్వరయ్యతో ఉస్మాన్ అలీఖాన్ నిర్మింపజేశారు. రెండు రిజర్వాయర్‌ల నుంచి విడుదలయ్యే మిగులు జలాలు ఇసి, మూసి నదుల ద్వారా లంగర్‌హౌస్ వద్ద ఉన్న సంఘం వద్ద కలుస్తాయి. రెండు రిజర్వాయర్‌లతో పాటు మూసీ పరివాహక ప్రాంతాన్ని కూడా అప్పట్లోనే నిజాం సర్కార్ ముందుచూపుతో అభివృద్ధి చేసింది. లంగర్‌హౌస్ నుంచి చాందర్‌ఘాట్ వరకు ఇరువైపులా రహదారులను ఏర్పాటు చేసింది. అంతేకాకుండా మూసీనదిలో ఇరువైపులా ప్రహరీగోడలు నిర్మించారు. చాదర్‌ఘాట్ నుంచి లంగర్‌హౌస్ వరకు నిజాం ప్రభుత్వం నిర్మించిన ప్రహరీ గోడ అలాగే ఉన్నాయి. నిర్వహణలో లోపంతో కొన్ని చోట్ల కట్టడాలు దెబ్బతిన్నాయి. రెండు వైపులా ఏర్పాటు చేసిన రహదారులు ప్రస్తుతం వినియోగంలో ఉన్న విషయం తెల్సిందే. పురానాపూల్ నాయాపూల్ మధ్యలో నిజాం కాలంలో చేసిన అభివృద్ధినే కోలామానంగా తీసుకోవాలా అనే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

## పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల విధులలో ఉన్న అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో బుధవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అందజేయడం, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ, నిబంధనలు, ఫెసిలిటేషన్ సెంటర్‌ల ఏర్పాటు, తదితర అంశాలపై దిశా, నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి తమ ఓటు హక్కు వినియోగించు కోవడానికి ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ తమ ఓటు వేసేలా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ప్రక్రియ పకడ్బందీగా ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఎన్నికల కమిషన్ సూచనల మేరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకుని, జిల్లాలో ఓటింగ్ శాతం పెంచడంలో భాగస్వామ్యులు అయ్యేలా చైతన్య పరచాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహణకు ఉత్తర్వులు జారీ చేసిన వారు శిక్షణకు గైర్హాజరు అయిన పక్షంలో వారిపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెన్షన్‌తో పాటు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేసేందుకు వెనుకాడవద్దన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సికింద్రాబాద్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ హేమంత్ బోర్కడే, జిహెచ్ఎంసి ఎన్నికల అదనపు కమిషనర్ అలివేలు మంగతాయారు, ఎఆర్ఓలు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వన్ టైమ్ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిహెచ్ఎంసి కమిషనర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వన్ టైమ్ సర్వీస్ (ఓటిఎస్) ద్వారా కూకట్ పల్లి ఐడిపిఎల్ కంపెనీ బకాయి ఉన్న రూ.16 కోట్లను చెక్కు ద్వారా జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు కంపెనీ ప్రతినిధులు బుధవారం అందజేశారు. ఓటిఎస్ ద్వారా ఐడిపిఎల్ సంస్థ బకాయిలు చెల్లించినందుకు కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. మిగతా ప్రభుత్వ కంపెనీలు, కార్యాలయాలు, ఆస్తిపన్ను బకాయిదారులు వన్ టైమ్ సర్వీస్ ద్వారా బకాయిలు మార్చి31 వరకు చెల్లించి, వడ్డీపై 90 శాతం రాయితి పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 202324 సంవత్సరంలో ఇంటి పన్ను బకాయిలను కూడా చెల్లించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు జయరాజ్ కెన్నెడి, గీతా రాధిక, చీఫ్ వాల్యుయేషన్ ఆఫీసర్(సివిఓ) మహేష్ కులకర్ణి, ఐడిపిఎల్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ‘మంచి కలలు’ ఎన్‌జిఒకు స్టేట్‌బ్యాంక్ మినీ బస్సు వితరణ



**హైదరాబాద్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) సంస్థాగతమైన సామాజిక బాధ్యతలు (సిఎస్ఆర్) నిర్వహించడంలో భాగంగా ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ ‘మంచి కలలు’ ఎన్‌జిఒ కు ఒక మినీ బస్సును బహూకరించింది. అదేవిధంగా వరి పంటను పండించడంలో నీటిని ఆదా చేసే విధంగా నేరుగా ఒడ్లు వెదజల్లే పద్ధతి (డైరెక్ట్ సీడ్ రైస్)ని ప్రోత్సహించడంకోసం ఐసిఎఆర్ (భారత వ్యవసాయ పరిశోధనా మండలి), ఐఐఆర్ఆర్ (భారత బియ్యం పరిశోధనా సంస్థ)లు, ఎస్‌బిఐ ఫౌండేషన్ మధ్య అవగాహనా ఒప్పందం (ఎంఓయు) కార్యక్రమం కూడా జరిగింది ఎస్‌బిఐ ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్–టెక్నాలజీ మేనేజింగ్ డైరెక్టర్ చల్లా శ్రీనివాసులు శెట్టి బుధవారంనాడు సిఆర్ఎస్ఆర్ కార్యకలాపాల నిర్వహణ నిమిత్తం హైదరాబాద్‌లో పర్యటించిన సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహించారు. కోటీ లోని స్థానిక ఎస్‌బిఐ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ‘‘మంచి కలలు’’ స్వచ్ఛంద సేవా సంస్థకు టాటా వింగర్ మినీబస్సును చల్లా శ్రీనివాసులు శెట్టి బహూకరించారు. ఆయన చేతులమీదుగా ‘మంచి కలలు’ వ్యవస్థాపక అధ్యక్షుడు పుప్పాల శరత్ కుమార్, శ్రీమతి భవానీఈ వాహనం తాళాలను అందుకున్నారు. ఈ సందర్భంగా చల్లా శ్రీనివాసులు శెట్టి మాట్లాడుతూ, శరత్‌కుమార్, భవానీ ఎంతో సేవ సమాజానికి, అనాథ పిల్లలకు చేస్తున్నారని ప్రశంసించారు. సమాజంలో అనాథ పిల్లలను మంచి పిల్లలుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్న ‘మంచి కలలు’ సంస్థ ‘గొప్ప కలలు’గా రూపాంతరం చెందాలని ఆకాంక్షించారు. అవిధంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ద్వారా సిఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా 112 జిల్లాలలో సంచార ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని కలలు గంటున్నామన్నారు. అదికూడా అటవీ ప్రాంతాల్లో, వెనుకబడిన, అభివృద్ధి చెందని ప్రాంతాలను గుర్తించి వీటిని ఏర్పాటు చేయాలని భావిస్తున్నటు చెప్పారు. ‘మంచి కలలు’ చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్‌బిఐ ఉన్నతాధికారులతో కలిసి ఆయన మినీ బస్సును జెండా ఊపి ప్రారంభించారు. ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, అనాథలకు ‘మంచికలలు’ ఘనమైన సేవలు అందిస్తున్నదని కొనియాడారు. అదేవిధంగా ఎస్‌బిఐ సిఎస్ఆర్ విభాగం తరపున ఫౌండేషన్ నుండి రూ.4.50 కోట్ల చెక్కును ఐసిఎఆర్–ఐఐఆర్ఆర్‌లకు సిఎస్ శెట్టి అందజేశారు. బ్యాంకింగ్ కార్యకలాపాలే కాకుండా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవా కార్యక్రమాలు కూడా నిర్వ హిస్తుందనీ, విలువలను తాము ప్రతిబింబిస్తామని, వృద్ధి, సమానత్వం, సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించేందుకు, విలువలు పెంచేందుకు బ్యాంకు నైతికపరంగా జోక్యం చేసుకుంటుందని అన్నారు. రాజేశ్ కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం భారతదేశానికే ధాన్యాగారంగా మారిందని, ఒడ్లు వెదజల్లే పద్ధతి ద్వారా నీటిని 40 శాతం మేరకు తెలంగాణ రాష్ట్రం ఆదా చేస్తున్నదని అన్నారు. ఎస్‌బిఐ ఫౌండేషన్ ఎండి సంజయ్ ప్రకాశ్, ఐసిఎఆర్–ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డారమణ్ మీనాక్షి, కార్పొరేట్ ప్రొడక్షన్ హెడ్ డా. మహేందర్ కుమార్, జనరల్ మేనేజర్లు మంజూ శర్మ, దేవాశిష్ మిత్రా, హైదరాబాద్ సిసిజిఆర్ఓ జనరల్ మేనేజర్ విద్యా రాజ, ఎస్‌బిఐఆర్‌బి జిఎం–డైరెక్టర్ వి.ప్రేమ్‌జీ సహా డిజిఎంలు, సీనియర్ మేనేజర్లు, అధికారులు, ఐసిఎఆర్–ఐఐఆర్ఆర్ సీనియర్ సైంటిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐసిఎఆర్–ఐఐఆర్ఆర్‌కు రూ.4.50 కోట్లు చెక్కు బహూకరణ

## జీవన్‌రెడ్డితోనే పాలమూరు అభివృద్ధి

అభ్యర్థుల మధ్య ఉన్న వ్యత్యాసాలతో ఓట్లు వేయండి

మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** శాసన మండలి ఎన్నికల్లో పారిశ్రామిక వేత్త మన్నె జీవన్‌రెడ్డిని గెలిపిస్తే పాలమూరు జిల్లా ప్రగతి పథంలో నడిచే అవకాశం ఉంటుందని టిపిసిసి సభ్యులు బాబర్‌ఖాన్, ఐఎన్‌టియుసి నేత రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్ వివరించారు. బుధవారం షాద్‌నగర్‌లోని మాజీ ఎంఎల్ఏ చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ శాసన మండలి ఉప ఎన్నికల్లో స్థానిక ప్రజాప్రతినిధుల నుండి భారీ స్పందన వస్తుందని వివరించారు. అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి కార్మిక స్థాయి నుండి ఒక పారిశ్రామిక వేత్తగా ఎదిగారని, వారి గెలుపుతో పాలమూరు అభివృద్ధి ప్రగతి పథంలో నడిచేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి, బిఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌రెడ్డికి మధ్య భారీ వ్యత్యాసం ఉందని గుర్తు చేశారు. ప్రజలకు జీవనోపాధి కల్పించే జీవన్‌రెడ్డి ఎక్కడ.. ప్రజల భూములను దౌర్జన్యంగా తీసుకొని చిత్ర హింసలకు పాల్పడే బిఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌రెడ్డి ఎక్కడ అనే విషయాలను స్థానిక ప్రజా ప్రతినిధులు గ్రహించాలని కోరారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసే ఎంపిటిసిలు, కౌన్సిలర్లు, చైర్మన్లు, జెడ్‌పిటిసిలు, ఎంపిపి ఒక్కసారి ఆలోచించి తమ అమూల్యమైన ఓటు వేసేందుకు కృషి చేయాలని కోరారు. బిఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌రెడ్డి పూర్తి చరిత్ర తెలియలంటే వారి గ్రామానికి వెళ్ళి చూస్తే పరిస్థితి ఏమిటో అర్థమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే వారిపై 35కేసులు ఉన్నాయని తన ఆఫిడవిట్‌లో పొందు పరిచారని, ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు గ్రహించాలని సూచించారు. ఆత్మగౌరవంతో ఓటు వేయాలని కోరుతున్న నవీన్‌రెడ్డి తన ఆత్మపై ఎంత గౌరవం ఉందో వారి గ్రామానికి వెళ్ళి చూస్తే అర్థమవుతుందని పేర్కొన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడే వ్యక్తి మన్నె జీవన్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, బస్వం అప్ప, ఖదీర్, బాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## సర్కారుకు తప్పని ఎన్నికల సవాళ్ళు

ముంచుకొస్తున్న ఎన్నికలు.. తరుముకొస్తున్న నీళ్ళ కరువు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** భనుడు భగభగ మండుతుండటంతో ప్రభుత్వానికి ఎన్నికల సవాళ్ళు తప్పడం లేదు.. మండు వేసవిలో పార్లమెంట్, శాసన మండలి ఎన్నికలు రావాడంతో ప్రభుతానికి ప్రజల నుండి ఎన్నో సవాళ్ళు ఎదురవుతున్నాయి. ఎన్నికల సమయం ముంచుకొస్తుండటం.. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో నీళ్ల కరువు పెరిగిపోయింది. మరోవైపు గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు.. తాగునీటి సమస్యలతో పల్లె ప్రజానీకం ఆందోళనకు దిగుతున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ అధికార కాంగ్రెస్ పార్టీపై విమర్శలు ఒక్కసారిగా గుప్పిస్తున్నారు. మార్చి మొదటి వారం నుండే తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతుండటం.. ఇళ్ళల్లో ఉన్నబోరు మోటర్లు భూగర్భ జలాలు లేక దిష్టిబొమ్మలుగా దర్శనమివ్వడంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరు బావులకు విద్యుత్ కోతలు తప్పకపోవడంతో వేసిన పంట పోలాలు అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు. నిర్మాణ రంగంలో ఉన్న అసంఘటిత రంగ కార్మికులకు సైతం, గృహ యాజమానులు సైతం నీటి కోసం అనేక అవస్థలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో శాసన మండలి ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో తలపడుతున్న అభ్యర్థులు గ్రామీణ ప్రాంతాలకు వస్తున్న సమయంలో ప్రజలు ఎదురు తిరిగేందుకు రంగం సిద్ధమవుతున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులకు పూర్తి స్థాయిలో రంగంలోకి దింపి ప్రచారం కోసం గ్రామాలల్లో పంపించేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో విద్యుత్ సమస్య, తాగునీటి సమస్యలు క్షేత్ర స్థాయిలో ఉండటంతో రాజకీయ పార్టీల నేతలు తలలు పట్టుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంతటి బలమైన అభ్యర్థులకు రంగంలోకి దింపిన నిలదీసేందుకు పల్లె జనం మాత్రం సిద్ధంగా ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. గత ఏడాదితో పోల్చుకుంటే 2024లో మార్చి నెల మొదటి వారం నుండే ఉష్ణోగ్రతలు ఎక్కువగా పెరిగిపోయాయని చెప్పవచ్చు. వేసవి కాలంలోనే పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఓ టర్ల వద్దకు ఎలా వెళ్ళాలని రాజకీయ పార్టీల నేత లు ముమ్మరంగా చర్చించుకుంటున్నారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ఇప్పటికే ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పల్లెల్లో స ర్పంచుల పదవీకాలం ముగిసిన తరువాత ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక అధికారులను నియమించడంతో సమస్యలు మరింత పెరిగిపోయాయని ప్రజలు అంటున్నారు. ఇన్నీ సమస్యల మధ్య పార్లమెంట్ ఎన్నికలు రావడంతో విజయం కోసం రాజకీయ పార్టీల నేతలు ఎత్తులకు పై ఎ త్తులు వేస్తున్నారు. ఎలాగైనా విజయం సాధించాలని అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహం చేస్తుంటే తామేమి తక్కువ కాదంటు బిజెపి వ్యవహరిస్తుం ది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో షాద్‌నగర్ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకథ ఉందని చెప్పవచ్చు. ఏడు అసెంబ్లీ స్థానాల్లో షాద్‌నగర్ నుండి ఏ రాజకీయ పార్టీకి ఓట్లు వస్తాయో అ పార్టీ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని రాజకీయ వర్గాలు జోరుగా చర్చించుకుంటున్నాయి. ఏది ఏమైనప్పటికి పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులకు ప్రజల నుండి ఎదురు దెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పవచ్చు.

## వెంకటేశ్వర స్వామి దేవాలయానికి రూ.1.20లక్షల విరాళం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** వెంకటేశ్వర స్వామి దేవాలయానికి దాతలు రూ.1.20లక్షల విరాళం అందజేశారు. బుధవారం షాద్‌నగర్ మాజీ శాసన సభ్యులు బక్కని నర్సింలుకు మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి శేషయ్యనగర్ పౌల్ట్రి కాంప్లెక్స్‌వాసులు రూ.1.20లక్షల విరాళం అందించారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి రంగులు వేసేందుకు గాను ఆర్థిక సహాయం చేసినట్లు దాతలు వివరించారు. ఈ కార్యక్రమంలో పౌల్ట్రీ పారిశ్రామిక వేత్తలు పాతూరి వెంకట్‌రావు, సత్యనారాయణ, తదిరులు పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి క్విజ్ పోటీలకు మీనేపల్లి కలాన్ విద్యార్థులు



**ప్రజాపక్షం/నవాబుపేట్:** జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు వికారాబాద్ జిల్లా నవాబ్ పేట మండలం మీనేపల్లి కలాన్ గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు రవీందర్ తెలిపారు. బుధవారం గవర్నమెంట్ ఇంటర్ కాలేజ్‌లో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో జరిగిన క్విజ్ పోటీల్లో మోమిన్ పేట్,నవాబు పేట్ మండలాలకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రవీందర్ మాట్లాడుతూ జిల్లా స్థాయికి మాపాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,శిక్షణ ఫౌండేషన్ మెంటర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లాలో ఎన్నికల ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 2050

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంబంధింత ఫిర్యాదులను తెలియ చేసేందుకు మేడ్చల్ జిల్లా వాసులకు టోల్ ఫ్రీ నంబరు 1800 425 2050ను కేటాయించామని జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. ఇరవై నాలుగు గంటలూ ఈ నెంబరు అందుబాటులో ఉంటుందని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్న ఈ ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఈ నంబరు ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎలాంటి ఉల్లంఘన అయినా రాజకీయ పార్టీ నేతలు, కార్యకర్తలు చేస్తున్నారని తెలిస్తే వెంటనే సమాచారం అందిస్తే తగు చర్యలు తీసుకొంటామని, అదే విధంగా ఈ నంబరు ద్వారా ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన మాజీ కార్పొరేటర్



**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఎంఎల్‌సి పట్నం మహేందర్‌రెడ్డి,ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ ఏఎస్ రావు నగర్ మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి భారీఎత్తున నాయకులతో కలసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పావనీరెడ్డి, నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తుందని, ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నందున కాంగ్రెస్ పార్టీలో చేరానని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీలో సుదర్శన్‌రెడ్డి, వంజరి ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, సురేందర్, బాల్‌నర్సింహ, కాశ్యప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జయేందర్,నర్సిములు, కాంతరెడ్డిలు చేరారు. కార్యక్రమంలోకొత్త అంజిరెడ్డి, రాఘవరెడ్డి, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

## అధ్వాన్నంగా సైనిక్‌పురి చౌరస్తా

**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** సైనిక్‌పురి చౌరస్తా ప్రధాన రహదారి గుండా ప్రతి రోజు వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అటువంటి చౌరస్తాలో రోడ్డు మధ్యలో పైప్ లైన్ కోసం రోడ్డును తవ్వి వదిలివేశారు. పనులు పూర్తికాగానే తిరిగి పూడ్చి వేయడం మర్చిపోయారు. అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు రాత్రి సమయంలో ప్రమాదాలకు గురువుతున్నారు. ఈ రోడ్డు గుండా అధికారులు ప్రతి రోజు వెళుతుంటారు, వస్తుంటారు, కానీ ఎవరు పట్టించుకోవడం లేదు. అధికారులు తమ సొంత పనులపై నిమగ్నమయ్యారని స్థానికులు విమర్శిస్తున్నారు. వాహనదారులు, నడిచి వెళ్లే వారికి ఇబ్బందిగా మారిన రోడ్డు పరిస్థితిని వెంటనే చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

## మల్కాజ్‌గిరి నియోజకవర్గం సమావేశం



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ఆర్గానిక్ వ్యవసాయంపై అవగాహన

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ మండల పరిధిలోని నారాయణపూర్ రైతు వేదికలో నేషనల్ సెంటర్ ఫర్ , న్యాచురల్ ఫార్మింగ్ ఉద్యానవన శాఖ సహకరంతో ప్రకృతిక వ్యవసాయం, ఆర్గినిక్ వ్యవసాయం పద్దతుల గురించి డాక్టర్ ప్రవీణ్ కుమార్ రీజినల్ హెడ్ ఫర్ రీజినల్ సెంటర్ ఫర్ ఆర్గినిక్ అండ్ నేచురల్ ఫామింగ్ నుంచి వచ్చి సలహాలు సూచనలను అందించారు. ఉద్యనఅధికారులు ,చక్రపణి ,కమల , అబ్దుల్ గఫార్ , అర్చన . విజయ్‌కుమార్ ,నరసింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మట్టి తరలిస్తున్న టిప్పర్లు పట్టివేత

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను నవాబ్ పేట్ పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ భరత్ భూషణ్ తెలిపిన వివరాల ప్రకారం. నవాబ్ పేట్ మండలం ఆర్కతల గ్రామంలో ప్రభుత్వ భూమి నుండి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. టిప్పర్ లారీ డ్రైవర్లను అనుమతి పత్రాలు చూపాలని కోరడంతో లేవని తెలుపడంతో అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తుండంతో మట్టిలోడు ఉన్న రెండు టిప్పర్‌ను నవాబ్ పేట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం నవాబ్ పేట్ తహసీల్దార్ జయరాం ముందు హాజరు పర్చడం జరిగిందని చేస్తున్నట్లు ఎస్ఐ భరత్ భూషణ్ తెలిపారు.

### విచారణకు పంపాం..జరిమానా వేయలేదు

అక్రమంగా మట్టిని టిప్పర్లల్లో తరలిస్తున్న లారీలను పట్టుకొని పోలీసులు తహసీల్దార్ ముందు డ్రైవర్లను హాజరు పరిచిన విషయం తెలిసిందే ఇట్టి విషయంలో తహసీల్దార్ జయరాం వివరణ కోరగా అక్రమంగా మట్టి తరలిస్తున్న భూమి ప్రభుత్వ భూమి అవునో కాదో రెవిన్యూ ఇన్స్ స్పెక్టర్ ని విచారణకు పంపించడం జరిగిందని ఇప్పటివరకు పట్టుకున్న టిప్పర్లకు ఎలాంటి జరిమానా విధించలేదని చెప్పుకొచ్చారు.

## నార్డ్ ఆంగ్లియా కాన్ఫరెన్స్‌లో 'ఓక్రిడ్జ్' ఉపాధ్యాయులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యా ప్రమాణాలు పెంపొందించడం, వినూత్న బోధనా పద్ధతులను అన్వేషించడం కోసం వియత్నాంలోని హనోయిలో నార్డ్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ టీచింగ్ అండ్ లెర్నింగ్ కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ బాచుపల్లికి చెందిన ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ (ఓఐఎస్‌బి) ఫ్యాకల్టీ ప్రముఖ పాత్ర పోషించారు. ఈ ప్రతిష్ఠాత్మక గ్లోబల్ ఈవెంట్‌కు పదిహేను దేశాల నుంచి రెండు వందల మందికిపైగా విద్యావేత్తలు హాజరయ్యారు. ఈ సమావేశంలో అధ్యాపకులు, ఆలోచనా నాయకులు, అభ్యాసకులు సాంకేతికత ఏకీకరణ, విచారణ ఆధారిత అభ్యాస వాతావరణాలు పెంపొందించడంపై చర్చించారు. ఈ వర్క్‌షాప్‌లో అత్యాధునిక పద్ధతులపై మాట్లాడారు. ఈ ప్రపంచంలో విద్యార్థులను సక్సెస్ చేయడానికి పాఠ్యాంశాల్లో విభిన్న దృక్కోణాల ప్రాముఖ్యతపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ బాచుపల్లి ప్రిన్సిపాల్ బల్జీత్ ఒబెరాయ్ ఎడ్యుకేషనల్ లీడర్‌షిప్, ఇన్నోవేషన్‌పై వ్యాఖ్యాతగా వ్యవహరించారు. బోధన, అభ్యాసం, స్కూల్ అడ్మినిస్ట్రేషన్‌లో విప్లవాత్మకమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సామర్థ్యాన్ని చెప్పారు. టెక్నాలజీ అనేది అధ్యాపకులను ఎలా శక్తివంతం చేస్తుందో వివరించారు.

# శాసనమండలి ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

### కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/కొడంగల్ :** పాలమూర్ శాసనమండలి ఎంఎల్‌సి ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కొడంగల్ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ కోటిరెడ్డితో కలిసి పరిశీలించారు. పాలమూర్ స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికకు సంబందించి నియోజకవర్గంలో మొత్తం 56 మంది ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలోని తమ పేర్లను సరిచూసుకుని పోలింగ్ కేంద్రంలోకి ఓటరుకు ప్రవేశం కల్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోలన్నారు. కడా కార్యాలయంలో ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి నేతృత్వంలో మిషన్ భగిరథ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వేసవి కాలంలో ప్రజలు తాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అదేశించారు. తాగునీటి సరఫరాపై బోర్‌వెల్స్ చేతిపంపులపై సంబంధిత అధికారులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. బోర్‌వెల్స్, చేతిపంపులు ఎక్కడ ఎక్కడ ఉన్నాయో ఎక్కడ పనిచేయడం లేదో శనివారం నాటికి వాటిని గుర్తించి మరమత్తులు చేసివినియోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రజలకు తాగునీరు అందించడంలో అధికారులు ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మిషన్ భగిరథ నీళ్ల అనివార్య కారణాల వల్ల నిలిచిపోయినట్లయితే ప్రత్యమ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో తాండూర్ ఆర్‌డివో శ్రీనివాస్‌రావు, మిషన్ భగీరథ సూపరిండెంట్ ఇంజనీర్ ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాబు శ్రీనివాసు, నాగేశ్వరరావు, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనది

వికారాబాద్ పట్టణంలో ఎన్నెపల్లి చౌరస్తా నుండి అలంపల్లి చౌరస్తా వరకు ఏర్పాటు చేసిన 5కే రన్ జిల్లా ఎస్‌పి కోటిరెడ్డి అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి జెండా ఊపి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల కోసం ఓటర్ కార్డులు సవరణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తప్పక ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు ప్రత్యేక వెబ్సైట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కుల మతలకు అతీతంగా డబ్బు ,మద్యం ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లా ఎస్‌పి కోటిరెడ్డి మాట్లాడుతూ ఓటింగ్ శాతం పెంచడానికి స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ,పార్లమెంటు ఎన్నికలలో జిల్లాలో 80శాతం ఓటింగ్ పెరిగేలా అందరు ఓటు హక్కుపై అవగాహన కలిపించుకొని ఓటు హక్కును వినియోగించాలన్నారు. అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ నేను తప్పక ఓటు వేస్తామని అనే కార్యక్రమం నిర్వహించడంవల్ల ప్రతిఒక్కరికి ఓటు హక్కుపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి ఏంఎ సత్తార్ డి.ఎస్‌పి శ్రీనివాస్ పాల్గొన్నారు



## లాభాల బాటలో శామీర్‌పేట సొసైటీ

### డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘాన్ని లాభాల బాటలో నడిపిస్తున్నామని డిసిఎంఎస్ వైస్ చైర్మన్, శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి అన్నారు. బుధవారం శామీర్‌పేట వ్యవసాయ సహకార సంఘం 41వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాలక వర్గ హాయాంలో సంఘం గత 3 సంవత్సరాలుగా లాభాల్లో ఉందని చెప్పారు. గోదాములు, అగ్రి ఔట్‌లేట్లులను నిర్మించుకున్నామని రైతుల సౌకర్యార్థం అలియాబాద్, మూడుచింతలపల్లి గ్రామాల్లో ఎరువుల దుకాణాలను ఏర్పాటు చేశామని చెప్పారు. టిఎస్‌సిఎబి పైలట్ ప్రాజెక్టులకు సంఘాన్ని ఎంపిక చేశారని పేర్కొన్నారు. శామీర్‌పేట మండలం బాబాగూడకు చెందిన రైతు పేరుపల్లి నర్సింహా మృతి చెందినందున అతడి కుమారుడు పేరుపల్లి లక్ష్మయ్యకు రూ. 26,844లను సంఘం చైర్మన్ రామిడి మధుకర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కమఠం కృష్ణారెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ ఐలయ్య, డైరక్టర్లు జిలకర్ర విష్ణు, నర్సింహగౌడ్, భూమిరెడ్డి, కొండ బిక్షపతి, మాజీ సర్పంచ్‌లు విష్ణువర్ధన్‌రెడ్డి, బాల్‌నర్సింహా, సిఈవో నర్సింలు, రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం

### అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



**ప్రజాపక్షం/ వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి సిద్ధం కావాలనీ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో మిల్లర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం వెంటనే చర్యలు చేపట్టలని అధికారులను అదేశించారు. ఐకేపి ఆధ్వర్యంలో 27 , పిఏసిఎస్ ఆధ్వర్యంలో 61 , డిసిఎంఎస్ అధ్వర్యంలో 27 ఏఎంసి ఆధ్వర్యంలో 03 , ఇతరములు 04 , మొత్తం 122 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరానికి 1,90,350 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేయడం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు, గన్ని బ్యాగులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ ఏ శ్రీనివాస్, సారంగపాణి , వ్యవసాయ అధికారి గోపాల్ పాల్గొన్నారు.

## అంబలి కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/కొడంగల్ :** కొడంగల్ పట్టణంలో మార్కెట్ యార్డులో మున్సిపల్ చైర్మన్ ఆర్. జగదీశ్వర్‌రెడ్డి తన అమ్మమ్మ పార్వతమ్మ దేశ్‌ముఖ్ జ్ఞాపకార్థంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో కొడంగల్ పట్టణానికి వచ్చే వారంతపు సంతకు వేల మంది వస్తుంటారు. అలాంటి వారికి దహాన్నీ తీర్చేందుకు అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. మండుటెండల్లో కాస్త అంబలి సేవిస్తే ఎండవేడిమిని తట్టుకునే శక్తిని ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షుడు, పిఏసిఎస్ చైర్మెన్ కట్కం శివకుమార్, జయతీర్థచారి, మిఠాయి రాజు, వెంకట్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

### మాజీఎంఎల్‌ఎసి కాటెపల్లి జనార్ధన్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, సమాజంలో ఎవరికి లేనంత గౌరవం కేవలం ఒక్క ఉపాధ్యాయుడికి మాత్రమే దక్కుతుందని శాసనమండలి మాజీ ఫ్లోర్ లీడర్ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం శామీర్‌పేట మండలం లాల్‌గడి మలక్‌పేటలోని జడ్‌పి ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం బోధించిన (స్కూల్ అసిస్టెంట్) గోపాల్‌కిషన్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా గోపాల్ కిషన్‌ను పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్‌టియు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రామిడి వెంకట్రామ్‌రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, కాప్రా మండల అధ్యక్షుడు వెంకటేషం, శామీర్‌పేట మాజి అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు ఆశారాణి, మాధవి, పుష్పలత, రాంచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ప్రబాకర్, ఉపాధ్యాయులు మల్లిఖార్జున్, తిరుమలేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజాన్ని నడిపించే శక్తి మహిళలదే

### పామేన జ్యోతిభీంభరత్



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** మండల కేంద్రంలో మండల మహిళా అధ్యక్షురాలు ప్రభావతి ఆనందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల మహిళ సమావేశానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి మహిళ ఉపాధ్యక్షురాలు పామేన జ్యోతిభీం భరత్ హాజరైయ్యారు. గత నెల నుండి నవాబ్ పేట్ మండలంలో మండలంలోని అన్ని గ్రామాలలో మహిళ గ్రామ అధ్యక్షులు ఉపాధ్యక్షులను నియమించడం జరిగింది. వారికీ నియామక ధ్రువీకరణ పత్రాలను రంగారెడ్డి ఉపాధ్యక్షురాలు జ్యోతిభీమ్ భరత్, మండల మహిళా అధ్యక్షురాలు ప్రభావతి ఆనందం అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతిభీం భారత్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజునే కాకుండా ప్రతీ రోజు మహిళలు వారి అభివృద్ధిని గుర్తు చేసుకోవాలన్నారు. మహిళలు తలుచుకుంటే కానిదేది లేదని చెప్పారు. ప్రతీ మహిళ సమాజాన్ని నడిపించే శక్తిగా ఎదగాలన్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ కోసం కాకుండా 50 శాతం రిజర్వేషన్ కోసం పోరాడాలని అన్నారు. ఓ పురుషుడు ఆర్థికంగా కానీ రాజకీయంగా కానీ ఎదగాలంటే అతని వెనకాల ఉన్నటువంటి మహిళకు ఓర్పు అనేది చాలా ఎక్కువ ఉంటుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అందుకోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల పనిచేసి రంజిత్‌రెడ్డి గెలుపు కొరకు కృషిచేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాటు పార్లమెంట్ ఎన్నికల్లో జరగకుండా చూడాలన్నారు. రంగారెడ్డి జిల్లా సెక్రెటరీ పుష్ప, శంకర్ పల్లి మండల అధ్యక్షురాలు నాగమణి, చిట్టిగిద్ద ఎంపిటిసి ఏక్బాల్, మాదవి, సుశీల, జ్యోతి, బాలమణి, పూజ, సహిత, సదానంద్, బందయ్యగౌడ్ పాల్గొన్నారు.

## కోడ్ ఉల్లంఘించిన మేయర్

### చర్యలు తీసుకోవాలంటూ ప్రతిపక్ష పార్టీల డిమాండ్



**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న తమకేమీ పట్టనట్టు ప్రభుత్వ పింఛన్లు పంచుతూ కోడ్ ఉల్లంగించారు. బుధవారం మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ ప్రభుత్వ ఫ్లెక్సీ పెట్టుకుని ఎన్నికల నియామవాళిని బేఖతర్ చేస్తూ చలివేంద్రాలను ప్రారంభించడమే కాకుండా ఆసరా పింఛన్లు పంచారు. అనంతరం డ్వాక్రా భవన్‌లోకి వెళ్ళి ప్రభుత్వం పంచుతున్న ఆసరా పింఛన్లను తాము తీసుకున్న ఓటర్లను అభ్యర్థిస్తు మా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ప్రలోభపెట్టడం కోడ్ ఉల్లంగించడం దుర్మార్గమని ప్రతిపక్ష పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికే తెలుగు యువత అధ్యక్షుడు లక్ష్మణ్ మున్సిపల్ కార్యాలయంలో కోడ్ ఉల్లంగనపై ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకుని మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లపై కోడ్ ఉల్లంఘన కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.




## మహిళాభివృద్ధే బిజెపి లక్ష్యం

### కొండ విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** మహిళాభివృద్ధి బిజెపితోనే సాధ్యమని వికారాబాద్ మున్సిపల్‌లోని ఓల్డ్ గంజ్‌లో రుద్రమదేవి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కొండా సంగీతరెడ్డి అన్నారు. మాట్లాడుతూ మహిళల అభివృద్ధి చెందలన్నదే బిజెపి లక్ష్యమని బిజెపి అభ్యర్థి విశ్వేశ్వర్ రెడ్డి సతీమని సంగితరెడ్డి అన్నారు. మహిళలు ఆర్థికంగా బలంగా ఉంటే ఫ్యామిలీ బలంగా ఉటుందన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే వికారాబాద్ కు శాటిలైట్ టౌన్ అనే మాట ఎన్నో ఏళ్ళుగా వినిపిస్తున్న మాట అన్నారు. ఎంపిగా గెలిపిస్తే వికారాబాద్‌కు ఎమ్ఎమ్‌టిఎస్ తీసుకురవడనికి కృషి చేస్తామన్నారు. వికారాబాద్ నియోజకవర్గంలో ఉన్న ఓటర్లు బిజెపి ఓటు వేయ్యాలని కొరారు. కార్యక్రమంలో రాములు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి విస్తతంగా తీసుకెళ్లి ప్రచారం చేయాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మౌలాలీ డివిజన్ పరిధిలోని స్వాగత్ గ్రాండ్ హోటల్ బ్యాంకెట్ హాల్‌లో యునైటెడ్ కాలనీస్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ సునీత మహేందర్‌రెడ్డిని ఎంపిగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షుడు చుంకు శ్రీనివాస్, వంశీమోహన్, లోహిత్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, దశరథ్‌రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు వినోద్ యాదవ్, జిఎన్‌వి సతీష్‌కుమార్, మదర్ బాయ్, సంతోష్, రాందాస్, బికె శ్రీనివాస్, మంద భాస్కర్, సందీప్‌గౌడ్, ఎల్లమ్, ఫారుక్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లురవి గెలుపునకు కృషి చేస్తా

## మాజీమంత్రి చిత్తరంజన్‌దాస్



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** సొంతగూటికి చేరుకోవడం చాలా ఆనందంగా ఉందని, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి గెలుపు కోసం కృషి చేస్తానని మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ అన్నారు. బుధవా రం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎంతో కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఎంఎల్‌ఎ, మంత్రిగా పనిచేసిన చిత్తరంజన్‌దాస్ రాజకీయాల పరిస్థితుల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీనివీడి బిజెపిలోచేరి 2023 అసెంబ్లీ ఎన్నికలలో జడ్చర్ల బిజెపి ఎంఎల్‌ఏగా అభ్యర్థిగా పోటిచేశానన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంటోపాటు రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కల్వకుర్తి ప్రాంత ముద్దుబిడ్డ కావడంతో ప్రాంత అభివృద్ధియే లక్ష్యంగా తిరిగి ఈనెల 29,30న సొంతగూటికి చేరుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, కల్వకుర్తి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జమ్ములశ్రీకాంత్, శశికుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవ పల్లకి సేవలో ఎంపి అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ బ్యూరో :** హన్వాడ మండలం మాదారం గ్రామంలోని స్వయంభు శ్రీ రాకమకొండ తిరుమల నాద స్వామి బ్రహ్మోత్సవాల పల్లకి సేవలో పాలమూరు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ఘనస్వాగతం పలికి స్థానిక ప్రజలు, ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. స్థానిక గ్రామస్తుల వినతి మేరకు ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని ఆయన హామీనిచ్చారు. పలు స్థానిక సమస్యలపై ఆరా త్వరలో పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలన్ని కూడా తప్పకుండా అమలు పరుస్తామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఎన్. వెంకటేష్ , స్థానిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మోడీ చేసిన అభివృద్ధి పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలి




**ప్రజాపక్షం/కొత్తకోట :** నరేంద్రమోడీ చేసిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలని రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి అన్నా రు. ఈ సందర్భంగా కొత్తకోట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్ అధ్యక్షుడు ఆ గ్రామంలో ఉన్న బిజెపి కార్యకర్తల 100 ఫోన్ నంబర్లను సోషల్ మీడియా కన్వీనర్‌కు ఇవ్వాలన్నారు. 4వేల మంది బిజెపి కార్యకర్తలతో ఒక గ్రూప్ ఏర్పాటు చేసి రోజు వారిగా చేసే కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా గ్రూప్‌లో పెట్టాలన్నారు. పాలమూరు ఎంపి అభ్యర్థి డి.కె. అరుణ గెలుపు కొరకు ప్రతి కార్యకర్త పని చేసి పాలమూరు గడ్డ మీద బీజేపీ జెండాను ఎగరవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్‌విండో సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

## డిసిసిబి డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి




**ప్రజాపక్షం/పాన్‌గల్ :** సింగిల్‌విండో సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి డైరెక్టర్, పాన్‌గల్ సింగిల్‌విండో చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం పాన్‌గహల్ మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో మహజన సభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్‌విండో ద్వారా ఎరువులు, విత్తనాలను రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. పాన్‌గల్ మండలంలోని వివిధ గ్రామాల రైతులకు రూ. 34,30,94000లను పంట రుణాలను ఇవ్వడం జరిగిందని, రూ. 2,78,89,855లను దీర్ఘకాలిక రుణాలను రైతులకు ఇవ్వడం జరిగిందని తెలిపారు. స్వయం ఉపాధి పథకం ద్వారా రూ. 1,95,95,554ల రుణాలను అందజేసినట్లు తెలిపారు. రైతులు తీసుకున్న పంట రుణాలను రెన్యూవల్ చేసుకోవాలన్నారు. రెన్యువల్ చేసుకుంటే రుణాఫి వర్తిస్తుందా అనే సందేహం రైతుల్లో ఉంది. రెన్యువల్‌కు రుణమాఫికి ఎలాంటి సంబంధం లేదన్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకం ఉంటే ఎడ్యుకేషన్ రుణాలు, నూతన ఇంటి నిర్మాణాలకు కూడా సింగిల్‌విండో ద్వారా రుణాలను మంజూరు చేస్తామన్నారు. రైతుల శ్రేయస్సు కోసం గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ భూములకు పంట రుణాలను ఇవ్వాలని , రైతులు కోరగా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లడం జరిగిందన్నారు. నూతన ప్రభుత్వానికి, స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు చైర్మన్‌తో పాటు విండో డైరెక్టర్లు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యులు మునీరుద్దీన్ , సింగిల్ విండో వైస్ చైర్మన్ బాలయ్య, వివిధ గ్రామాల డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, ప్యాట బాలరాజు, సాయి ప్రసాద్‌గౌడ్ , సిఈఓ భాస్కర్‌గౌడ్ , సింగిల్‌విండో సిబ్బంది రాఘవేందర్ రెడ్డి, వేణు, అమీర్ , భరత్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో వంగూరి సందడి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండలంలోని వెన్నచర్ల గ్రామంలో చెట్లలక్ష్మి బంగారయ్య ఆహ్వానంమేరకు కాంగ్రెస్‌పార్టీ యువనాయకులు, సూర్యప్రతాప్‌గౌడ్ యువసేన నాయకులు, సూర్యప్రతాప్ యువసేన యువనాయకులు వంగూరి రాంప్రసాద్ వివాహ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. నూతన వధూవరులైన సాయిలు శివగంగలకు అక్షింతలువేసి ఆశీర్వదించారు. ఈవివాహ వేడుకల్లో కాంగ్రెస్‌పార్టీ నాయకులు చెట్ల వీరస్వామి, మద్దని అగరయ్య, ఎస్‌ఎంసి వైస్‌చైర్మన్ పద్మ, మాదయ్య పాల్గొన్నారు.



# వ్యూహాత్మకంగా కాంగ్రెస్ అడుగులు

## ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో అధికార పార్టీకే అందాలా?

## బిఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల క్రాస్ ఓటింగ్ ?

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారం చేపట్టిన తర్వాత జరగబోయే మొట్టమొదటి ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే హవా చూయించే విధంగా వ్యూహాత్మకంగా కాంగ్రెస్ నేతలు అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు మెజార్టీ ప్రజాప్రతినిధుల స్థానాలు ఉన్న బిఆర్‌ఎస్‌పై ఎలాగైనా గెలవాలని లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎత్తులు వేశారు. పాలమూరు జిల్లాకే చెందిన సిఎం రేవంత్ రెడ్డి తన సత్తా ఏంటో నిరూపించుకోవాలని లక్ష్యంగా ఎవరు ఊహించని విధంగా మన్నే జీవన్ రెడ్డిని అభ్యర్థిగా ఖరారు చేసి ఉప ఎన్నికల బరిలో నిలిపారు. కాంగ్రెస్ బిఆర్‌ఎస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావించి ఈ ఎన్నికల గోదాలో తాడోపేడో తేల్చుకోన్నాయి. జిల్లా మొత్తం 1439 మంది ప్రజాప్రతినిధుల ఓట్లు ఉండగా, అందులో మెజారిటీ స్థానాలు బిఆర్‌ఎస్ పార్టీ మద్దతుదారులే ఉన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ తరపున నవీన్ కుమార్ రెడ్డి బరిలో ఉన్నారు. ఇరు పార్టీలు తమ మద్దతుదారులను తీసుకొని క్యాంపు రాజకీయాలు ప్రారంభించారు. బుధవారం రాత్రికి ఆయా గ్రామాలకు చేరుకొని గురువారం ఓటు వేసే విధంగా పథకాలు రచించారు. అయితే కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రముఖ వ్యాపారవేత్తను రంగంలో దించడంతో ఎమ్మెల్సీ ఎన్నికలు చాలా కాస్టీగా మారాయి. ఒక్కో అభ్యర్థి కోట్లలో ఖర్చు చేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి. గురువారం నిర్వహించే ఓటింగ్ సందర్భంగా జిల్లాకే చెందిన కొడంగల్ ఎంఎల్‌ఏ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు ఏప్రిల్ నెల 2 వ తేదీన నిర్వహించేందుకు అధికారులు ఏర్పాటు చేశారు.

# 1,082 లీటర్ల మద్యం సీజ్

## జిల్లా ఎస్‌పి గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి ఉండటంతో నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్న ఆరు చెక్‌పోస్టులలో ముమ్మర తనిఖీలు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి గైక్వాడ్‌వైభవ్‌రఘునాథ్ తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో నేటివరకు 11సీజ్ కేసులు నమోదు కావడంతో అందులో రూ.9,69,750 నగదును సీజ్ చేయడం జరిగిందన్నారు. 48 లిక్కర్ కేసులు చేసి 1078 బీర్‌బాటిల్స్, 4లీటర్ల నాటుసారా సీజ్ చేయడం జరిగిందన్నారు. నగదు 4,12,073, 67 బైండోవర్ కేసులు చేసి 94 మందిని బైండోవర్ చేశామన్నారు. అదేవిధంగా 23 ఆయుధాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.

# ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహించాలి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు విధులు నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఈ నెల 28న జరగనున్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల శాసన మండలి ఉప ఎన్నికల నిర్వహణ పోలింగుకు నియమించిన జోనల్ అధికారులు, రూట్ అధికారులు సెక్టార్ అధికారులు, పిఓలు, ఏపిఓలకు, తుది శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ పరిధిలోని 10 పోలింగు కేంద్రాలకు పోలింగు కేంద్రాల వారీగా బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగు మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జోనల్ అధికారులు, సెక్టార్ అధికారులు, రూట్ అధికారులు, పిఒ, ఏపిఓలు ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఎంఎల్‌సి ఉప ఎన్నిక విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఎంఎల్‌సి ఉప ఎన్నిక ఇవిఎంలు ద్వారా కాకుండా బ్యాలెట్ ద్వారా నిర్వహిస్తున్నందున పిఒ, ఎపిఒలు బ్యాలెట్ బాక్స్‌లు ఓపెన్ చేయడం, మూసివేయడం, సీలింగు చేసే పద్ధతిని గురించి తెలుసుకోవాలని అన్నారు. పోలింగు రోజు బాధ్యతగా ఎక్కడ లోపాలు లేకుండా బాధ్యతలు నిర్వర్తించాలని అన్నారు. ఉప ఎన్నికను సమర్ధవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి ఉప ఎన్నిక పరిశీలకురాలు అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక శాఖ ముఖ్య కార్యదర్శి ఏ.వాణి ప్రసాద్, ఎస్పి హర్షవర్ధన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, మహబూబ్‌నగర్ డిఆర్‌ఓ కెవివి రవికుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### ఉప ఎన్నిక పోలింగుకు ర్యాండమైజేషన్ నిర్వహించాలి

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక పోలింగుకు ర్యాండమైజేషన్ నిర్వహించి రిజర్వ్ ఐదుగురితో సహా మొత్తం 15 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ నియమించిన ఎంఎల్‌సి ఉపెన్నిక పరిశీలకురాలు ఏ.వాణి ప్రసాద్ 10 పోలింగ్ కేంద్రాలకు మైక్రో అబ్జర్వర్స్ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తిచేశారు. అనంతరం సూక్ష్మ పరిశీలకులతో సమావేశం నిర్వహించి సాధారణ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఏ.వాణి ప్రసాద్ పోలింగు సందర్భంగా వారు నిర్వహించవలసిన విధులను గురించి అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ ప్రతినిధులుగా నిష్పక్షపాతంగా ఎటువంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా ఎన్నికల నిబంధనలు మేరకు విధులు నిర్వర్తించాలని ఓటింగు కంపార్ట్‌మెంట్ వద్ద ఓటు గోప్యతను పాటించేలా వీడియోగ్రఫీ నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎల్‌సి ఉప ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

## జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి :** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పైకభవనంలో ఏర్పాటు చేసిన శాసనమండలి ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సాయంత్రం సందర్శించి వసతులను పరిశీలించారు. గురువారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగనున్న ఎన్నికల ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహించాల్సిందిగా అధికారులను ఆయన ఆదేశించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం పరిధిలో 101మంది ఓటర్లు బ్యాలెట్‌రూపంలో తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ ఆర్‌డిఓ సురేష్, నాగర్‌కర్నూల్ తహసీల్దార్ చంద్రశేఖర్, ఇతర అధికారులు ఉన్నారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక ఏర్పాట్లపై జిల్లాపరిధిలోని అచ్చంపేట పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల అచ్చంపేట పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అ చ్చంపేట, కొల్లాపూర్ పట్టణంలో ఒక్కో పోలింగ్ కేంద్రం చొప్పున జిల్లాలో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 319 మంది తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో 101 మంది ఓటర్లు, కొల్లాపూర్ నియోజకవర్గంలో 67 మంది ఓటర్లు, అచ్చంపేట నియోజకవర్గంలో 79 మంది ఓటర్లు, కల్వకుర్తి నియోజకవర్గంలో 72 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్నిముందుజాగ్రత్త ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కలెక్టర్‌వెంట అచ్చంపేట ఆర్‌డిఓ, ఇతర అధికారులు ఉన్నారు.



# ఉప ఎన్నికల్లో జీవన్‌రెడ్డి విజయం ఖాయం

## నాగర్‌కర్నూల్ జెడ్‌పి వైస్ చైర్మన్ ఠాగూర్‌బాలాజిసింగ్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గురువారం జరగబోయే ఉప ఎన్నికల్లో భాగంగా బుధవారం మీడియాతో నాగర్‌కర్నూల్ జెడ్‌పి వైస్‌చైర్మన్ ఠాగూర్‌బాలాజిసింగ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల్లో బలమైన నమ్మకం ఏర్పడిందని ఆ నమ్మకంతో రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేశారని గాంధీజి కలలుకన్న గ్రామ స్వరాజ్యస్థాపనలో భాగమే లోకల్‌బాడి అని దీనిని స్థాపించి చేసిన ఘనత కెసిఆర్‌కు దక్కుతుందని కాని ఇప్పుడు ముసలికన్నీరు కారుస్తున్నారని అన్నారు. వంద ఎలుకలు తిన్న పిల్లి తనపాపాల పరిహారం కోసం హాజ్‌కు వెళితే పాపాలు పరిష్కారం అవుతాయా ఆరకంగానే కెసిఆర్ ప్రభుత్వం చేస్తుందని అన్ని సమస్యలపై అవగాహన ఉన్న గొప్పవ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అచ్చంపేట కల్వకుర్తి నుంచి స్వచ్ఛందంగా జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, ఎంపిపిలు కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నారని మార్పు స్పష్టంగా కనిపిస్తుందని ఇప్పటికే ఎనిమిది వందలమంది పార్టీలో చేరారని జీవన్‌రెడ్డి భారీమెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఆగెలుపును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# 4వ నంబర్ పోలింగ్ కేంద్రంలో సకల సౌకర్యాలు

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** గురువారం జరగబోయే మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఉప ఎన్నికకు వనపర్తి ఆర్‌డిఓ కార్యాలయంలో 4వ నంబర్ పోలింగ్ కేంద్రం సకల సౌకర్యాలతో సిద్ధమైంది. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అదనపు కలెక్టర్ రెవెన్యూ, ఎం. నగేష్‌తో కలిసి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. 218 మంది ఓటర్లలో కూడిన 4వ నంబర్ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను కలెక్టర్ పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. పోలింగ్ కేంద్రం చుట్టూ వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలని, అనుమతి లేని వ్యక్తుల్ని పోలింగ్ కేంద్రం పరిసరాల్లో అనుమతించవద్దని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ నగేష్ ,ఆర్‌డిఓ పద్మావతి తదితరులు ఉన్నారు.



# వైద్యులు ఎల్లవేళలా కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/నారాయణపేట ప్రతినిధి :** ప్రజలకు వైద్యం అందించేందుకు వైద్యాధికారులు ఎల్లవేళలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్యశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ సిబ్బంది ఏ పని నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. మక్తల్‌లో ప్రైవేట్ ఆసుపత్రిలకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అడిగారు. కొత్తగా రెండు దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుల వారిగా ఇన్స్పెక్షన్ చేసి క్లియర్ చేయాలని ఆదేశించారు. ఎవరి పనులు వాళ్లే చేసుకోవాలని ఆదేశించడం జరిగింది. బయోమెట్రిక్ హాజరు లేకపోతే జీతం కట్ చేయాల్సి వస్తుందని డిఎంహెచ్‌ఓకు హెచ్చరించారు. విధులకు మూడు రోజులు ఆలస్యమైనచో జీతం కట్ చేస్తారని కలెక్టర్ తెలిపారు. టూర్ డైరీ ముందే సబ్మిట్ చేయాలని బమోమెట్రిక్ ప్రతి రోజు వేయాలని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఓ సౌభాగ్య లక్ష్మీ, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### జిల్లాలో తాగునీటి సమస్య ఉండవు

నారాయణపేట జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపాల్టీలలో ఈ వేసవి కాలంలో తాగునీటి సమస్య ఉండబోదని, జిల్లా ప్రజల అవసరాలకు సరిపడా తాగునీటి సరఫరా చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా జిల్లాలోని 172 గ్రామాలకు కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి చందాపూర్ కుసుమద్‌పల్లి నీటి శుద్ధి కేంద్రం ద్వారా తాగు నీటి సరఫరా జరుగుతోందని, కోయిల్‌సాగర్‌లో ప్రస్తుతం 0.83 టీఎంసీల నీళ్లు నిల్వ ఉన్నాయని ఈ వేసవి కాలంలో కోయిల్‌సాగర్ నుంచి సరఫరా అయ్యే తాగునీటికి ఎలాంటి కొరత ఉండదని కలెక్టర్ చెప్పారు. జూరాల వెనుక జలాల నుంచి జిల్లాలోని 59 గ్రామాలకు పారేవుల, నందిమల్ల పథకాల ద్వారా తాగునీటి జరుగుతుందోందని, ఈ వేసవికి జూరాలలో నీళ్లు తగ్గినా, సగం బండ రిజర్వాయర్‌లో అందుబాటులో ఉన్న 0.7 టీఎంసీల నీళ్లల్లో 0.5 టీఎంసీల తాగునీటికి వినియోగించుకునే అవకాశం ఉంటుందని, ఆయా పథకాల నుంచి కూడా తాగునీటిసరఫరాకు ఎలాంటి ఆటంకం ఉండదని ఆయన పేర్కొన్నారు.

# ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

## జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్



**ప్రజాపక్షం/నారాయణపేట ప్రతినిధి :** మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసన మండలి ఉప ఎన్నికల సందర్భంగా జిల్లా కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి బుధవారం మధ్యాహ్నం జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్ పోలీసులు అధికారులు చేరుకొని బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం సీసీ కెమెరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎస్‌పి తెలిపారు. 80 మంది లోకల్ పోలీసులతో పాటు కేంద్ర సాయుధ పోలీసు బలగాలచే పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్‌పి తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఎవరు గుంపులు గుంపులుగా ఉండకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి లింగయ్య, ఎస్‌బి సిఐ రాంలాల్, నారాయణపేట సిఐ శివశంకర్, ఎస్‌ఐ వెంకటేశ్వర్, ఎంపిడిఓ పాల్గొన్నారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంఎల్‌ఎ



**ప్రజాపక్షం/నారాయణపేట ప్రతినిధి :** బాటసారుల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ప్రశంసించారు. పట్టణానికి చెందిన పండ్ల వ్యాపారి, జై. భవాని ఫ్రూట్ మర్చంట్ యజమాని చందు సింగ్ తన తండ్రి కీ.శే. శివసింగ్ జ్ఞాపకార్థం గత తొమ్మిది సంవత్సరాలుగా చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం స్థానిక కొత్త బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ఫర్ణికారెడ్డి ప్రారంభించి మజ్జిగా, చల్లటి ఫిల్టర్ నీరు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలం వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వస్తున్న బాటసారులు, వాహనదారులు, ప్రయాణికులకు దప్పిక తీర్చేందుకు ప్రతి సంవత్సరం చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. సొంత డబ్బులతో బిస్లరీ కూల్ వాటర్‌ను అందించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు. నీటిని వృధా చేయకుండా సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని తెలియజేశారు. ఎండాకాలంలో పక్షులను రక్షించేందుకు ప్రతి ఒక్కరు తమ ఇంటి దగ్గర నీటిని ఉంచి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లలిత బాయ్ , చందుసింగ్ , దేవిసింగ్ , సుదీర్ సింగ్ , వకిల్ , సంతోష్‌కుమార్ ,రాజేష్ , బాబు, శ్రీను, లింగం , పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి నిర్మాణానికి సాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మండల పరిధిలోని మార్చాల గ్రామానికి చెందిన చెదురుపల్లి కృష్ణయ్య, పంజుగుల గ్రామానికి చెందిన సిహెచ్ రమేష్ ఇల్లు అసంపూర్తిగా ఉండటంతో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, తలకొండపల్లి జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ ఇచ్చిన మాటప్రకారం ఒక్కరికి 30 బ్యాగుల చొప్పున సిమెంట్ అందజేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్వీ కల్వకుర్తి అధ్యక్షుడు ఉప్పలవెంకటేష్ మిత్రబృందం సభ్యులు దారమోనిగణేష్, బిఆర్‌ఎస్వీ కల్వకుర్తి అధ్యక్షుడు వట్టెపుకిశోర్, రమేష్‌రాథోడ్, అంజి పాల్గొన్నారు.



# అంతరిక్షంలో సైనిక కార్యకలాపాలు

## వైమానికదళ ప్రధానాధిపతి చౌధురి

**న్యూఢిల్లీ :** రాజకీయ సంకల్పం, గగనతల శక్తి సామర్థ్యాలు రెండు మేళవించినప్పుడే శత్రుదేశాల సరిహద్దులు దాటి బాలాకోట్ తరహా గగనతల దాడులను సమర్థవంతంగా చేయగలుగుతామని భారత వైమానిక దళ ప్రధానాధిపతి విఆర్ చౌధురి అన్నారు. ''భవిష్యత్ పోరాటాలలో గగనతలశక్తి'' అనే అంశంపై న్యూఢిల్లీలో బుధవారం జరిగిన ఒక సదస్సులో ఆయన మాట్లాడుతూ, దేశాలు గనుక వ్యూహాత్మక ప్రయోజనాలకోసం అంతరిక్షాన్ని ఆధారం చేసుకుని అందుకు తగ్గ వనరులు సమకూర్చుకోవడంపైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించినట్లయితే అంతరిక్ష సైనికీకరణ—ఆయుధీకరణ అనేవి ఒక అనివార్యమైన వాస్తవంగా రూపుదాలుస్తాయిని ఆయన అన్నారు. సైనిక కార్యకలాపాలకు అంతరిక్షం ఒక సంక్లిష్టమైన కేంద్రంగా మారిపోతున్నదని ఆయన అన్నారు.అత్యాధునికమైన పద్ధతుల ద్వారా ఆధునిక సైననిక శక్తులు తెరమీదకు వస్తున్నాయన్నారు.

## జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ 200 రోజులు పని కల్పించండి




**ప్రజాపక్షం/నారాయణపేట ప్రతినిధి :** ఉపాధిహామీ జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ రెండు వందల రోజులు పని కల్పించాలని ఎఐపికెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రశాంత్ డిమాండ్ చేశారు. బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని జిల్లా కార్యాలయంలో భగత్‌సింగ్ భవనంలో ఎఐపికెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కోటి చెన్నప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లాలో అమలవుతున్న పరిస్థితిని కూలీల దుస్థితిపై వివరంగా ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం ముందు ఉంచారు. మండుటెండల్లో గ్రామాల్లో పని చేస్తున్న ఎన్ఆర్జీఎస్ కూలీలకు కనీస వసతులు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పని చేసే ప్రదేశాల్లో కూలీలకు నిలువ నీడ లేదు, తాగునీరు లేదు, దాహార్తి తీర్చుకునేందుకు ఎలాంటి సదుపాయాలు లేవన్నారు. టెంట్లు పనిముట్లు సదుపాయాలు కల్పించవాల్సి ఉండగా ఏ ఒక్క గ్రామం లో ఆ ఏర్పాట్లు లేవన్నారు. గత పదేళ్ల క్రితమే ఉపాధి హామీ కూలీలకు పనిముట్లైన గడ్డపారాలు పారలు టెంట్లు సరఫరా చేశారు కాని నేటికి అవి ఎక్కడ కూడ కనిపించడం లేదని, వేతనంతో పాటు పనిముట్లకు ఇవ్వవాల్సిన రూపాయలు కూలీలకు కలిపి ఇవ్వాల్సి ఉండగా అది కూడా జరగటం లేదన్నారు. ఉపాధిహామీలో పని చేస్తున్న కూలీలకు పని భద్రత కల్పించాలని, ఎండ తాపం తట్టుకోవడానికి మంచినీరు, ఒఆర్ఎస్ ఇతర వైద్య సహాయం వేసవి కాలంలో అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐపికెఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాములు, జిల్లా సహాయ కార్యదర్శి హాజీ మలంగ్, నాయకులు కనక రాముడు, సాయిలు, నర్సింహ, రాజులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది స్థానికంగా ఉండి సేవలందించాల్సిందే : డిఎంహెచ్ఒ



**ప్రజాపక్షం/గజ్వేల్ :** వైద్య సిబ్బంది స్థానికంగా ఉండి సేవలందించాల్సిందేనని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. మర్కూక్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, దీనిని దృష్టిలో పెట్టుకొని రోగులకు సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దని, నిరంతరం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఆరోగ్య జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుండగా, వైద్య సిబ్బంది సహకరించి రాష్ట్రంలోనే సిద్దిపేటను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుకుందామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, వైద్యులు డాక్టర్ దీప, డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికశాఖలో శాశ్వత అధికారిని నియమించాలి : రాములు



**బాన్సువాడ :** బాన్సువాడ పట్టణంలోని కార్మికశాఖ కార్యాలయం ముందు తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్మికశాఖ జూనియర్ అసిస్టెంట్ షేక్ దావూద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాన్సువాడ కార్మికశాఖకు రెగ్యులర్ ఏఎల్ఓ ను నియమించాలని, ఇటీవల ఇన్‌చార్జి ఏఎల్ఓగా పనిచేసి బదిలీపై వెళ్ళి 12 రోజులు గడుస్తున్నప్పటికి పూర్తిస్థాయి ఏఎల్ఓను నియమించకపోవడం వలన భవన నిర్మాణ కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే శాశ్వత అధికారిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు శంకర్, కిష్టయ్య, లక్ష్మణ్, బాల్‌రాజు, పోచవ్వ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## అగ్నికి అడవులు ఆహుతి



**ప్రజాపక్షం/గోవిందరావుపేట :** ఎండాకాలం ఆరంభంలోనే ముందస్తు ఎండలు విపరీతంగా కొట్టడం వలన అడవుల్లోని ఆకులు, వృక్షాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామ శివారులో గల 163 జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న అడవుల్లో ప్రతి రోజు ఎక్కడో ఒక చోట ఎండిపోతున్న చెట్ల ఆకులు రాలి ఎవరో ఒక ఆకతాయిల వలన అడవికి అగ్గి అంటించడంతో అడవుల్లోకి ఆకులు, వృక్షాలు అంటుకొని అడవులు దగ్ధం అవుతున్నాయి. ఇలా అడవులకు అగ్గి రాసుకోవడం వలన పర్యావరణం దెబ్బతినడంతో పాటు అడవుల్లో ఉన్న వన్యప్రాణులు పెద్ద వృక్షాలు కూడా దెబ్బతిని అడువుల మనుగడకు ప్రమాదం ఉంది. ఆకతాయిల వలన గాని ఏ ఇతరత్ర కారణాల వలన గాని అడుగులకు అగ్గి రాసుకోకుండా ఫారెస్టు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుంటే అభయారణ్యం ఆగం కాకుండా అందులో ఉన్న వన్యప్రాణులు మరణానికి గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు రహదారి వెంట వెళ్లే వాహనదారులు కోరుకుంటున్నారు.

# నిత్యం ప్రజాక్షేత్రంలో ఉండే నాయకుడికే ప్రజాదరణ



### ప్రజల నమ్మకానికి అనుగుణంగా అభివృద్ధికి బాటలు వేస్తా
### ఆత్మీయ సమ్మేళన సభలో ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి :** ఐదు దశాబ్దాలుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అందించిన సేవల ఫలితంగానే తనని ఎంఎల్ఏగా ఎన్నుకొని చట్టసభకు పంపారని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని చాతకొండ హమాలీ కాలనీలో గ్రామ పరిధిలో ప్రజలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన సభలో కూనంనేని మాట్లాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడికి ప్రజాదరణ లభిస్తుందని, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయని అన్నారు. అహంకారంతో విర్రవీగే నాయకుడిని, ప్రజాప్రతినిధి జనం ఆదరించారని అన్నారు. పేద ప్రజలు, కార్మికులు, కర్షకుల కోసమే పుట్టిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, అధికారం ఉన్నా లేకున్నా యావత్ కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షమే వహిస్తుందని తెలిపారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా ప్రజా సమస్యలకు పరిష్కారం కోసం అనునిత్యం శ్రమిస్తానని, నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసే విషయంలో అధికార పార్టీ పైన పోరాడేందుకు వెనుకాడబోనని పునరుద్ఘాటించారు. లక్ష్మీ దేవిపల్లి మండలంలో మునుపెన్నడూ లేనివిధంగా వంద రోజుల్లోనే రూ.5కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని, ప్రజలకు కనీస మౌళిక వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించామని పేర్కొన్నారు. అనంతరం గ్రామ ప్రజలు కూనంనేనితో పాటు సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషాను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఎలుక రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సారయ్య, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, బంధం నాగయ్య, బాతులా సురేష్, పల్నాటి ప్రశాంత్, గుత్తుల శ్రీనివాస్, మిర్యాల రాము, రవీందర్ పాల్గొన్నారు.

## జీవ నియంత్రణ పద్ధతులే మేలు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** వరి పంటలో తెగుళ్లను నివారించి దిగుబడి సాధించడానికి జీవ నియంత్రణ పద్ధతులు అవలంబించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం హైదరాబాద్ డా.ఏ.రామకృష్ణ బాబు తెలిపారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ కుమార్, పోచంపల్లి వ్యవసాయ శాఖ ఉపసంచాలకులు బుఖ్యా దేవ్‌సింగ్ బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజన ఉపప్రణాళిక కింద వరిలో సమగ్ర సస్యరక్షణ చర్యల గురించి ఇంద్రియాల, గౌసికొండ, రామలింగంపల్లి గిరిజన రైతులకు అవగాహన నిర్వహించారు. శాస్త్రవేత్త రామకృష్ణ మాట్లాడుతూ వరి పంటలో ఎక్కువగా ఆశించే కాండం తొలుచు పురుగు, అగ్గితెగులు లాంటి వాటికి రైతులు ఇబ్బడి ముబ్బడిగా పురుగు మందులు వాడి పెట్టుబడి ఖర్చులు పెంచుకుంటున్నారు. తద్వారా పురుగులు మందులు తట్టుకునే గుణంతో పాటు పర్యావరణాన్ని కలుషితం అవుతుందన్నారు. వరి పంటలో తెగుళ్లను నివారించి దిగుబడి సాధించడానికి జీవ నియంత్రణ పద్ధతులు మేలు అన్నారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్‌కుమార్, ఏడిఏ దేవ్ సింగ్ మాట్లాడు ప్రతి రైతు పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని పెట్టుబడిని తగ్గించి వ్యవసాయ పనులు చేసుకుంటే మంచి ఆదాయంతో పాటు కలుషితం లేని పంటను మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం గిరిజన రైతులకు ఉప ప్రణాళిక కింద వరి పంటకు ఒక ఎకరాకు సరిపడే కాండము తులుచు లింగాకర్షక బుట్టలను, ట్రైకో గ్రామ పరాన్న జీవులను, వేప నూనె, జీవ నియంత్రణ ఉపకరణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ అలీఖాన్, విస్తరణాధికారులు శిరీష, పవిత్రం, రాజశేఖర్, క్రాంతి, గిరిజన రైతులు పాల్గొన్నారు.

# వేసవిలో సమృద్ధిగా తాగునీరు అందించాలి

### పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా




**ప్రజాపక్షం/ఏటూరు నాగారం :** వేసవి కాలంలో ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందించాలనీ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్, ఆర్డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. బుధవారం ఏటూర్ నాగారం, మండలంలోని రాంనగర్ గోదావరి నది ఇంటెక్ వెల్, వాజేదు మండలంలోని పుసూరు ఇంటెక్ వెల్ ను లెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు తాగునీరు పంపిణీ చేయడంలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని, దానిలో భాగంగానే ఇంటెక్ వెల్ నీటి నిల్వలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున నీటిని నిరుపయోగంగా వాడకూడదని నిత్యావసర అవసరాల కోసం ముడి నీరును ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ఉన్నటువంటి పంపు హౌజ్ ల ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు అందించాలని పంపిణీ విషయంలో సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఏటూర్ నాగారం మండలం రాంనగర్ ఇంటెక్ వెల్ ద్వారా 57 గ్రామాలకు తాగునీటిని అందించడం జరుగుతుందని, వాజేడు మండలం పూసూరు ఇంటెక్ వెల్ ద్వారా వెంకటాపూరం, కన్నాయిగూడెం, వాజేడు, ఏటూర్ నాగారం మండలాలలోని రెండు వందల యాభై ఆరు గ్రామాలకు తాగునీటిని అందించడం జరుగుతుందని మంగపేట మండలంలోని మూడు గ్రామాలకు కూడా పుసురు నుంచే త్రాగునీటిని అందించడం జరుగుతుందని, రామప్ప పంప్ హౌస్ ద్వారా గోవిందరావుపేట ములుగు వెంకటాపూర్ మండలాల లోని 165 గ్రామాలకు తాగునీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. ములుగు జిల్లా వ్యాప్తంగా 2,346 బోర్ వెల్స్ ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో తాగునీటి సమస్య లేదని ప్రతిమండలంలో, ప్రతి గ్రామంలో ప్రత్యేక అధికారులు ప్రజలకు అందుబాటులో ఉన్నారని త్రాగునీటి విషయంలో సమస్యలు తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ చీఫ్ కృపాకర్‌రెడ్డి గోదావరినదిలోని రాంనగర్, పూసూరు ఇంటెక్ వెల్ పనితీరు, నీటి సామర్థం, నీటి పంపిణీ విధానం తదితర అంశాలను ఉన్నత అధికారులకు వివరించారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఎస్ఈ మల్లేశం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

### గోదావరి పరీవాహక ప్రాంతాల పరిశీలన

ఏటూరు నాగారం మండలంలోని రాంనగర్ ఇంటెక్ వెల్‌ను ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా పరిశీలించారు. మండలంలోని ములకట్ట వద్ద పూసురు ఇంటెక్ వెల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి నీటిమట్టం పడిపోతుండడంతో రైతులకు, ఆయా గ్రామాల ప్రజలకు సకాలంలో సాగు నీరు, తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఆరు బోర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమైతే మరిన్ని బోర్లు ఏర్పాటు చేసి ప్రజలకు నీటి కొరత తీర్చే విధంగా ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డబ్ల్యూఎస్ ఇంజరింగ్ చీఫ్ కృపాకర్‌రెడ్డీ, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రావు, ఎస్ఈ మల్లేశం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మనిక్యారావు తదితరులు పాల్గొన్నారు.

# భావితరాలకు నాటక సాహిత్య రచనలు

### సాహిత్య పరిశోధకులు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండటౌన్ :** తెలంగాణ నాటక సాహితీ లోకానికి ఎంతో మంది నాటక రచయితల రచనలు అందడం లేదని, అలాంటివారి సాహిత్యాన్ని వెలికితీసి భావితరాలకు అందజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ కవి, సాహిత్య పరిశోధకులు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నాగార్జున ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు నాటకం సాహిత్య సమాలోచన అన్న అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సౌజన్యంతో జరిగిన ఈ సదస్సు ప్రారంభానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నాటక సాహిత్యంపైన రావలసినంత పరిశోధన జరగలేదని ఇలాంటి సదస్సులు నాటక సాహిత్యం పట్ల ఆసక్తిని పెంపొందింపజేయడమే కాకుండా విద్యార్థులను పరిశోధకులుగా సాహిత్య అభిమానులుగా తీర్చిదిద్దేటట్లు చేస్తాయన్నారు. జాతీయ ఉత్తమ సినీ విమర్శక పురస్కార గ్రహీత డాక్టర్ ఎం పురుషోత్తమాచార్యులు మాట్లాడుతూ తెలుగు నాటకరంగం ఆరంభ వికాసాలను గురించి సమగ్రంగా తన ఉపన్యాసం ద్వారా తెలియజేశారు. నాటక రచయితతో పాటు నటులు, నాటక ప్రయోక్త అందరూ తమ తమ బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించినప్పుడే ఆ నాటకం జనరంజకం అవుతుందని, పది కాలాలపాటు నిలుస్తుందన్నారు. ఓయూ తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకరశర్మ, కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య కరిమిళ్ళ లావణ్య, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తందు కృష్ణ కౌండిన్య, ఎన్.లవేందర్‌రెడ్డి, డాక్టర్ వెల్దండి శ్రీధర్, జి.గోవర్ధన గిరి, డాక్టర్ టి.సైదులు, ఎస్ ప్రభాకర్, ఎం.లింగస్వామి, బి.రమ్య, డి.అంజయ్య, గ్రంథ పాలకులు డాక్టర్ ఎ.దుర్గాప్రసాద్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడే వారిని గెలిపించండి: చెరుపల్లి



**ప్రజాపక్షం/రామన్నపేట:** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే వారిని ప్రజలు ఆదరించి గెలిపించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో భువనగిరి సీపీఎం ఎంపీ అభ్యర్థి జహంగీర్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా ప్రజా ఉద్యమాలకు సారథ్యం వహించిన జహంగీర్‌ను అభ్యర్థిగా ప్రకటించడం జరిగిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నిలిపిన అభ్యర్థులతో పోల్చినప్పుడు జహంగీర్ ప్రజానాయకుడు అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. వరి పంటకు రూ.500 బోనస్‌ను ఆ యాసంగి నుంచి అమలు చేయాలన్నారు. రైతుబంధు ఇవ్వాలని, వ్యవసాయ పరికరాలపై సబ్సిడి కొనసాగించి కరువు మూలంగా నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు 10లక్షల ఎకరాల భూమిని పంచితే భువనగిరి పార్లమెంట్ పరిధిలోనే 4లక్షల ఎకరాల భూమి ఉందన్నారు. కార్యక్రమంలో బొంతల చంద్రారెడ్డి, కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధా, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేక అశోక్‌రెడ్డి, బొడ్డుపల్లి వెంకటేశం, బోయిని ఆనంద్, మీర్ ఖాజావలి, బల్గూరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో కుస్తీ గల్లీలో దోస్తీ

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/ఆలేరు :** బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు గల్లీలో కుస్తీ ఢిల్లీలో దోస్తీ అన్న రీతిలో వ్యవహరిస్తున్నాయని ఎఐసిసి స్పోక్స్ పర్సన్ సుజాతపాల్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం ఆలేరు నియోజకవర్గ కేంద్రంలోని ఇందిరా భవనంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు ఎజాస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇటీవల బీజేపీ యొక్క ఎలక్ట్రాన్ బ్యాండ్ పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని భావించి నిషేధించిందన్నారు. ఈ పథకం కింద స్వీకరించిన విరాళాలను బహిర్గతం చేయాలని రాజకీయ పార్టీలను కోర్టు ఆదేశించిందన్నారు. ఎన్నికల విరాళాలపై పూర్తి సమాచారాన్ని మార్చి 2024 మార్చి 6 లోపు బహిరంగపరచాలని ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాని ఆదేశించిందన్నారు. ఎన్నికల్లో నల్లధనానికి వ్యతిరేకంగా నిర్ణయాత్మక చర్యగా ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా విస్తృతం స్వాగతించబడిందన్నారు. సమాచారం పబ్లిక్‌గా మారిన తర్వాత ఎంపిక చేసిన కార్పొరేట్లతో తన సంబంధాలను బహిర్గతం చేసే అవకాశం గురించి బిజెపి స్పష్టంగా ఆందోళన చెందుతుంది. సమాచారాన్ని పంచుకోవద్దని మోడీ ప్రభుత్వం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాపై ఒత్తిడి తెచ్చింది. కాంగ్రెస్ పార్టీ బ్యాంకు అకౌంటు సీజ్ చేయడం కుట్రపూరిత చర్య అని ఎలక్షన్ నోటిఫికేషన్‌కు ముందు ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీకి చెందిన 11 బ్యాంకు అకౌంట్లను సీజ్ చేయడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు అండం సంజీవరెడ్డి, బుజ్జ సంధ్యా రెడ్డి, బండ్రు శోభారాణి, మండల ఎంపీపీ గంగ మల్ల అశోక్, యాదగిరిగుట్ట మండల పార్టీ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, నాయకులు సుంకరి విక్రమ్, నాగరాజు, అఖిల్, సిద్ధులు, భాస్కర్ పాల్గొన్నారు.



## కేరళ సిఎం కుమార్తెపై మనీలాండరింగ్ కేసు

**కొచ్చి:** కేరళ సిఎం పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌తోపాటు మరికొందరిపైనా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అక్రమ నగదు చలామణి చట్టం కింద కేసు నమోదు చేసింది. ఆమెకు చెందిన ఐటి సంస్థకు ఓ ప్రైవేటు కంపెనీ అక్రమంగా చెల్లింపులు చేసిందనే ఆరోపణలతో కేసు నమోదు చేసినట్లు ఇడి అధికారులు తెలిపారు. దీని విచారణకు సంబంధించి వీణాతో పాటు మరికొందరికి త్వరలో సమన్లు జారీ చేయనుంది. కొద్ది రోజుల క్రితం కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ కార్యాలయం (ఎస్ఎఫ్ఐఒ) దాఖలు చేసిన ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుని వీణాతోపాటు ఆమె సంస్థ, మరికొందరిపై ఇడి పిఎంఎల్ఎ కేసు నమోదు చేసింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ అనే సంస్థ వీణాకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి 2018–19 మధ్య అక్రమంగా రూ.1.72 కోట్లు చెల్లింపులు చేసినట్టు ఆదాయపన్ను శాఖ గుర్తించింది. కొచ్చిన్ మినరల్స్‌కు ఎక్సాలాజిక్ ఎలాంటి సర్వీస్‌ను అందించకుండానే ఈ చెల్లింపులు జరిగినట్లు ఐటి శాఖ పేర్కొంది. దీంతో ఎక్సాలాజిక్‌పై ఎస్ఎఫ్ఐఓ విచారణ జరిపి అక్రమంగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించింది. మరోవైపు ఎస్ఎఫ్ఐఓ విచారణకు వ్యతిరేకంగా ఎక్సాలాజిక్ దాఖలు చేసిన పిటిషన్‌ను కర్ణాటక హైకోర్టు ఇప్పటికే కొట్టివేసింది.

## మహారాష్ట్రలో 8 స్థానాలకు విబిఎ అభ్యర్థుల ప్రకటన

**అకోలా :** మహారాష్ట్రలో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ) కూటమితో సంబంధం లేకుండా వంచిత్ బహుజన్ అఘాడీ (విబిఎ) పార్టీ ఎనిమిది లోక్‌సభ స్థానాలకు తన అభ్యర్థులను ప్రకటించింది. దీంతో ఇప్పటివరకూ కొనసాగిన సస్పెన్స్‌కు తెరపడింది. విబిఎ పార్టీ నాయకుడు, బి.ఆర్.అంబేద్కర్ మనుమడు ప్రకాశ్ అంబేద్కర్ బుధవారం నాడు పత్రికకాగోష్టిలో మాట్లాడుతూ, తాను అకోలా లోక్‌సభ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఎంవిఎలో భాగస్వాములుగా ఉన్న కాంగ్రెస్, ఎన్‌సిపి (శరద్ పవార్), శివసేన (యుబిటి)లపై విమర్శలు గుప్పించారు. వీరంతా రాజకీయాల్లో వంశపారంపర్య రాజకీయాలను పెంచిపోషించేందుకే తమ పార్టీని ఉపయోగించుకోవాలని ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ విధమైన పద్ధతును తమ పార్టీ ప్రతిఘటిస్తుందని అన్నారు. భండారా–గోండియా నుండి విబిఎ అభ్యర్థిగా సంజయ్ కేవత్‌ను, గడ్చిరోలీ నుండి హితేశ్ మాధవిని, చంద్రాపూర్ నుండి రాజేశ్ బెల్లెను, బుల్ఢానా నుండి వసంత్ మాగర్‌ను, అమరావతి నుండి ప్రకాగ్త పిల్లెవాన్‌ను, వార్ధా నుండి రాజేంద్ర సలుంఖేను బరిలోకి దింపామని చెప్పారు. అదేవిధంగా యవత్మాల్–వాషిం నుండిఖేమ్ సింగ్ పవార్‌ను పోటీకి దించామని చెప్పారు. ఎంవిఎ కూటమితో ఒప్పందం కుదరకపోవడంతో ఆయన స్వతంత్రంగా అభ్యర్థులను పోటీకి దించారు.

## దిలీప్ ఘోష్, సుప్రియకు ఇసి షోకాజ్ నోటీసులు

**న్యూఢిల్లీ :** బిజెపి నాయకుడు దిలీప్ ఘోష్, కాంగ్రెస్‌పార్టీ నాయకురాలు సుప్రియా శ్రినాటేలకు కేంద్ర ఎన్నికల సంఘం షో కాజ్ నోటీసులు జారీ చేసింది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కంగనా రనౌత్‌లకు వ్యతిరేకంగా వారిద్దరూ నీచమైన, ప్రమాదకరమైన వ్యాఖ్యలు చేశారన్న కారణంగా ఈ సంజాయిషీ నోటీసులు ఇసి జారీ చేసింది. హిమాచల్ ప్రదేశ్‌లో మండీ లోక్‌సభ నియోజకవర్గం నుండి కంగనా రనౌత్ బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఘోష్, శ్రినాటేలు చేసిన వ్యాఖ్యలు ఏ మాత్రం మర్యాదకరమైన పద్ధతిలో లేవని ఎన్నికల సంఘం వారిపై మండిపడింది.

## 222 బిల్లులు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల చట్టాల (సవరణ) బిల్లు 2021 కూడా ఉన్నాయి. ఎడిఆర్, నేషనల్ ఎలక్షన్ వాచ్ (ఎన్ఐడబ్ల్యు) కలిసి చేసిన విశ్లేషణ నివేదికను మంగళవారం విడుదల చేశాయి. ఈ నివేదిక 17వ లోక్‌సభ, సభ్యుల పనితీరును ప్రతిబింబిస్తుంది. ఈ నివేదక ప్రకారం... 17వ లోక్‌సభ కాలంలో 240 బిల్లులు ప్రవేశపెట్టారు. అందులో 222 బిల్లులు ఆమోదం పొందాయి. వీటికి అదనంగా 11 బిల్లులను ఉపసంహరించుకోగా, ఆరు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కేవలం ఒక్క బిల్లు మాత్రమే రాష్ట్రపతి ఆమోదానికి వెళ్లింది. ఈ లోక్‌సభ పదవీ కాలంలో 273 సిట్టింగ్‌ల కాగా, ఒక సభ్యుడు సగటున 165 ప్రశ్నలు అడిగగా, 189 సార్లు సభకు హాజరయ్యారు. ఛత్తీస్‌గఢలో నుంచి అత్యధికంగా ఎంపిలు సభకు హాజరయ్యారు. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించిన 11 మంది 216 సిట్టింగ్‌ల్లో పాల్గొన్నారు. అయితే అతి తక్కువగా అరుణాచల్ ప్రదేశ్‌లోని సభ్యులు హాజరయ్యారు. రాష్ట్రంలోని ఎంపిల్లో ఇద్దరు మాత్రమే కేవలం 127 సిట్టింగ్‌ల్లో పాల్గొన్నారు. మహారాష్ట్ర నుంచి ప్రాతనిధ్యం వహిస్తున్న ఎంపిలు అత్యధికంగా తమ గళాన్ని విప్పారు. 49 మంది సభ్యులు సగటున 315 చొప్పున ప్రశ్నలను అడిగారు. పార్టీల వారీగా పరిశీలిస్తే... ఎన్‌సిపి చెందిన ఐదుగురు ఎంపిలు సగటున 410 చొప్పున ప్రశ్నలు సంధించారు. మరోవైపు అప్నాదళ్‌కు చెందిన ఇద్దరు సభ్యులు సగటున కేవలం ఐదు ప్రశ్నల చొప్పున మాత్రమే అడిగారు. టిడిపి సభ్యులు 273 సిట్టింగ్‌లకు గానూ, 229 సిట్టింగ్‌లలో పాల్గొనగా, ఆప్ సభ్యులు అతి తక్కువగా సగటున 57 సిట్టింగ్‌లకు మాత్రమే హాజరయ్యారు. పార్లమెంటరీ కార్యకలాపాల్లో పాల్గొన్న పది మంది సభ్యులు చురుకుగా పాల్గొన్నట్లు ఎడిఆర్ తన విశ్లేషణలో తేల్చింది. వీరు అత్యధికంగా ప్రశ్నలు సంధించారు. బిజెపి బలూర్‌ఘాట్ ఎంపి సుకంత్ మజుందార్ 596 ప్రశ్నలు లేవనెత్తి మొదటి స్థానంలో నిలిచారు. అయితే అత్యధికంగా ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వ్యవసాయం, రైతు సంక్షేమం, రైల్వేలపైనే ప్రశ్నలు అడిగినట్లు ఎడిఆర్ విశ్లేషించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com